

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 6

బుధవారం 29-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




పాన్-ఆధార్ గడువు పొడిగింపు

పాన్, ఆధార్ అనుసంధానం గడువు జూన్ 30 వరకూ పొడిగింపు. - 13లో



సన్‌రైజర్స్ సరికొత్తగా...

పలు కీలక మార్పులతో ఐపీఎల్ సీజన్‌కు హైదరాబాద్ జట్టు సిద్ధం. - 12లో



ఆ బంగ్లాతో ఎన్నో జ్ఞాపకాలు

నాలుగుసార్లు ఎంపీగా అధికారిక బంగ్లాతో ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయని, అయినప్పటికీ బంగ్లాను ఖాళీ చేస్తానని రాహుల్ పేర్కొన్నారు.

- వివరాలు 6లో



కన్నడనాట... రిజర్వేషన్ల రగడ

ముస్లింలకు అందుతున్న 4% రిజర్వేషన్లను రద్దు చేసి వక్కలిగలు, లింగాయత్‌లకు పంచడంపై కర్ణాటకలో కలకలం రేగుతోంది.

- వివరాలు 6లో



పెరిగిన ఈపీఎఫ్‌వో వడ్డీ రేటు

ఈపీఎఫ్‌వో డిపాజిట్లపై వడ్డీ రేటును 2022-23 ఆర్థిక సంవత్సరానికి 8.15 శాతానికి పెంచుతూ ఈబీటీ నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 6లో



'సీతమ్మ' పనులు నిలిపివేయండి

సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని ఎన్జీటీ చెన్నై ధర్మాసనం తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

- వివరాలు 2లో

రూ.100 కోట్ల దావా

బండి సంజయ్, రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

ప్రశ్నపత్రాల లీక్‌కు సంబంధించి నాపై నిరాధార, అసత్య ఆరోపణలు చేస్తున్నారు

- అవి నా పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించాయి
- వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయి
- వారంలోగా వాటిని వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి
- లేనిపక్షంలో దావాను ఎదుర్కోవాల్సి ఉంటుంది
- ఐపీసీ 499, 500 సెక్షన్ల కింద ఇద్దరికీ నోటీసులు
- ఇద్దరు ఎంపీల ఢిల్లీ చిరునామాలకు కూడా న్యాయవాది ద్వారా పంపిన మంత్రి
- ఇవే సెక్షన్ల కింద రాహుల్‌గాంధీకి ఇటీవల జైలు శిక్ష



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్‌కు సంబంధించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్.. తనపై నిరాధారమైన, అసత్య ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారికి తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. వారిద్దరూ తనపై చేసిన వ్యాఖ్యలను వారం రోజుల్లోపు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పకుంటే రూ.100 కోట్ల పరువు నష్టం దావాను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు.

వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు

'ఈ నెల 17 నుంచి 25 వరకు వివిధ టీవీ చానెళ్లతో పాటు డిజిటల్, సోషల్ మిగతా 2వ పేజీలో ▶

లీకేజీ దొంగలకు కేటీఆర్ అండ

ఈ అంశంపై ఆయన హడావుడి, తొందరపాటు ప్రజలకు అర్థమవుతోంది

- మంత్రి కనుసన్నల్లోనే 'సిట్' విచారణ జరుగుతోంది
- ఢిల్లీలో మీడియాతో రేవంత్‌రెడ్డి

2లో

కేటీఆర్‌ను విచారిస్తే నిజాలు తెలుస్తాయి

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 2లో

అనర్హత వేటే ఆయుధంగా... కాంగ్రెస్ ఆందోళన పథం

విపక్షాల ఐక్యతకు చొరవ

- స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!
- త్వరలో 'జై భారత్ మహా సత్యాగ్రహం'.. నెలపాటు జాతీయ స్థాయిలో ఆందోళనలు



పార్లమెంట్ బయట విపక్ష ఎంపీల నిరసన

జాతీయ స్థాయిలో విపక్షాల ఐక్యత దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి! వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనేందుకు విపక్షాలన్నింటినీ ఒక్కతాటిపైకి తెచ్చే ప్రయత్నాలకు కాంగ్రెస్ పదును పెడుతోంది! రాహుల్‌పై అనర్హత వేటునే ఇందుకు ఆయుధంగా మలచుకుంటోంది. రాహుల్‌పై వేటు విషయమై లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని యోచిస్తోంది. ఏప్రిల్ తొలి వారంలో విపక్షాల ముఖ్య నేతలతో సమావేశం కానుంది. 6లో



అవినీతిపరులను కాపాడేందుకే.. విపక్షాల ఉద్యమం

- దేశ వ్యతిరేక శక్తులు ఏకమవుతున్నాయి.. విపక్షాలపై మోదీ విసుర్లు
- బీజేపీ ఎంతగా గెలుస్తుంటే అంతగా విమర్శలు
- అయినా అవినీతిపై చర్యలు ఆగవని బీజేపీ పీపీ భేటీలో వ్యాఖ్యలు



రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల కేసులో విచారించనున్న అధికారులు
- ఆర్థిక నేరాలకు కేరాఫ్‌గా మార్గదర్శి
- కేసు దర్యాప్తు వేగవంతం

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమ వ్యవహారాలకు సంబంధించిన కేసులో విచారించేందుకు సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఎండీ చెరుకూరి శైలజకు సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దర్యాప్తులో భాగంగా రామోజీరావు, శైలజను విచారించాల్సిన అవసరం ఉందని నిర్ధారించిన సీఐడీ వారిద్దరిని ఈ నెల 29న గానీ 31న గానీ లేదా ఏప్రిల్ 3నగానీ 6నగానీ విచారించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముందుగా సమాచారం అందజేస్తూ వారికి అనువైన తేదీని తెలియజేయాలని సూచించింది. రామోజీరావు, శైలజ వారి నివాసంలోగానీ మిగతా 10వ పేజీలో ▶

మూసీపై 55 కి.మీ. ఎక్స్‌ప్రెస్ వే

రూ. 10 వేల కోట్లతో నిర్మిస్తాం: కేటీఆర్

- రాచకొండలో ఫిలిం సిటీకి స్థలం గుర్తించాం
- ఆధునిక వసతులతో చెరువులను బాగు చేస్తున్నాం.. మూడేళ్లలో రాయదుర్గం – శంషాబాద్ మెట్రో పూర్తి చేస్తాం

3లో

హైదరాబాద్ మెట్రోపై ఎందుకు వివక్ష?

- మెట్రో రైలు రెండో దశ సాధ్యం కాదన్న కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం
- సాక్షి కథనం 'మెట్రో రెండో దశ దూరమే!'పై స్పందించి కేంద్రమంత్రి పూరీకి లేఖ

3లో



రైతులకు సాయంపై తక్షణ చర్యలు

అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం

3లో

పంటల నష్టంపై పూర్తి వివరాలు సేకరించాలని సూచన

- రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభించాలని స్పష్టీకరణ
- పేదలకు ఇళ్లు, పోడు భూములకు పట్టాలపైనా సమీక్ష
- పట్టాల పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామన్న సీఎం

10,783 కనెక్షన్లకు 'జీరో' బిల్లు!

జీరో యూనిట్లు వాడినట్లు తప్పుడు బిల్లుల జారీ

- నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ అవకతవకలు
- టీఎస్ఎస్పీడీసీఎల్‌కు రూ. లక్షల్లో ఆదాయ నష్టం
- విజిలెన్స్ విచారణతో వెలుగులోకి.. 41 మందిపై చర్యలకు సిఫారసు
- అయినా వారిపై ఇంకా పడని సస్పెన్షన్?

వివరాలు 5లో



మీరు రైతులా! దున్నపోతులా!

- రైతుల సమావేశంలో అన్నదాతలను దుర్భాషలాడిన మంత్రి మల్లారెడ్డి
- నిరసన తెలిపిన రైతులు
- ఆందోళనతో అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

5లో

రెండు ప్రయత్నాల్లో పూర్తి చేయొచ్చు

ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షలపై ఉక్రెయిన్ విద్యార్థులకు 'సుప్రీం' శుభవార్త 14లో



నాపై కుట్రలు చేశారు

- కావాలనే నిరాధార ఆరోపణలు
- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

5లో

క్లుప్తంగా...

మే నెలాఖరుదాకా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలను మే నెలాఖరు వరకు నిర్వహించుకోవచ్చని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వెల్లడించారు. ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ కేడర్‌తో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఇటీవల ఆదేశించారు. ఆత్మీయ సమ్మేళనాల పర్యవేక్షణ, పార్టీ నేతల సమన్వయం కోసం జిల్లాలవారీగా పార్టీ ఇన్‌చార్జులను కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో క్లస్టర్ల వారీగా మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు వరుసగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమావేశాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు గతంలో ప్రకటించిన గడువును పొడిగిస్తున్నట్లు తాజాగా కేటీఆర్ ప్రకటించారు.

ఎమ్మెల్సీ కవిత ఫోన్ల తనిఖీ!

ఈడీ కార్యాలయానికి వచ్చిన న్యాయవాది భరత్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాధీనం చేసిన ఫోన్లను ఈడీ అధికారులు తనిఖీ చేసినట్లు సమాచారం. ఫోన్ల తనిఖీ నిమిత్తం కార్యాలయానికి స్వయంగా లేదా ప్రతినిధిని పంపాలని కవితను ఈడీ సోమవారమే కోరినట్లు తెలిసింది. ఈ మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్ మంగళవారం ఈడీ కార్యాలయానికి వచ్చారు. నిబంధనల ప్రకారం విచారణ ఎదుర్కొంటున్నవారు లేదా ప్రతినిధి రావాలని ఉండటంతో భరత్ ఈడీ కార్యాలయానికి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఉదయం 11 గంటల తర్వాత ఈడీ కార్యాలయానికి చేరుకున్న భరత్ సాయంత్రం ఐదు గంటల సమయంలో బయటకు వచ్చారు. అనంతరం మీడియాతో వివరాలు చెప్పడానికి ఆయన నిరాకరించారు.

బీజేపీ వ్యతిరేక శక్తులను ఐక్యం చేస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం



యాచారం: బీజేపీ వ్యతిరేక శక్తులను ఐక్యం చేసి కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం చేపట్టిన జనచైతన్య యాత్ర మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి, మాల్, యాచారం, గునుగల్ గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయా సభల్లో వీరభద్రం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు పెద్ద ప్రమాదకరంగా మారిందని మండిపడ్డారు. హిందుత్వం పేరుతో భవిష్యత్‌లో మైనార్టీ వర్గాలను తరిమేసేవిధంగా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మునుగోడు ఎన్నికలో గెలుపు తర్వాత సీఎం కేసీఆర్ వామపక్షాలతో పొత్తుల కోసం ఎదురుచూస్తున్నారని వీరభద్రం చెప్పారు. బీఆర్ఎస్‌తో పొత్తు పొడిస్తే గతంలో సీపీఎం గెలిచిన అన్ని స్థానాల్లో మళ్లీ పోటీ చేస్తామని ప్రకటించారు.

నేడు సీపీఎం జన చైతన్య యాత్ర ముగింపు

సాక్షి, హైదరాబాద్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మార్చి 17 నుండి నిర్వహిస్తున్న 'జన చైతన్య యాత్ర బస్సు జాతాలు బుధవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 11.30 గంటలకు హైదరాబాదు ధర్నాచౌక్ (ఇందిరాపార్కు) వద్ద యాత్ర ముగింపు బహిరంగసభ నిర్వహిస్తున్నారు. ఈ బహిరంగ సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కారత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు, అన్ని జిల్లాల నుండి పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

ఇదండీ సంగతి



ఇద్దరూ లేకుంటే మేం హాయిగా ఉంటాం సార్!

లీకేజీ దొంగలకు కేటీఆర్ అండ

ఈ అంశంపై ఆయన హడావుడి, తొందరపాటు ప్రజలకు అర్థమవుతోంది

- మంత్రి కనుసన్నల్లోనే 'సిట్' విచారణ జరుగుతోంది
- నివేదిక కోర్టుకు అందకముందే అందులోని అంశాలు ఆయనకు ఎలా అందాయి?
- సీబీఐ, ఈడీ, ఏసీబీతో 'సిట్'వేయాలి
- ఢిల్లీలో మీడియాతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో దొంగలను కాపాడేందుకు మంత్రి కేటీఆర్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రేవంత్ మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ హడావుడి, తొందరపాటు తీరు చూస్తుంటే ప్రజలకు ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రశ్నించినందుకు తనకు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు నోటీసులు ఇచ్చారని, మంత్రి కేటీఆర్‌కు మాత్రం విచారణకు సంబంధించిన కీలక సమాచారం సిట్ అధికారులు ఇస్తున్నారని విమర్శించారు. కేటీఆర్ కనుసన్నల్లోనే సిట్ విచారణ కొనసాగుతోందన్న రేవంత్‌రెడ్డి... విచారణ నివేదిక కోర్టుకు అందకముందే జగిత్యాలలో పరీక్షకు హాజరైన అభ్యర్థుల సమాచారం కేటీఆర్‌కు ఎలా అందిందని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ విషయంలో కేటీఆర్ పీఏ తిరుపతి చిన్నపావు మాత్రమేనన్నారు. కేటీఆర్‌కు నిర్దిష్ట సమాచారం ఉన్నప్పుడు కేసుకు సంబంధించి ఆయనకు నోటీసులు ఇవ్వకుండానే తమపై క్రిమినల్ కేసులు పెడతామని మీడియాకు లీకులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్‌కు నేరగాళ్లు సమాచారం ఇచ్చారో లేక సిట్ విచారణ అధికారి ఇచ్చారో కేటీఆరే ప్రజలకు సమాధానం చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

విచారణపై కేటీఆర్ ఒత్తిడి...

పేపర్ లీకేజీ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలే ఎక్కువని.. ఇందులో రూ. కోట్లు చేతులు మారాయని రేవంత్ ఆరోపించారు. మనీలాండరింగ్, హవాలా, విదేశీ లావాదేవీలు జరిగినందున కేసును సీబీఐ, ఈడీ, ఏసీబీ విభాగాలతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు తమ పార్టీ ఎంపీలు, మాజీ ఎంపీలు సీబీఐ, ఈడీ డైరెక్టర్ల అపాయింట్‌మెంట్లు అడుగుతున్నా తమకు సమయం ఇవ్వడం లేదని రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కేసు కాబట్టి అవినీతి నిరోధక చట్టం కూడా వర్తిస్తుందని... కానీ సిట్ ఈ చట్టం కింద ఒక్క సెక్షన్ కూడా చేర్చలేదని పేర్కొన్నారు. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు మంత్రి కేటీఆర్ విచారణ అధికారులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిడి తెచ్చి ఎదురుదాడికి దిగుతున్నారని రేవంత్ ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టించేందుకు, ప్రభుత్వ అధికారులను రక్షించేందుకు ప్రభుత్వం కేసును సిట్‌కు అప్పగించిందన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే హక్కు లేదు..

గతంలో ఎంసెట్, నయీం కేసులు మొదలుకుని వివిధ కేసుల్లో సిట్ ఒక్క నివేదిక కూడా ఇవ్వలేదని, నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని రేవంత్ గుర్తుచేశారు. ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారి శ్రీనివాస్ ట్రాక్ రికార్డు బాగా లేదని, అంతకు ముందు కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఆయనకు రెండు వారాల జైలు శిక్ష విధించిన విషయాన్ని గుర్తించాలన్నారు. 'ఇది 50 లక్షల మంది నిరుద్యోగుల సెంటిమెంట్‌కు సంబంధించిన సమస్య. తెలంగాణ విద్యార్థులు కేసీఆర్‌కు నచ్చకపోవచ్చు. కానీ వారి జీవితాలతో చెలగాటమాడే హక్కు కేసీఆర్, కేటీఆర్‌లకు లేదు'అని పేర్కొన్నారు.

రాహుల్ భయ్యా... నా ఇంటికి రావయ్యా

సాక్షి, హైదరాబాద్: బహిష్కృత ఎంపీ రాహుల్ గాంధీని తన ఇంట్లో ఉండాలని ఆహ్వానించారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై లోక్‌సభ సెక్రటేరియట్ వేటు వేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాలంటూ లోక్‌సభ సెక్రటేరియట్ ఇచ్చిన నోటీసును జత చేస్తూ 'రాహుల్ భయ్యా... నా ఇల్లు మీ ఇల్లే. నా ఇంటికి మిమ్మల్ని స్వాగతిస్తున్నాను. మనది ఒక కుటుంబం. ఇది మీ ఇల్లు కూడా..'అని మంగళవారం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

కేటీఆర్‌ను విచారిస్తే నిజాలు తెలుస్తాయి

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలో సీఎం కేసీఆర్ కుటుంబానికి సంబంధం ఉందని తాను మొదటి నుంచి వ్యక్తం చేస్తున్న అనుమానాలు రోజు రోజుకూ బలపడుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1 సహా మిగిలిన పరీక్ష పేపర్ల లీకేజీలో ఐటీ శాఖకు ప్రత్యక్ష సంబంధం ఉందన్నట్లుగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు ఈ వ్యవహారంలో సంబంధం ఉందని ఆయన మాటల ద్వారానే తెలుస్తోందని, ఆయనను సిట్ విచారిస్తే నిజాలు తెలుస్తాయని అన్నారు. మంగళవారం ఆయన బీఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గ్రూప్–1 ప్రిలిమ్స్ కటాఫ్ మార్కుల వివరాలను ఇప్పటికీ అధికారికంగా వెల్లడించకున్నా జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో, సిరిసిల్లలో ఎంతమంది పరీక్ష రాస్తే ఎందరు క్వాలిఫై అయ్యారో కేటీఆర్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. కేటీఆర్‌కు ఆ డేటా టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిగానీ, కమిషన్ సభ్యులుగానీ ఇచ్చారా అని అనుమానం వ్యక్తం చేశారు. పేపర్ల కుంభకోణానికి తనకు సంబంధం లేదంటూనే టీఎస్‌పీఎస్సీ తరఫున కేటీఆర్ వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులు మాత్రమే లీకేజీ అంశాలను వెల్లడించాల్సి ఉండగా, ఆ సంస్థ అధికార ప్రతినిధిగా కేటీఆర్ ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. కేటీఆర్ ఆఫీస్ ఈ వ్యవహారంలో రిమోట్‌గా పనిచేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులకు నోటీసులు ఇస్తూ కేటీఆర్‌కు మాత్రం డేటా ఇస్తున్నారన్నారు. పేపర్ లీకేజీపై చైర్మన్ జనార్దన్ రెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కమిషన్ చైర్మన్, సభ్యుల హస్తం ఉందని ఆరోపించారు. అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ తారుమారు చేశారనే అనుమానం బలపడుతోందని, కీలకమైన సాక్ష్యాలను చెరిపివేశారనే అనుమానం కూడా కలుగుతోందన్నారు. 80 నుంచి 90 మార్కులుపైగా వచ్చిన వాళ్ల ఓఎంఆర్ షీట్లను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

'సీతమ్మ సాగర్' పనులు నిలిపివేయండి

తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీ ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: సీతమ్మసాగర్ సాగునీటి ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) చెన్నై ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లెలో పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మ సాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ తెల్లం నరేష్, బి.లక్ష్మీనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పుష్ప సత్యనారాయణ, విషయ నిపుణుడు సత్యగోపాల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పర్యావరణ అనుమతులు వచ్చే వరకూ ప్రాజెక్టు పనులు కొనసాగించొద్దని ఆదేశాల్లో స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 26వ తేదీకి వాయిదా వేసింది.

రూ.100 కోట్ల దావా

▶ మొదటి పేజీ తరువాయి

మీడియాలో తన పరువుకు భంగం కలిగించేలా ఇద్దరు నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడారు. 2009 నుంచి 2018 వరకు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా పనిచేస్తున్న, విద్యావంతుడినైన నా ప్రతిష్టకు బండి సంజయ్, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు భంగం కలిగించాయి. నా వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయి..' అని కేటీఆర్ ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

దురుద్దేశంతోనే పదేపదే అబద్ధాలు

'సుదీర్ఘ కాలం పాటు ప్రజా జీవితంలో ఉన్న నా పరువుకు భంగం కలిగించాలన్న దురుద్దేశంతోనే బండి సంజయ్, రేవంత్ రెడ్డి పదేపదే అబద్ధాలు మాట్లాడుతున్నారు. ప్రజాప్రతినిధులుగా ఉన్నంత మాత్రాన ఎదుటివారిపై అసత్య ప్రేలాపనలు చేసే హక్కు వీరికి లేదు. ఈ నేపథ్యంలోనే ఇండియన్ పీనల్ కోడ్‌లోని 499, 500 సెక్షన్ల ప్రకారం పరువు నష్టం దావా నోటీసులు పంపుతున్నా. ఇప్పటికైనా ఎలాంటి ఆధారాలు లేని సత్య దూరమైన ఆరోపణలు మానుకోవాలి. ఇప్పటికే చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో దావాను ఎదుర్కోవాల్సి ఉంటుంది..' అని మంత్రి స్పష్టం చేశారు. బండి సంజయ్, రేవంత్ రెడ్డిలు చేసిన ఆరోపణల వివరాలను నోటీసుల్లో కేటీఆర్ పొందుపరిచారు.

ముందే హెచ్చరించి నోటీసులు

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనను బూచిగా చూపి ఉద్యోగ నియామకాల ప్రక్రియను ఆపేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్ర పన్నాయని కేటీఆర్ పలు సందర్భాల్లో విమర్శించారు. తన వ్యక్తిగత సహాయకుడిపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను కూడా రెండు రోజుల క్రితం ఖండించారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునే కుట్రలను సహించేది లేదని పదే పదే చెప్పిన కేటీఆర్.. ఇద్దరు విపక్ష నేతలకు లీగల్ నోటీసులు ఇస్తానని ఈ నెల 23నే చెప్పారు. చెప్పినట్టుగానే మంగళవారం నోటీసులు పంపించారు.

ఇవే సెక్షన్ల కింద రాహుల్‌కు జైలు శిక్ష

గుజరాత్‌లోని సూరత్ కోర్టులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ఐపీసీ సెక్షన్లు 499, 500 కిందే కేసు నమోదైంది. ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ఈ కేసులోనే రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా కూడా న్యాయమూర్తి విధించారు. ఈ తీర్పు నేపథ్యంలోనే రాహుల్‌గాంధీని లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడిగా సెక్రటేరియట్ ప్రకటించింది. ప్రస్తుతం కేటీఆర్ కూడా ఇవే సెక్షన్ల కింద లోక్‌సభ సభ్యులుగా ఉన్న రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌లకు లీగల్ నోటీసులు పంపించడం ఆసక్తికరంగా మారింది. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌ల స్థానిక చిరునామాలకు, అలాగే ఢిల్లీ చిరునామాలకు కూడా కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు.

ప్రమాదంలో పడింది ప్రజాస్వామ్యం కాదు.. కాంగ్రెస్సే

- కోర్టు తీర్పులతో ఎంపీ, ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని కోల్పోవడం ఇదేం తొలిసారి కాదు
- రాహుల్‌గాంధీపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ.. కాంగ్రెస్ పార్టీతో పాటు రాహుల్ గాంధీ కుటుంబం, వారికి మద్దతుగా నిలుస్తున్న పార్టీలు చేస్తున్న రాద్ధాంతం అర్థరహితమని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రమాదంలో ఉన్నది ప్రజాస్వామ్యం కాదని, కాంగ్రెస్ పార్టీయే తన విధానాలతో ప్రమాదంలో పడిపోతోందని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. కోర్టు తీర్పు కారణంగా పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నేతలు, వారికి మద్దతుగా నిలుస్తున్న పార్టీలు.. ఇప్పుడు కోర్టు తీర్పులను కూడా తప్పుబడుతుండటం హాస్యాస్పదమన్నారు.

ఇదేం తొలిసారి కాదు

పార్లమెంటు సభ్యులో, శాసనసభ్యులో తమ సభ్యత్వాన్ని కోల్పోయిన సందర్భం ఇదే మొదటిది కాదని.. ఇటీవలి కాలంలో.. లక్ష ద్వీప్ కు చెందిన ఎండీ ఫైజల్, అంతకుముందు తమిళనాడు సీఎం జయలలిత వంటి ఎందరో కోర్టు తీర్పుల కారణంగా సభ్యత్వానికి దూరమైన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ప్రస్తావించారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ చిలుకపలుకులు పలుకుతున్న రాహుల్ గాంధీ.. ఒక్కసారి చరిత్రలోకి తొంగిచూడాలని కేంద్రమంత్రి సూచించారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ 50 సార్లు.. ఆ ఒక్క కుటుంబమే 76 సార్లు ఆర్టికల్ 356ని (రాష్ట్రపతి పాలన) ప్రయోగించి.. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. స్వయంగా రాహుల్ గాంధీయే.. కేబినెట్ చేసిన ఆర్డినెన్స్ ను మీడియా ముందు చించేయడం రాజ్యాంగబద్ధమైనదా? ప్రజాస్వామ్యబద్ధమైనదా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ రాజకీయ అపరిపక్వతతో నోటిదురుసు వ్యాఖ్యలు చేయడమే కాకుండా.. దాన్ని సమర్థించుకోవడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్, రాహుల్ పార్లమెంటు సభ్యత్వం రద్దును వ్యతిరేకిస్తున్న పార్టీలు.. వారి వారి రాష్ట్రాల్లో ఎంతవరకు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతున్నారో చూసుకోవాలన్నారు. కోర్టులను, కోర్టు తీర్పులను కూడా వ్యతిరేకిస్తూ.. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కును రాహుల్ గాంధీ కుటుంబం కోల్పోయిందన్నారు. ఇందిరాగాంధీ అలహాబాద్ కోర్టు తీర్పును వ్యతిరేకించి ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని రాహుల్ గుర్తుతెచ్చుకుంటే బాగుంటుందని కేంద్ర మంత్రి సూచించారు.

2013 నుంచి దేశవ్యాప్తంగా అనర్హతకు గురైన ప్రజాప్రతినిధులు

- రాహుల్ గాంధీ (కాంగ్రెస్) – 2023
- పీపీ ఎండీ ఫైజల్ (లక్షద్వీప్–కాంగ్రెస్) 2023
- ఆజం ఖాన్ (ఎస్పీ) – 2022
- అనంత్ సింగ్ (ఆర్జేడీ) – 2022
- అనిల్ కుమార్ సహానీ (ఆర్జేడీ) – 2022
- విక్రమ్ సింగ్ సైనీ (బీజేపీ) – 2022
- ప్రదీప్ చౌదరి (కాంగ్రెస్) – 2021
- జె. జయలలిత (ఏఐఏడీఎంకే) – 2017
- కమల్ కిషోర్ భగత్ (ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్) – 2015
- సురేశ్ హల్వంకర్ (బీజేపీ) – 2014
- టీఎం సెల్వగణపతి (డీఎంకే) – 2014
- బాబన్‌రావ్ ఘోలప్ (శివసేన) – 2014
- ఎనోస్ ఎక్కా (జార్ఖండ్ పార్టీ) – 2014
- ఆశా రాణి (బీజేపీ) – 2013
- రషీద్ మసూద్ (కాంగ్రెస్) – 2013
- లాలూ ప్రసాద్ యాదవ్ (ఆర్జేడీ) – 2013
- జగదీశ్ శర్మ (జేడీయూ) – 2013
- పప్పు కలానీ (కాంగ్రెస్) 2013

2013 నుంచి దేశ వ్యాప్తంగా అనర్హతకు గురైన ఎంపీలు/ఎమ్మెల్యేల జాబితాను కిషన్ రెడ్డి విడుదల చేశారు. ఇందులో అన్ని పార్టీల నేతలు న్నారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. కేవలం ఆ కుటుంబ సభ్యుడి పార్లమెంటు సభ్యత్వం కోర్టు తీర్పుతో రద్దయినందుకు.. యావత్ ప్రజాస్వామ్యమే ప్రజాస్వామ్యంలో పడిందనడం.. కాంగ్రెస్‌తో పాటుగా ఆయా పార్టీల విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.

ఏదో పనిమీద పక్క దేశానికి వెళ్తున్నారు. చేతిలో ఎలాంటి డాక్యుమెంట్లు లేవు. విమానాశ్రయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్కానర్ ద్వారా నడిచి వెళ్లారు. అంతే చెకింగ్, ఇమిగ్రేషన్ గట్రా అన్నీ అయిపోయాయి. విమానంలో కూర్చోగానే.. సీటు మీ శరీరానికి తగ్గట్టుగా మారిపోయింది. విమానం దిగి హోటల్‌కు వెళ్లగానే ఆకలేసింది. మనకు నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేయగానే.. ప్రింట్ చేసి తెచ్చి ఇచ్చేశారు..

ఇదేమిటి ఏదేదో చెప్పేస్తున్నారు అనిపిస్తోందా? భవిష్యత్తులో.. అంటే 2070 నాటికి ప్రయాణం ఇలానే ఉంటుందట. ఆ వివరాలేమిటో చూద్దామా..

హార్ట్‌బీటే పాస్‌పోర్ట్.. ప్రింట్ చేసిందే ఆహారం..

బ్రిటన్‌కు చెందిన 'ది ఈజీ జెట్'సంస్థ మరో 50 ఏళ్ల తర్వాత ప్రయాణాల తీరు ఎలా ఉంటుంది? సెలవులను ఎలా ఎంజాయ్ చేస్తామన్న అంశంపై శాస్త్రవేత్తలు, నిపుణులతో మాట్లాడి 'ది ఈజీ జెట్ 2070 ఫ్యూచర్ ట్రావెల్'పేరిట నివేదికను విడుదల చేసింది. లండన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బిర్గిట్టె అండర్సన్, డిజైన్ సైంటిస్ట్ మెలిస్సా స్టెర్రీ, క్రాన్‌ఫీల్డ్ వర్సిటీ ప్రొఫెసర్ గ్రాహం బ్రైత్‌వేట్‌లతో పాటు మరికొందరు తమ అంచనాలను వెల్లడించారు.



జస్ట్ అలా నడిచివెళితే చాలు..

ప్రతి ఒక్కరి వేలిముద్ర, కంటి ఐరిస్ వేర్వేరుగా ఉన్నట్టే.. గుండె కొట్టుకునే సిగ్నేచర్ కూడా విభిన్నంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ సిగ్నేచర్ డేటాను స్టోర్ చేసి.. వ్యక్తిగత గుర్తింపు, పాస్‌పోర్టుగా వాడొచ్చంటున్నారు. ఉదాహరణకు విమానాశ్రయంలోని ప్రత్యేక మార్గం ద్వారా వెళ్లగానే.. సెన్సర్లు, కెమెరాలు, ప్రత్యేక పరికరాలు స్పందిస్తాయి. ఐరిస్ స్కాన్, ఫేషియల్ రికగ్నిషన్ (ముఖం గుర్తింపు), హార్ట్‌బీట్ సిగ్నేచర్‌లను గుర్తించి.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేస్తాయి. ఇదంతా సెకన్లలోనే జరిగిపోతుంది.



విమానంలో కూర్చోగానే..

ప్రయాణికులు విమానం ఎక్కి సీట్లో కూర్చోగానే.. వారి శరీరానికి తగినట్టు (సన్నగా, లావుగా, పొడవు, పొట్టి.. ఇలా) కాళ్లుగా సీటు ఆకృతి మారిపోతుంది. సీటుపై తలకు పక్కన అమర్చిన ప్రొజెక్టర్ నుంచి సరిగ్గా కళ్లకు ముందు డిస్‌ప్లే ఏర్పడుతుంది. ఏ ఇబ్బందీ లేకుండా కావాల్సినవి వీక్షించవచ్చు.

ఇల్లు- ఎయిర్‌పోర్ట్ టెర్మినల్- ఇల్లు

ఉన్నచోటి నుంచే గాల్లోకి ఎగిరి ప్రయాణించి మళ్లీ అలాగే కిందకు దిగగలిగే (వీటీఓఎల్) ఎయిర్ ట్యాక్సీలు అంతటా అందుబాటులోకి వస్తాయి. ఇంటి దగ్గరే ఎయిర్ ట్యాక్సీ ఎక్కి నేరుగా విమానాశ్రయం టెర్మినల్‌లో దిగడం.. ప్రయాణం చేశాక మళ్లీ టెర్మినల్ నుంచి నేరుగా ఇంటి వద్ద దిగడం.. సాధారణంగా మారిపోతుంది.

త్రీడీ ప్రింటెడ్ ఫుడ్.. కావాల్సినట్టు బెడ్

- ➜ మనకు నచ్చిన ఆహారాన్ని కాసేపట్లోనే ఫ్రెష్‌గా ప్రింట్ చేసి ఇచ్చే 'ఫుడ్ త్రీడీ ప్రింటింగ్'మెషీన్లు అందుబాటులోకి వస్తాయి. అల్పాహారం నుంచి రాత్రి భోజనం దాకా ఏదైనా ప్రింట్ చేసుకుని తినేయడమే.



- ➜ హోటళ్లలో రూమ్‌లు 'స్మార్ట్'గా మారిపోతాయి. మనం రూమ్‌కు వెళ్లే ముందే.. గదిలో ఉష్ణోగ్రత ఎంత ఉండాలో, లోపలికి వెళ్లగానే ఏదైనా సంగీతం ప్లేకావాలో, బెడ్ ఎంత మెత్తగా ఉండాలో, గీజర్‌లో నీళ్లు ఎంత వేడితో ఉండాలో నిర్ణయించుకోవచ్చు. అందుకు తగినట్టుగా అన్నీ మారిపోతాయి.
- ➜ మనకు కావాల్సిన మోడల్, డిజైన్, వస్త్రంతో డ్రెస్సులు కూడా త్రీడీ ప్రింటింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అంటే మనం ఇక లగేజీ తీసుకెళ్లాల్సిన అవసరం దాదాపు లేనట్టే.

ప్రత్యేక సూట్లతో 'టైమ్ ట్రావెలింగ్'

హాలిడే కోసం ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్లినప్పుడు ప్రత్యేకమైన 'హాప్టిక్'సూట్లను వేసుకోవచ్చు. ఏదైనా ప్రదేశాన్ని చూస్తున్న సమయంలోనే వర్చువల్/అగుమెంటెడ్ రియాలిటీ ద్వారా.. అవి ఒకప్పుడు ఎలా ఉండేవి, ఎలా మారుతూ వచ్చాయన్నది కళ్ల ముందే కనిపించే సదుపాయం వచ్చేస్తుంది.



ఇతర భాషల్లో ఎవరైనా మాట్లాడుతుంటే.. అప్పటికప్పుడు మనకు కావాల్సిన భాషలోకి మార్చి వినిపించే 'ఇన్ ఇయర్' పరికరాలు వస్తాయి. ఎక్కడైనా, ఏ భాష వారితోనైనా సులభంగా మాట్లాడొచ్చు.

సాక్షి, సెంట్రల్ డెస్క్

'కల్వకుంట్ల' కబంధ హస్తాల్లో రాష్ట్రం దోపిడీ

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజం



తాండూర్: వందలాది మంది ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం చివరికి 'కల్వకుంట్ల'కుటుంబ కబంధ హస్తాల్లో చిక్కుకుని తీవ్ర దోపిడీకి గురవుతోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రకు కొనసాగింపుగా ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కుమురంభీం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లా తాండూర్‌లోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పనంగా దోచుకుంటోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పరిపాలనలో నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ లక్ష్యాలు నేటికీ నెరవేరలేదన్నారు. ప్రతీ పేదోడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కగా, బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను నయవంచనకు గురి చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇప్పిస్తామని హామీనిచ్చారు. జాబ్ క్యాలెండర్ ద్వారా యేటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయిస్తామని ప్రకటించారు. పేపర్లు లీక్ కాకుండా సమర్థవంతంగా పరీక్షలు నిర్వహిస్తామని, అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పారు.

పాలమూరు చుట్టూనే సిట్ దర్యాప్తు

- లీకైన పేపర్ల విక్రయం ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోనే అధికం
- ఇప్పటికి అరెస్టు అయిన 15 మందిలో 9 మంది అక్కడి వారే
- మరో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాల లీకేజ్ స్కామ్‌లో సిట్ దర్యాప్తు మొత్తం ఉమ్మడి పాలమూరు జిల్లా చుట్టూనే తిరుగుతోంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన 15 మందిలో తొమ్మిది మంది అక్కడి వారే కావడంతో పాటు తాజాగా దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్న మరో ఇద్దరూ అదే జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ఈ ప్రశ్నపత్రాలను లీక్ చేసింది కమిషన్‌లో పని చేస్తున్న ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి అయినప్పటికీ క్రయవిక్రయాల్లో మాత్రం భార్యాభర్తలైన రేణుక, డాక్యా కీలకంగా వ్యవహరించారు. వీరిద్దరిదీ మహబూబ్‌నగర్ జిల్లాలోని పగిడ్యాల్ పంచగల్ తండా కాగా ప్రస్తుతం మహబూబ్‌నగర్ టౌన్‌లో నివసిస్తున్నారు. దళారీలుగా వ్యవహరించిన వీరి సమీప బంధువుల్లో రాజేంద్రనాయక్, కేతావత్ రాజేశ్వర్, తిరుపతయ్య, మేడ్చెల్ ఠాణాలో కానిస్టేబుల్‌గా పని చేసిన శ్రీనివాస్‌లది అదే జిల్లాలోని మన్సూర్‌పల్లి తండా. ఏఈ పరీక్ష పత్రాలు ఖరీదు చేసిన నలుగురిలో నీలేశ్, ప్రశాంత్, రాజేంద్రకుమార్ కూడా ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వారే. ప్రస్తుతం సిట్ మరో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తోంది. వీళ్లు కూడా షాద్‌నగర్ సమీప ప్రాంతాలకు చెందిన వారని తెలిసింది.

ఆ నలుగురి కస్టడీ పూర్తి.. నేటి నుంచి మరో ముగ్గురి విచారణ

సిట్ అధికారులు కోర్టు అనుమతితో అదనపు కస్టడీలోకి తీసుకున్న ప్రవీణ్, రాజశేఖర్, డాక్యా, నీలేశ్ విచారణ గడువు మంగళవారంతో ముగిసింది. దీంతో వీరికి కింగ్ కోఠి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన సిట్ అధికారులు నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పేపర్ ఖరీదు చేసిన ఆరోపణలపై అరెస్టు అయిన టీఎస్‌పీఎస్సీ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు షమీమ్, సురేశ్, రమేష్‌లను కోర్టు ఐదు రోజులు విచారించేందుకు కోర్టు అనుమతించింది. దీంతో సిట్ అధికారులు వీరిని బుధవారం తమ కస్టడీలోకి తీసుకోనున్నారు.

క్లుప్తంగా...

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వ్యవసాయశాఖ కమిషనర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా ప్రతినిధి బృందం విజ్ఞప్తిచేసింది. మిర్చి, మొక్కజొన్న, వరి, పండ్ల తోటల రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని తెలిపింది. మంగళవారం ఈ మేరకు కమిషనర్ కార్యాలయంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో గోలి మధుసూదన్‌రెడ్డి, బి.పాపయ్యగౌడ్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, మరిపల్లి అంజయ్యయాదవ్‌లతో కూడిన బృందం వినతిపత్రం అందించింది. క్షేత్రస్థాయిలో సర్వే నంబర్లు, రైతులవారీగా నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారాన్ని 15 రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్‌చేసింది.

ప్రతిపక్షాన్ని బతకనివ్వని కేసీఆర్: షర్మిల

- ఉస్మానియా ఆస్పత్రి సందర్శనకు అనుమతి నిరాకరించిన పోలీసులు
- తోపులాటలో కింద పడిపోయిన షర్మిల.. బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించిన వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని బతకనివ్వడం లేదని.. ప్రజల పక్షాన నిలబడితే హౌస్ అరెస్టులు చేస్తున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల విమర్శించారు. మంగళవారం ఉస్మానియా ఆస్పత్రి సందర్శనకు బయల్దేరిన ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. ఇంటినుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకోవడంతో పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పోలీసులు, కార్యకర్తల మధ్య జరిగిన తొక్కిసలాటలో ఆమె కింద పడిపోయారు. పోలీసుల వైఖరికి నిరసనగా షర్మిల తన ఇంటి వద్దే రోడ్డుపై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆమె మాట్లాడుతూ ఉస్మానియా వైద్యంపై తనకు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఉస్మానియాకు రూ.200 కోట్లతో టవర్స్ కడతామని సీఎం 9 ఏళ్ల క్రితం చెప్పినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. ఉస్మానియా సమస్యలను ప్రత్యక్షంగా చూడాలనుకున్నా.. దమ్ముంటే తనకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల గొంతు వినిపించినా అరెస్టు చేస్తున్నారని.. అందుకే జనతా రైడ్‌కి పిలుపునిచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలోని దారుణాలపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీజేఐకి విజ్ఞప్తి చేశారు.

నగరంలో ఉగ్రదాడులకు కుట్ర అంటూ లేఖ కలకలం

నకిలీ లేఖగా నిర్ధారించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: నగరంలో పలుచోట్ల దాడులకు ఉగ్రవాదులు కుట్రపన్నారంటూ మంగళవారం సోషల్ మీడియాలో ఓ లేఖ కలకలం సృష్టించింది. శివరాంపల్లిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీతోపాటు రాష్ట్ర బీజేపీ కార్యాలయం, శ్రీరామ నవమి శోభాయాత్రల్లో విధ్వంసాలకు ఉగ్రకుట్ర జరిగిందంటూ లేఖలో ఉంది. మీరాలం మండికి చెందిన ఉమామహేశ్వరి అనే పేరుతో నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఈ లేఖ ఉంది. మీర్‌చౌక్ పరిధిలో నివసించే అమేజాన్ సంస్థ ఉద్యోగి, ఆయన భార్య మరికొందరితో కలసి ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ కుట్ర పన్నినట్లు లేఖలో ఆరోపించారు. అయితే ఈ లేఖలోని అంశాల ఆధారంగా దర్యాప్తు చేయగా అది నకిలీదని తేలినట్లు పోలీసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ దంపతులకు ఉగ్ర లింకులతో సంబంధం లేదని తేలిందన్నారు. తమ పెళ్లిని జీర్ణించుకోని భార్య తరపు బంధువొకరు ఈ చర్యకు పాల్పడి ఉండొచ్చని ఆ ఉద్యోగి అనుమానిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిరుద్యోగంపై పోరుకోసం టీవీఎస్‌ఐవీ

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): నిరుద్యోగులకు బాసటగా ఉద్యోగాల భర్తీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడేందుకు ఓయూలో తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ వేదిక (టీవీఎస్‌ఐవీ) ఆవిర్భవించింది. మంగళవారం ఓయూలో జరిగిన సమావేశంలో ఉద్యోగాలభర్తీ, టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై చర్చించారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిరంతరం ఉద్యమాలకు ప్రణాళిక సిద్ధం చేశారు. అన్యాయాలపై ప్రశ్నించేందుకు ఏప్రిల్ 9న ఓయూలో విద్యార్థి, నిరుద్యోగ గర్జన పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చదువుతున్న, పూర్తి చేసిన పలు సంఘాల్లో పని చేస్తున్న విద్యార్థి, నిరుద్యోగులతో టీవీఎస్‌ఐవీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. టీవీఎస్‌ఐవీ చైర్మన్‌గా కోట శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడిగా కొర్ర శరత్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా సుబ్బునాయక్, జనరల్ సెక్రెటరీగా వలిగొండ నరసింహ, అధికార ప్రతినిధిగా ఎస్‌ఎం శ్రీకాంత్, కార్యదర్శులుగా మాండ్ల రవి, పెంచాల సతీశ్, జాయింట్ సెక్రెటరీలుగా పెంటల మహేశ్, చింతోజు శ్రీకాంత్ నియమితులయ్యారు.


‘మానవ రవాణా’.. ఆగేనా?

ఎల్లలు దాటుతున్న మానవ అక్రమ రవాణా ముఠాల ఆగడాలు

- బాధితుల్లో మహిళలు, యువతులు, పిల్లలు, పురుషులు.. దేశ సరిహద్దులు సైతం దాటిస్తున్న మాఫియా
- కూలీలు, వ్యభిచారులుగా మారుస్తున్న వైనం
- మాట వినకుంటే మహిళలు, యువతులపై భౌతిక దాడులు.. దేశంలో ఏడాదిలో 27.7% పెరిగిన కేసులు
- 141 దేశాల నుంచి సేకరించిన డేటా ఆధారంగా యూఎన్‌ఓడీసీ నివేదిక

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

మానవ అక్రమ రవాణా..భారత్‌తో పాటు యావత్ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఓ పెద్ద సమస్య. మహిళలు, యువతులు, పిల్లలే కాదు.. పురుషులు కూడా బాధితులుగా మారుతున్నారు. తమ వలలో చిక్కుతున్న వారిని మాఫియా ఇతర ప్రాంతాలకు తరలించడంతో పాటు అవసరమైతే, వీలైతే దేశాలను సైతం దాటించేస్తోంది. మహిళలు, యువతులను బలవంతంగా వ్యభిచార ఊబిలోకి దింపుతోంది. లొంగని వారిపై భౌతిక దాడులు చేస్తోంది. పలు రకాలుగా హింసిస్తోంది. పురుషులు, పిల్లలకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ బానిసలుగా మార్చేస్తోంది. కూలీలుగా పని చేయించడం, వ్యభిచారం చేయించడం, ఈ రెండింటికీ వినియోగించడం లాంటి వాటికి ఈ మాఫియా తెగబడుతోంది. బలవంతపు పెళ్లిళ్లు చేయడంతో పాటు భిక్షాటన కూడా చేయిస్తోంది. బాధితుల అవయవాలు వారికి తెలియకుండా దొంగిలించడం వంటి దురాగతాలకు పాల్పడుతోంది.



శిక్షల శాతం తగ్గుతోంది..

చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగాలు దీనిపై ఎక్కువ దృష్టి పెట్టడం లేదని అందుకే అక్రమ రవాణా చేసే మాఫియాకు పడే శిక్షలు తగ్గుతున్నట్లు ఆ నివేదిక స్పష్టం చేసింది. 2017 నుంచి ఈ శిక్షలు పడే శాతం తగ్గుతూ వచ్చిందని వెల్లడించింది. గత సంవత్సరంలో న్యాయస్థానాలు విధించే శిక్షలు ఏకంగా 27% తగ్గినట్లు పేర్కొంది. అంతర్జాతీయంగా 27% తగ్గుదల ఉంటే.. దక్షిణాసియాలో 56 శాతం, మధ్య అమెరికాలో 54 శాతం, దక్షిణ అమెరికాలో 46 శాతం తగ్గినట్లు పేర్కొంది.

మోసాలు, ఆర్థిక అసమానతలు..

ఎక్కువగా.. చదువు, అవగాహన లేకపోవడం వల్ల మోసాలకు గురవుతున్నవారు, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నవారు, ఉద్యోగాలు, ఉత్తమ జీవన ప్రమాణాల పేరిట మాఫియా ప్రలోభాలకు లొంగిపోతున్నవారు మానవ అక్రమ రవాణా బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక అసమానతలు దీనికి కారణమవుతున్నాయని ఐక్యరాజ్య సమితికి చెందిన మాదకద్రవ్యాలు, నేరాల సంబంధిత కార్యాలయం (యూఎన్‌ఓడీసీ) నివేదిక స్పష్టం చేసింది. 95 శాతం ప్రపంచ జనాభా ఉండే 141 దేశాల నుంచి సేకరించిన డేటా ప్రకారం యూఎన్‌ఓడీసీ ఈ నివేదిక రూపొందించింది.

ఒక్కసారి చిక్కితే జీవితాలు నాశనమే

ప్రపంచ జనాభాలో 95 శాతం ఉండే 141 దేశాల నుంచి సేకరించిన డేటా ఆధారంగా యూఎన్‌ఓడీసీ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం చూస్తే...మానవ అక్రమ రవాణాలో ఇప్పటికీ మహిళలు, యువతుల శాతమే అధికంగా ఉంటోంది. మాఫియా చేతుల్లో ఎక్కువ హింసకు గురవుతున్నదీ వీరే కావడం గమనార్హం. అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో ఇది ఎక్కువగా ఉంది. భారతదేశంలోనూ మానవ అక్రమ రవాణా పెద్ద సంఖ్యలో జరుగుతోందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ముఠాలకు ఒక్కసారి చిక్కితే బయటపడడం అంత సులువు కాదు. తప్పించుకుని పోవడానికి వీల్లేకుండా భౌతిక, మానసిక హింసకు గురి చేస్తారు. ఇది తీవ్రమైన సమస్య అయినా భారత ప్రభుత్వం స్పందన ఆశించిన స్థాయిలో లేదన్న విమర్శలున్నాయి.

2021లో 6,533 కేసులు

దేశంలో మానవ అక్రమ రవాణా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. 2020తో పోలిస్తే 2021లో 27.7% పెరిగినట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అక్రమ రవాణా ఆరోపణలతో మహిళలు 2020లో 1,714 ఫిర్యాదులు చేస్తే, 2021లో 2,189 నమోదయ్యాయని ఎన్‌సీఆర్‌బీ పేర్కొంది. పిల్లలు, పెద్దల అక్రమ రవాణాకు సంబంధించి 6,533 కేసులు నమోదు కాగా.. అందులో 18 సంవత్సరాల వయస్సులోపు వారు 2,877 కాగా, 3,656 మంది పెద్దవారు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

కూలీలుగా 38.8 శాతం

మానవ అక్రమ రవాణాలో బలవంతంగా కూలీలు మారేవారి సంఖ్య 38.8 శాతం ఉండగా, వ్యభిచారంలోకి 38.7 శాతం మంది నెట్టబడుతున్నారు. ఈ రెండింటికీ వినియోగించేలా 10.3 శాతం, బలవంతపు పెళ్లిళ్లు 0.9 శాతం, యాచకవృత్తిలోకి 0.7, దత్తత కోసం 0.3 శాతం, అవయవాల దొంగతనం 0.2 శాతం ఉన్నట్లు యూఎన్‌ఓడీసీ స్పష్టం చేస్తోంది.

వాతావరణ మార్పులూ పరోక్షంగా దోహదం

వాతావరణ మార్పులూ పరోక్షంగా మానవ అక్రమ రవాణాకు దోహదపడుతున్నట్టు యూఎన్‌ఓడీసీ తన నివేదికలో పేర్కొంది. వాతావరణ మార్పుల కారణంగా సంభవించే భారీ వరదల్లో సర్వం కోల్పోయిన వారు, కరువు కాటకాల్లో చిక్కుకున్న వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే క్రమంలో ఈ ముఠాలకు చిక్కుతున్నారు. ప్రభుత్వాలు దీనిపై దృష్టి కేంద్రీకరించని కారణంగానే ఈ దందా కొనసాగుతున్నట్లు నివేదిక తేల్చింది. కోర్టుల్లోనూ ఈ మాఫియాకు పెద్దగా శిక్షలు పడుతున్న దాఖలాల్లేవని, పడుతున్న శిక్షలే తక్కువ అంటే.. 2020లో ఈ శిక్షల సంఖ్య ఏకంగా 27% తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

విద్య, మహిళా సాధికారతతో చెక్

విద్య, మహిళా సాధికారతతో మానవ అక్రమ రవాణకు చెక్ పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. లింగ భేదం లేకుండా మహిళలు ఆర్థిక సాధికారత సాధించే విధంగా ప్రభుత్వ విధానాలు, కార్యాచరణ ఉంటే దీనికి అడ్డుకట్ట పడుతుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. చట్టాలను, న్యాయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, చట్టాలు అమలు చేసే యంత్రాంగానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని అంటున్నారు. ముఖ్యంగా ప్రజల్లో అవగాహన పెంచాలని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు సైతం సంయుక్తంగా కృషి చేస్తేనే ఈ అమానవీయ పరిస్థితి నుంచి బయట పడడానికి వీలుంటుందని చెబుతున్నారు.

రైతులకు సాయంపై తక్షణ చర్యలు

- అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం
- పంటల నష్టంపై పూర్తి వివరాలు సేకరించాలని సూచన
- రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించాలని స్పష్టీకరణ
- పేదలకు ఇళ్లు, పోడు భూములకు పట్టాలపైనా సమీక్ష



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని అందించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాల్సిందిగా సీఎస్ శాంతికుమారిని, సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. పంట నష్టం, పోడు భూములు, గొర్రెల పంపకం, పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం తదితర అంశాలపై మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎస్‌తో పాటు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిత్తల్, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, సీఎం కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వడగండ్ల వానలతో రైతులకు పంట నష్టం జరిగిన నేపథ్యంలో, ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగు జిల్లాల్లో పర్యటించి రైతులను పరామర్శించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నష్ట పోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సమీక్ష నిర్వహించిన కేసీఆర్.. జిల్లా కలెక్టర్లు తమ పరిధిలో, క్లస్టర్ల వారీగా స్థానిక వ్యవసాయ అధికారులతో (ఏఈవో) సర్వే చేయించి పంట నష్టంపై పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు.

కలెక్టర్ల నేతృత్వంలోనే గొర్రెల కొనుగోలు..

రాష్ట్రంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కేసీ ఆర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోనే గొర్రెల కొనుగోలు జరుగుతుందని స్పష్టం చేశారు.ఖాళీ జాగాలు ఉన్న అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలని సీఎస్‌ను ఆదేశించారు. ఇందుకు సంబంధించి విధివిధానాలు జారీ చేయాలని సూచించారు.

త్వరలో పోడు పట్టాల పంపిణీ

రాష్ట్రంలో అర్హులైన వారికి పోడు పట్టాల పంపిణీకి అధికార యంత్రాంగం సంసిద్ధతపై సీఎం సమీక్షించారు. 4 లక్షల ఎకరాలకు సంబంధించి, 1.55 లక్షల మంది అర్హులకు పట్టాలు అందించేందుకు పాస్ బుక్కులు ముద్రించి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. దీంతో అర్హులకు పోడు భూముల పట్టాల పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామని కేసీఆర్ చెప్పారు.

శ్రీ సీతారాముల కల్యాణానికి కోటి రూపాయలు మంజూరు

శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 30న భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల నిర్వహణకు, ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి కోటి రూపాయలను కేసీఆర్ మంజూరు చేశారు. కరోనా కారణంగా గత రెండేళ్లుగా దేవస్థానం ఆదాయం కోల్పోయిన నేపథ్యంలో.. దేవాదాయ శాఖ అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఎయిమ్స్ తరహాలో నిమ్స్

- 3,630 పడకలతో అభివృద్ధి: హరీశ్
- ఎర్రమంజిల్‌లో ఎంసీహెచ్ భవనానికి శంకుస్థాపన
- నూతన మెడికల్ కాలేజీల ఏర్పాటుపై మంత్రి సమీక్ష



లక్డీకాపూల్, సాక్షి, హైదరాబాద్: ఎయిమ్స్ తరహాలో 3620 పడకలతో నిమ్స్ మారబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వెల్లడించారు. నిమ్స్‌కు కేటాయించిన ఎర్రమంజిల్ స్థలంలో నిర్మించ తలపెట్టిన కొత్త భవనాలకు సీఎం త్వరలో శంకుస్థాపన చేస్తారని చెప్పారు. రూ.55 కోట్లతో నిర్మించనున్న మదర్ అండ్ చైల్డ్ (ఎంసీహెచ్) సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనానికి మరో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఓల్డ్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, వంద పడకల డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంసీహెచ్ ఆస్పత్రుల నిర్వాహణకు ప్రభుత్వం రూ. 490 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. నిమ్స్‌తో పాటు గాంధీ, అల్వాల్ టిమ్స్‌లలో 600 పడకల ఎంసీహెచ్ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులని మంత్రి పేర్కొన్నారు. నిమ్స్‌లో అధునాతన సౌకర్యాలతో మరో 2 వేల పడకలు వస్తాయని వెల్లడించారు. నిమ్స్‌లో మిగిలిన 19 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ విభాగాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఎంపికైన 26 మందికి మంత్రి హరీశ్‌రావు నియామక పత్రాలను అందజేశారు. సమావేశంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ డా.జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 2,790 ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రంలో వైద్య విద్య విప్లవం దిశగా అడుగులు వేస్తున్నామని మంత్రి హరీశ్ తెలిపారు. మారుమూల జిల్లాల్లో సైతం మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని 2014కు ముందు రాష్ట్రంలో 5 మెడికల్ కాలేజీలుంటే, ఈ ఏడాదితో ఆ సంఖ్య 26కు చేరబోతున్నట్లు చెప్పారు. 2014లో ఎంబీబీఎస్ సీట్లు 850 ఉంటే, ఇప్పుడు 2,790కి పెరిగాయన్నారు. ఈ ఏడాది 9 మెడికల్ కాలేజీలు వస్తే ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే మెడికల్ కాలేజీలపై మం త్రి జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు సత్యవతి రాథోడ్, అజయ్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వి, 9 జిల్లాల కలెక్టర్లు, స్థానిక ఎమ్మెల్యేలు, వైద్యాధికారులు పాల్గొన్నారు. జూలై నాటికి తరగతులు ప్రారంభించేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లు, 7 పీజీ సీట్లతో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

కౌరవ బీజేపీతో పోరాడుతున్నాం

- విలేకరుల సమావేశంలో మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్



సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీకి, ప్రజల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్‌కు మధ్య కౌరవ, పాండవుల తరహాలో యుద్ధం జరుగుతోందని ఆ పార్టీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ధరల పెరుగుదల, నిరుద్యోగం, చైనా దురాక్రమణ, అవినీతి లాంటి అంశాలపై చర్చ జరగడం ఇష్టం లేదని, ఈ అంశాలపై మాట్లాడాలనుకున్న వారి గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే ఆదానీ కుంభకోణంపై మాట్లాడేందుకు లోక్‌సభలో ప్రయత్నించిన రాహుల్ గాంధీపై ఓ కోర్టు తీర్పును సాకుగా చూపి అనర్హత వేటు వేశారని మండిపడ్డారు.

లలిత్‌మోదీ, నీరవ్‌మోదీలు బీసీలా?

ఓబీసీలను అవమానిస్తూ రాహుల్‌గాంధీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని, నిజంగా ఓబీసీలను అవమానిస్తే 2019 నుంచి బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. లలిత్‌మోదీ, నీరవ్ మోదీ ఓబీసీలా అని ప్రశ్నించారు. కాగా, మహారాష్ట్రలోని అన్ని పంచాయతీల్లో తాము పోటీచేస్తామన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటనను అశోక్ చవాన్ స్వాగతించారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి బోసు రాజు, షబ్బీర్‌అలీ, సంపత్, కుసుమకుమార్, మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మునుగోడు కాంగ్రెస్‌లో కమిటీల చిచ్చు

- మండల, బ్లాక్ కమిటీల నియామకంపై పాల్వాయి వర్గం అసంతృప్తి
- బోసురాజు, మహేశ్‌గౌడ్‌ల ఘెరావ్

సాక్షి, హైదరాబాద్: మునుగోడు కాంగ్రెస్ పార్టీలో కమిటీల చిచ్చు రేగింది. నియోజకవర్గంలోని 3 మండలాలు, ఒక పట్టణానికి నియమించిన పార్టీ కమిటీలపై నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్వాయి స్రవంతి వర్గం భగ్గుమంటోంది. మంగళవారం మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన హోటల్ వద్ద ఆమె వర్గీయులు నిరసన తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లను ఘెరావ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌తో మాట్లాడి కమిటీలను సర్దుబాటు చేస్తానని బోసురాజు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రాజ్యసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా కె.లక్ష్మణ్

పీయూసీ సభ్యుడిగా విజయసాయిరెడ్డి





సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ(పీయూసీ) ఎన్నిక మంగళవారం జరిగింది. మే 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు ఉండే ఈ రెండు కమిటీల్లో ఇద్దరు తెలుగు ఎంపీలకు అవకా శం దక్కింది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో కె.లక్ష్మణ్, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీపార్టీ నేత విజయసాయిరెడ్డి చోటు దక్కించుకున్నారు.

మూసీపై 55 కి.మీ. ఎక్స్‌ప్రెస్ వే

- రూ. 10 వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తాం: మంత్రి కేటీఆర్
- ఆధునిక వసతులతో చెరువుల బాగు
- ఖాజాగూడ పెద్ద చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పెద్ద చెరువు అభివృద్ధి నమూనాను పరిశీలిస్తున్న రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

గచ్చిబౌలి: కుటుంబ సమేతంగా సేద తీరడానికి అనువుగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువులను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. మూసీ నది మీదుగా రూ. 10 వేల కోట్ల వ్యయంతో 55 కిలోమీటర్ల మేర ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నట్లు చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్ద చెరువు అభివృద్ధి పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఓఆర్ఆర్ వెస్ట్ టు ఈస్ట్ మూసీ నదిపై ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం అధ్యయనం చేశామని, మూసీ సుందరీకరణతో ఆ ప్రాంతం రూపురేఖలు మారతాయన్నారు.

నిర్మాణ సంస్థలు.. 50 చెరువుల దత్తత

కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని 50 చెరువులను అభివృద్ధి చేసేందుకు వివిధ నిర్మాణ సంస్థలు వాటిని దత్తత తీసుకున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. నగరంలోని 185 చెరువుల అభివృద్ధిలో ‘క్రెడాయ్’ను భాగస్వామిని చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని చాలా చెరువుల్లో ప్రైవేటు పట్టాలు ఉన్నాయని, అయినా ప్రైవేటు భూముల యజమానులకు మరోచోట భూమి ఇస్తున్నామన్నారు. వారికి టీడీఆర్ కింద 200 శాతం విలువ కల్పిస్తున్నామని చెప్పారు. 13 చెరువులలో ఎఫ్‌టీఎల్ పట్టాలున్న వ్యక్తులకు 188 టీడీఆర్‌లు ఇచ్చి 115 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి వివరించారు. ఎఫ్‌టీఎల్ పట్టాలున్న వ్యక్తులను టీడీఆర్ తీసుకునే విధంగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్‌లో భద్రకాళి చెరువును అభివృద్ధి చేసినంత గొప్పగా దుర్గం చెరువు కూడా లేదని, నాగర్‌కర్నూల్ చెరువును ట్యాంక్‌బండ్‌లా అభివృద్ధి చేసి బుద్ధ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. సీఎస్ఆర్ నిధులిస్తే జిల్లా కేంద్రాలలో చెరువుల అభివృద్ధి చేపడతామన్నారు.

ఆఫీస్ స్పేస్‌లో మనమే నంబర్ వన్..

బెంగళూరు, చెన్నై, ముంబై, పుణే, ఢిల్లీని మించి 2022లో ఆఫీస్ స్పేస్‌లో దేశంలోనే నంబర్ వన్ సిటీగా హైదరాబాద్ నిలిచిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. తాను ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఓఆర్ఆర్ మీదుగా వస్తుంటే కనిపించిన భారీ భవనాలను చేస్తుంటే విదేశాలకు వెళ్లిన అనుభూతి కలిగిందన్నారు. నగరంలో శాంతిభద్రతలు బాగుండటంతోపాటు జీవన వ్యయం తక్కువగా ఉండటం, క్వాలిటీ ఆఫ్ లివింగ్ బాగుండటం వల్లే హైదరాబాద్‌కు పెట్టుబడులు వస్తున్నట్లు తెలిపారు.

250కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తాం

కేంద్రం సహకరించినా, సహకరించకపోయినా మెట్రో రైలును 250 కి.మీ. విస్తరిస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రూ. 6,250 కోట్లతో మెట్రోను రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించట్లేదని విమర్శించారు. యూపీలోని 10 నగరాల్లో మెట్రో ప్రాజెక్టులకు నిధులిస్తున్న కేంద్రం... తెలంగాణకు మొండిచేయి చూపుతోందని దుయ్యబట్టారు.

రాచకొండలో ఫిలింసిటీ...

ప్రపంచస్థాయి ఫిలింసిటీ ఏర్పాటుకు రాచకొండలో స్థలాన్ని గుర్తించామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఒలింపిక్స్ స్థాయిలో స్పోర్ట్స్ సిటీ తేవాలని సీఎం కేసీఆర్ దృష్టిలో ఉందన్నారు. వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్ గుర్తింపు పొందిందని, ప్రపంచంలోని వ్యాక్సిన్లలో 35 శాతం ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. వచ్చే సంవత్సరంలో 50 శాతం వ్యాక్సిన్లు హైదరాబాద్‌లోనే తయారవుతాయన్నారు. లైఫ్‌సైన్స్ పరిశ్రమ 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల స్థాయికి ఎదిగేలా ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించినట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్ మెట్రోపై ఎందుకు వివక్ష?

- చిన్న, చిన్న నగరాలకు కూడా కేటాయించి తెలంగాణకు మొండి చెయ్యి చూపడమేంటి?
- మెట్రో రైలు రెండో దశ సాధ్యం కాదన్న కేంద్రంపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం
- సాక్షి కథనం ‘మెట్రో రెండో దశ దూరమే!’పై స్పందించి కేంద్రమంత్రి పూరీకి కేటీఆర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశపై కేంద్రం చేతులెత్తేయడం తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వ పక్షపాత ధోరణికి నిదర్శనమని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత రద్దీ కలిగిన హైదరాబాద్‌లో మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ సాధ్యం కాదంటోందని పేర్కొన్నారు. మంగళవారం ‘సాక్షి’లో ‘మెట్రో రెండోదశ దూరమే!’ శీర్షికన ప్రచురితమైన కథనంపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్పందించారు. మెట్రో రెండోదశపై కేంద్రం తీరును తప్పుపడుతూ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరీకి కేటీఆర్ లేఖ రాశారు. గాంధీనగర్, కొచ్చి, బెంగళూరు, చెన్నై వంటి నగరాలతోపాటు చాలా తక్కువ జనాభా కలిగిన లక్నో, వారణాసి, కాన్పూర్, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్, మీరట్ వంటి ఉత్తరప్రదేశ్‌లోని చిన్న పట్టణాలకు కూడా మెట్రో ప్రాజెక్టులను కేటాయించిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. జనాభారద్దీ తక్కువగా ఉన్న ఇలాంటి నగరాలకు మెట్రో రైల్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్న కేంద్రం, హైదరాబాద్‌కి మాత్రం మెట్రోరైల్ విస్తరణార్హత లేదని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఇది కచ్చితంగా తెలంగాణ, హైదరాబాద్ నగరం పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న పక్షపాతమేనని, కేంద్రానిది సవతి తల్లి ప్రేమ అని కేటీఆర్ విమర్శించారు.

పూర్తి సమాచారంతో డీపీఆర్ ఇచ్చాం

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు మెట్రో రైల్ రెండవ దశకు అవసరమైన అన్ని రకాల సమాచారాన్ని డీటెయిల్డ్ ప్లానింగ్ రిపోర్ట్(డీపీఆర్)ను అందించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ, పీహెచ్‌డీటీ గణాంకాలు, ఇతర అర్హతలు, సానుకూలతలను కేంద్రం దృష్టికి తీసుకువచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాల సమాచారం అందించినా, తమకు ఎలాంటి సమాచారం అందలేదని చెబుతున్న నేపథ్యంలో మరోసారి సమగ్ర సమాచారాన్ని, అన్ని రకాల పత్రాలను నివేదికలను కేంద్రానికి పంపుతున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు వాటిని జతచేశారు.

కేంద్ర మంత్రి స్పందన నిరాశాజనకం

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండవ దశ ప్రాధాన్యతను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పూరీని వ్యక్తిగతంగా కలిసి వివరించేందుకు తాను ప్రయత్నించానని కేటీఆర్ వివరించారు. కాగా, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కార్యాలయం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. అయితే కేంద్ర మంత్రి పూరీ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌పై సాధ్యమైనంత త్వరలో సరైన నిర్ణయం తీసుకొంటారని, తెలంగాణకు ప్రాజెక్టులు కేటాయిస్తారని ఆశించానని కేటీఆర్ తెలిపారు.



జీవితం ఒక ప్రవాహం. ప్రవాహానికి అరుగుదల ఉండదు. మరమ్మతులు అవసరం లేదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, మార్చి, 29

ఈ మార్పు మంచికేనా?

ప్రజాందోళన పెరిగితే దాన్ని నీరుగార్చడానికైనా పాలకులు ఒక అడుగు వెనక్కి వేస్తారు. కనీసం వేసినట్టు కనిపిస్తారు. మూడు నెలలుగా సాగుతున్న ప్రజా ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చడంతో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతెన్యాహూ ఆ పనే చేశారు. ప్రభుత్వమే జవాబుదారీ అంటూ ఆ దేశ న్యాయమూర్తులకు ఇప్పటి దాకా అనేక అధికారాలున్నాయి. వాటిని నిర్వీర్యపరిచేలా న్యాయ వ్యవస్థలో మార్పులకు దిగిన ఆయన, చివరకు ప్రజాగ్రహంతో ఆగాల్సి వచ్చింది. రక్షణమంత్రిపై వేటు ప్రకటన గత వారాంతంలో కథలో ఈ కొత్తమలుపునకు దారి తీసింది. ప్రధాని చర్యలకు వ్యతిరేకంగా దేశంలోని అతి పెద్ద కార్మిక సంఘం సమ్మెకు దిగేసరికి, ఆస్పత్రులు, విద్యాలయాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, విదేశాల్లో ఇజ్రాయెలీ దౌత్యకార్యాలయాలు – అన్నీ సోమవారం మూతబడ్డాయి. ఆర్థిక వ్యవస్థ స్తంభించడం, సొంత దేశాధ్యక్షుడితో పాటు అమెరికా సహా అంతర్జాతీయ సమాజదృష్టి పడడంతో ఒత్తిడి పెరిగి నెతెన్యాహూ మనసు మార్చుకున్నట్టు కనిపించారు.

మిత్రదేశమైన అమెరికా సైతం నెతెన్యాహూకు సుద్దులు చెప్పాల్సి వచ్చింది. రక్షణమంత్రి ఉద్వాసన వార్తలందాక కలవరపడి, ప్రజాస్వామ్యానికి అప్రతిష్ఠ తీసుకురావద్దని ఇజ్రాయెల్‌ను పదే పదే హెచ్చరించింది. మార్పులకు విరామమిచ్చినట్టు నెతెన్యాహూ ప్రకటించగానే, ఆయనను అమెరికా అధ్యక్షుడితో భేటీకి ఆహ్వానిస్తున్నట్టు అమెరికన్ రాయబారి వెల్లడించడం గమనార్హం. ప్రధానిగా నెతెన్యాహూ పదవి చేపట్టి 3 నెలలు దాటినా, ఇంతవరకూ కలవని అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు హుటాహుటిన భేటీ జరపనుండడం ఆసక్తికర పరిణామమే. మధ్యప్రాచ్యంలో అమెరికాకు అనేక ప్రయోజనాలున్నాయి. వాషింగ్టన్, జెరూసలేమ్‌ల సైనిక భాగస్వామ్యంపైనే దాని దృష్టి.

నిజానికి మార్పుల్ని వ్యతిరేకించిన రక్షణమంత్రిని ఇంటికి పంపి, తన పంతం నెగ్గించుకోవచ్చని నెతెన్యాహూ తప్పుగా అంచనా వేశారు. ఇజ్రాయెలీ సైనికదళాలకు వెన్నెముక లాంటి సైనిక రిజర్విస్టులు సైతం విధులకు హాజరయ్యేందుకు నిరాకరించడంతో దేశ భద్రతకే ముప్పొచ్చింది. ఎగసిన వ్యతిరేకతకు తలొగ్గి, మార్పులకు సర్కార్ బ్రేకులు వేయాల్సి వచ్చింది. 73 ఏళ్ళ నెతన్యాహూ మాట నమ్మి, కార్మిక సంఘం సమ్మె విరమించింది. అలా మంగళవారం ఇజ్రాయెలీ వీధులు పైకి ప్రశాంతంగా కనిపించాయి. కానీ, సంక్షోభం పరిష్కారమైందనుకోలేం. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న నెతెన్యాహూ జడ్జీల ఎంపిక వ్యవస్థపై పట్టు బిగించే ప్రతిపాదిత బిల్లుకు పూర్తిగా స్వస్తి పలికారనుకోలేం. మిత జాతీయవాదులు, ఛాందసులు, అతి మితవాదుల కలగాపులగమైన సంకీర్ణ సర్కారు ఆ బిల్లు తుది రూపాన్ని మంగళవారం పరిశీలనకు చేపట్టడమే అందుకు ఉదాహరణ.

జనం ఎన్నుకొనని శిష్టవర్గీయుల చేతిలో, వామపక్షం వైపు మొగ్గే వ్యవస్థగా జ్యుడీషియరీ మారిందనేది ప్రభుత్వ ఆరోపణ. సుప్రీం కోర్ట్ నిర్ణయాల్ని సైతం సాధారణ మెజారిటీతో పార్లమెంట్ కొట్టిపారేసే వీలు కల్పించాలనీ, జడ్జీల నియామక సంఘంలో ప్రభుత్వ ప్రతినిధుల ప్రాతినిధ్యం పెంచాలనీ, న్యాయ సలహాదారుల సలహాను మంత్రులు శిరసావహించాలనే చట్టాన్ని ఎత్తేయాలనీ... ఇలా పలు మార్పులు చేద్దామని ప్రభుత్వ యోచన. కానీ, ఈ మార్పులు చివరకు న్యాయ వ్యవస్థను నీరుగార్చి, పాలకుల వైపే మొగ్గుతో ప్రజాస్వామ్యానికి హాని చేస్తాయని ప్రజలు, ప్రతిపక్షాల ఆందోళన. ప్రభుత్వం మాత్రం పాలకులకు మరింత జవాబుదారీగా ఉండేలా న్యాయ వ్యవస్థలో మార్పులు తేవాలనే తమ ప్రయత్నం అంటోంది. దాన్ని అడ్డుకోవడం అప్రజాస్వామికమని నెతెన్యాహూ బృందం వాదిస్తోంది. వెరసి, పార్లమెంట్ తదుపరి సమావేశాల్లో ఈ బిల్లు కథ మళ్ళీ పైకి రావచ్చు. ఈ 2 నెలల జాప్యంతో భారీ పౌర నిరసనపై నీళ్ళు జల్లి, ఏకాభిప్రాయం పేర ఏదో ఒక రూపంలో బిల్లుకు ముద్ర వేయాలనేది పాలకుల ప్రస్తుత వ్యూహం.

అబద్ధాలు చెప్పడం, తిమ్మిని బమ్మిని చేయడం నెతెన్యాహూ స్వభావం కాబట్టి, కుట్రలకు ఆయన తెర దించేవరకూ ప్రజా ఉద్యమంతో ఒత్తిడి పెట్టాల్సిందేనని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. తాజా పరిణామాలతో నెతెన్యాహూకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆయన రాజకీయ బుద్ధి సూక్ష్మతకూ, అవసరమైతే రాజీపడే నేర్పుకూ గట్టి దెబ్బే తగిలింది. పరస్పర విరుద్ధ ఎన్నికల హామీలిచ్చిన పార్టీల్ని సైతం కలుపుకొని, పంచకూట కషాయమైన సంకీర్ణ సర్కార్‌ను ఆయన ఏర్పాటుచేసి నిండా 4 నెలలైనా కాలేదు. న్యాయవ్యవస్థను తిరగదోడే పని ఆయన కొనసాగిస్తే ప్రజాగ్రహం తప్పదు. ఆపేస్తే సంకీర్ణంలో అతి మితవాద పక్షాలు వైదొలగుతాయి. ముందు నుయ్యి, వెనుక గొయ్యి. దీన్నెలా దాటతారన్న దాన్నిబట్టి ఆయన ఎంతకాలం పదవిలో ఉంటారో తేలుతుంది.

వరుస సంక్షోభాలతో, గత నాలుగేళ్ళలో 5 సార్లు ఎన్నికలతో ఇజ్రాయెల్ రాజకీయ అని శ్చితితో సతమతమవుతోంది. మళ్ళీ వెంటనే మరో ఎన్నికను భరించలేని ఇజ్రాయెల్‌కూ, అక్కడి ప్రజాస్వామ్యానికీ తాజా సంక్షోభం మరో అగ్నిపరీక్ష. కాకపోతే మూడు నెలలుగా లక్షలాది ప్రజలు వీధికెక్కి, తెలుపు – నీలం రంగుల జాతీయ పతకాన్ని చేబూని, నిరసన ప్రదర్శనలు చేస్తున్నా హింసాకాండ చెలరేగకపోవడం, చుక్క రక్తం చిందకపోవడం చెప్పుకోవాల్సిన విశేషం. జీవం తొణికిస లాడుతున్న ప్రజాస్వామ్యానికి సంకేతం. ఇప్పటికైతే ఇజ్రాయెల్ ప్రజలకు దక్కింది తాత్కాలిక విజయమే కావచ్చు. లక్షలాది జనం పార్లమెంట్ ముంగిట చేస్తున్న 'డెమోక్రాషియా' (ప్రజాస్వామ్యం) నినాదాలు, ప్రతిధ్వనిస్తున్న జెరూసలేమ్ వీధుల ప్రజాచేతన... ప్రపంచానికి ఆశాకిరణాలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.అష్టమి రా.10.08వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.9.11 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.11.41 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.20 నుండి 12.03 వరకు.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

మూల్యం కారకులదేనన్న ఊసెక్కడ?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

భోపాల్ గ్యాస్ దుర్ఘటన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ప్రవర్తించిన తీరు... నిర్లక్ష్యం, ఉదాసీనత, బాధితుల పట్ల పట్టింపులేనితనాలకు అద్దం పడుతోంది. నష్టపరిహారం కోసం కేంద్ర ప్రభుత్వం బాధితులకు ఏకైక ప్రతినిధిగా నిలబడటమే కాకుండా... ఒక కొత్త చట్టాన్ని అమల్లోకి తేవడం ద్వారా యూనియన్ కార్బైడ్ సంస్థతో రాజీపడిపోవడం కూడా ఒక తప్పిదమే. ఈ కేసు విషయమై మార్చి 14వ తేదీన సుప్రీంకోర్టు క్యూరేటివ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, సంక్షేమ రాజ్యంగా కేంద్ర ప్రభుత్వం బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహార మొత్తంలోని హెచ్చుతగ్గులను సరి చేయాలని చెప్పింది. అయితే ఇది కాలుష్య కారకులే పరిహారం చెల్లించాలన్న ప్రాథమిక సూత్రానికి విరుద్ధమైనది.

1984 నాటి భోపాల్ దుర్ఘటన విషయంలో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌ను ఈ నెల 14న సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో దశాబ్దాల న్యాయ పోరాటానికి తెరపడినట్లు అయ్యింది. ఆధునిక యుగంలో పర్యావరణానికి సంబంధించి ఓ కార్పొరేట్ సంస్థ తీవ్ర నేరానికి పాల్పడిన తొలి ఘటన ఇదే కావచ్చు.

1984 డిసెంబరు 2వ తేదీ రాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కీటకనాశిని కర్మాగారం నుంచి మిథైల్ ఐసోసైనైడ్ అనే విషపూరిత రసాయనం విడుదలైంది. కొన్నివేల మంది ఊపిరాడక చనిపోయారు. వేల మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషపూరిత రసాయన ప్రభావం కొన్ని తరాల పాటు కనిపించింది. ప్రమాదం తాలూకూ విష వ్యర్థాలను బహిరంగంగా పడేసిన కారణంగా అక్కడి నేల కూడా కలుషితమైంది. పౌరులకు జరిగిన ఈ నష్టానికి, నేరపూరిత నిర్లక్ష్యానికి కంపెనీ, దాంట్లోని అధికారులదే బాధ్యతని న్యాయ స్థానాల్లో కేసులు దాఖలయ్యాయి. జిల్లా కోర్టులో మొదలైన న్యాయ పోరాటం దశాబ్దాల కాలంలో సుప్రీంకోర్టును చేరింది. దేశ అత్యున్నత న్యాయ స్థానంలోనైనా తమకు న్యాయం దక్కుతుందని బాధితులు ఆశించారు. అయితే క్యూరేటివ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడం వారికి అశనిపాతంలా మారింది.

ప్రభుత్వాల నిర్లక్ష్యం

భోపాల్ గ్యాస్ దుర్ఘటన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ప్రవర్తించిన తీరు... నిర్లక్ష్యం, ఉదాసీనత, బాధితుల పట్ల పట్టింపులేనితనాలకు అద్దం పడుతోంది. నష్టపరిహారం కోసం కేంద్ర ప్రభుత్వం బాధితులకు ఏకైక ప్రతినిధిగా నిలబడటమే కాకుండా... ఒక కొత్త చట్టాన్ని (భోపాల్ గ్యాస్ లీక్ డిజాస్టర్ –ప్రాసెసింగ్ ఆఫ్ క్లెయిమ్స్– యాక్ట్ 1985) అమల్లోకి తేవడం ద్వారా యూనియన్ కార్బైడ్ సంస్థతో రాజీపడిపోయింది. ఇది ఓ మహా తప్పిదం. నష్టపరిహారం కోరుతూ ప్రభుత్వం 1988లో కేసు దాఖలు చేసింది. కొంత పరిహారం ప్రకటించారు కూడా. అయితే దీన్ని అందరూ ఊహించినట్టుగానే యూనియన్ కార్బైడ్ ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేసింది.

భారత్‌లో కేసులు ఉన్నాయనీ, తాము న్యాయ స్థానాన్ని ఎదుర్కొంటున్నా మనీ యూనియన్ కార్బైడ్ అమెరికాలో లిటిగేషన్ల ముప్పును తప్పించుకుంది. యూనియన్ కార్బైడ్ జరిపిన లాబీయింగ్... సుప్రీంకోర్టు సున్నిత ప్రోత్సాహం... వెరసి కేంద్ర ప్రభుత్వం మరో ఘోర తప్పిదం చేయడానికి కారణం అయ్యాయి. యూనియన్ కార్బైడ్ కేవలం రూ.715 కోట్లు చెల్లిస్తే అన్ని రకాల సివిల్, క్రిమినల్ కేసులు మూసివేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది.



పాత పరిహారమే అంతిమం!

అయితే బాధితులు మరోసారి సుప్రీంకోర్టు తలుపుతట్టి ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని కోరడం వల్ల కంపెనీ చెల్లిస్తానన్న పరిహారం చాలా తక్కువనీ, నేరం బాధ్యత కూడా తగినంతగా కంపెనీపై మోపలేదనీ స్పష్టమైంది. కంపెనీ అధికారులపై 2010లో భోపాల్ జిల్లా కోర్టులో క్రిమినల్ కేసులు దాఖ లయ్యాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రోజు వారీ కార్యకలాపాలు పర్యవేక్షించే అధి కారులకు శిక్ష కూడా పడింది. దీని పర్యవసానంగా గ్యాస్ దుర్ఘటనపై ప్రజల దృష్టి కేంద్రీకృతమైంది. ఇది కాస్తా తీవ్ర ఆందోళనకూ దారితీసింది. ఈ ఒత్తిడికి తలొగ్గిన కేంద్రం నష్ట పరిహారం మొత్తాన్ని పెంచేందుకు మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సుప్రీంకోర్టులో గత తీర్పు సమీక్ష కోరుతూ కేసు దాఖలు చేయగా... అత్యున్నత న్యాయస్థానం దాన్ని కొట్టేసింది. పదమూడేళ్లపాటు సాగిన ఈ కేసు తాజా పరిణామం ఇది. సుప్రీం కోర్టు తాజా తీర్పులో– కంపెనీ, ప్రభుత్వాల మధ్య 1989లో కుదిరిన రాజీ ఒప్పందం ప్రకారం చెల్లించిన నష్టపరిహారమే ఫైనల్ అని తేల్చేసింది. అదనపు నష్టపరిహారం కోరేందుకు తగిన న్యాయ సూత్రం ప్రాతిపదిక లేదని స్పష్టం చేసింది.

రాజీ ఒప్పందం వెనుక లాలూచీ?

కేంద్రం, యూనియన్ కార్బైడ్‌ల మధ్య కుదిరిన రాజీ ఒప్పందం వెనుక ఎన్నో లాలూచీ వ్యవహారాలు నడిచాయని బాధితుల తరఫున క్యూరేటివ్ పిటిషన్ విచారణలో భాగమైన సంస్థలు ఆరోపిస్తున్నాయి. సమాచార హక్కు చట్టం కింద భారత్‌లో, అమెరికాలో సేకరించిన సమాచారం, పత్రాల ఆధారంగా వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ పత్రాలను కోర్టుకు అందజేశారు. యూనియన్ కార్బైడ్ అధికారులు ప్రభుత్వాన్ని ఎలా తప్పుదోవ పట్టించింది ఈ పత్రాల ద్వారా వివరించారు. దుర్ఘటనలో బతికి బయటపడ్డ వారు ఎదుర్కొన్న గాయాలు స్వల్పమని కంపెనీ కేంద్ర ప్రభుత్వానికి నచ్చజెప్పిందన్నది వీరి ఆరోపణ.

అయితే కోర్టు ఈ సాక్ష్యాలను తోసిపుచ్చింది. 1989 నాటి కోర్టు తీర్పును సమర్థించింది. అంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం తన క్యూరేటివ్ పిటిషన్‌లో మోసం జరిగిందని ఏమీ చెప్పలేదని తెలిపింది. దురదృష్టవశాత్తూ కోర్టు ఈ క్యూరేటివ్ పిటిషన్‌ను కేవలం కేంద్రం, యూనియన్ కార్బైడ్ కంపెనీల మధ్య వివాదంలా మాత్రమే చూసింది. బాధితుల పక్షాన నిలిచిన సంస్థలను థర్డ్ పార్టీ (మూడో పక్షం)గా అభివర్ణించింది. కేంద్రం భుజాలపై స్వారీ చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించింది.

కేంద్ర ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా యూనియన్ కార్బైడ్ దేశంలో అసలు విచారణకే గురి కాలేదు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రమాద బాధితులకు తగిన పరిహారం లభించకపోవడం శోచనీయం. దుర్ఘటన ప్రభావాలపై కొత్త కొత్త వివరాలు వెలుగులోకి వచ్చినా కోర్టు 1989 నాటి తీర్పే అంతిమం అని తేల్చేసింది. అప్పట్లో నిర్ణయించిన పరిహారం సాధారణ అంచనా అని మాత్రం కోర్టు ఒప్పుకొంది. మరణాలకు రూ. 3 వేలు, 'దుస్సహమైన తీవ్ర గాయాలకు' రూ. 30 వేలుగా అప్పుడు నిర్ణయించారు.

కంపెనీకి తగిన పరిహారం చెల్లించాలి

2010లో దాఖలైన క్యూరేటివ్ పిటిషన్ అటు కేంద్రానికీ, ఇటు సుప్రీంకోర్టుకూ 1989 నాటి తప్పులను దిద్దుకునేందుకు ఒక అవకాశం కల్పించింది. కాలుష్యానికి కారణమైన వారే నష్ట పరిహారాన్ని, పరిస్థితిని చక్కదిద్దేందుకు అయిన ఖర్చులను భరించాలని అప్పటి నుంచి ఇప్పటివరకూ నడిచిన కాలంలో ఎన్నో తీర్పులు వచ్చాయి. 1985 నాటి ఓలియమ్ గ్యాస్ లీక్ కేసులో కోర్టు వ్యాఖ్యానిస్తూ... ''కంపెనీ ఎంత పెద్దది, సమృద్ధమైనది అయితే అది చేసిన నష్టానికి చెల్లించాల్సిన పరిహారం కూడా అంతే ఎక్కువ మొత్తంలో ఉండాలి. ప్రమాదకరమైన, ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఎక్కువగా ఉన్న పరిశ్రమలు, కంపెనీలకు కూడా ఇది వర్తిస్తుంది'' అని స్పష్టం చేసిన విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

మార్చి 14వ తేదీ సుప్రీంకోర్టు క్యూరేటివ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ, సంక్షేమ రాజ్యంగా కేంద్ర ప్రభుత్వం బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహార మొత్తంలోని హెచ్చుతగ్గులను సరి చేయాలని చెప్పింది. అయితే ఇది కాలుష్య కారకులే పరిహారం చెల్లించాలన్న ప్రాథమిక సూత్రానికి విరుద్ధమైనది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అక్షర కిరణాలు



నా కుమారుడు తన స్నేహితులకు బహుమతిగా పుస్తకాలను ఇచ్చాడు. తిరుగు బహుమతిగా పుస్తకాలను పొందాడు! తర్వాతి తరం పఠనాసక్తికి వీళ్లు ఆశాకిరణం అవుతారు.
– మురళీ నరసింహన్, మలయాళీ వ్యాఖ్యాత

పిల్లి జపం



భూమి మీద 30 కంటే ఎక్కువగా పిల్లి జాతులు ఉన్నాయి. అవి నిద్రించి లేచిన తర్వాత కాళ్లనూ, శరీరాన్నీ బాగా సాగదీస్తాయి. చూడ్డానికి ఆ సాగతీత ఎలా ఉంటుందంటే, సూర్య నమస్కారం చేస్తున్నట్లుగా! – అద్వైత్, చరిత్రకారుడు

ఇండస్ట్రీ ఉండనివ్వదు



చివరికి ప్రియాంకా చోప్రా కూడా ఒక్క మాట కొత్తది లేకుండా అందరికీ తెలిసిన విషయమే చెప్పారు (బాలీవుడ్‌లోని రాజకీయాల కారణంగానే తనకు అవకాశాలు రావడం లేదన్నారు). అయినప్పటికీ పర్వీన్ బాబీలా, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌లా మిగిలిపోకుండా ఉండటమే బాలీవుడ్‌లో ఆమె సాధించిన ఘన విజయం.
– అపూర్వ, స్క్రీన్ రైటర్

పైసా వసూల్



రుణాల ఎగవేతదారులను బ్యాంకులు వేగంగా వెంబడించడంతో బ్యాంకింగ్ మోసాలు ఏటికేడాదిగా 50 శాతం వరకు తగ్గాయి! నిజమైన కారణాలతో అప్పు తీర్చలేనివారికి, మోసం చేయడం కోసమే అప్పు తీసుకునేవారికి మధ్య తేడాను దయచేసి గమనించండి.
– రిపి బాగ్రీ, పన్ను చెల్లింపుదారు

తిరుగుతూనే ఉంది



ఆధార్‌తో పాన్ కార్డును లింక్ చెయ్యడానికి గడువు పెంచడం బాగుంది. అయితే పని చేయని సర్వర్ల కారణంగా గడువు లోపల అవి రెండూ లింక్ కానప్పుడు పెనాల్టీ విధించడం అన్యాయం. నేను మార్చి 27న లింక్ కోసం రిక్వెస్ట్ పెట్టాను. ఇప్పటికీ నా పాన్, ఆధార్ లింక్ కాలేదు!
– మనోజ్ కుమార్ సైనీ, అడ్వొకేట్

గన్ కంట్రోల్



26 ఏళ్ల క్రితం స్కాట్లాండ్‌లోని డన్‌బ్లేన్ ప్రాథమిక పాఠశాలలోకి ఒక సాయుధుడు చొరబడి 16 మంది పిల్లలను, ఒక టీచర్‌ను కాల్చి చంపాడు. ఆ ఘటనతో యు.కె. ప్రభుత్వం గట్టి 'గన్ కంట్రోల్' చట్టాన్ని తెచ్చింది. నాటి నుంచి ఈ 9,400 + రోజుల్లో ఒకే ఒకసారి మాత్రమే స్కాట్లాండ్ పాఠశాలలో కాల్పులు జరిగాయి.
– పీటర్ ఫ్రాంప్టన్, ధ్వని నిపుణుడు

నూటికి ఒకటి!



2006లో బీఎస్పీ ఎమ్మెల్యే రాజ్‌పాల్ హత్య కేసులో సాక్షి అయిన ఉమేశ్‌పాల్‌ను అపహరించిన రాజకీయ నేత అతీక్ అహ్మద్ సహా ముగ్గురు నిందితులకు ఉత్తరప్రదేశ్ కోర్టు జీవిత ఖైదు విధించింది. ఎస్పీ, అప్నాదళ్‌ల మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే అయిన అతీక్‌పై వందకు పైగా క్రిమినల్ కేసులు ఉండగా, గత పదిహేడేళ్లలో అతడికి శిక్ష పడిన కేసు ఈ ఒక్కటి మాత్రమే.
– రాహుల్ శివశంకర్, సంపాదకుడు

ఇన్‌బాక్స్

గౌరునాయుడుకు తగిన పురస్కారం

''నేనున్న నేల నుండి నేల కోసం పోరాటాలు, నా చుట్టూర ఉన్న రైతుల దుఃస్థితి– యివన్నీ నన్ను కథా రచనను ఒక అవసరంగా భావించేలా చేశాయి. నా కథలన్నింటికి కేంద్రం నా ఊరే. నా ఊరి మనుషులే నా కథల్లోని పాత్రలు'' అంటారు గంటేడ గౌరునాయుడు. ఉత్తరాంధ్ర ప్రజల భాషను, యాసను పట్టుకొని ఆయన రచనలు సాగించారు. ప్రజలు వలసలు వెళ్ళడం, నిర్వాసితుల వెతలు, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం తన కథల్లో చిత్రించారు. ''ఆకలి వలన కలిగే అనుభవం కొత్తకాదు కానీ దాన్ని సాహిత్యానుభవంగా మార్చడం వలన ఆ రచన సామాజికుని మీద ఎంతటి ప్రభావాన్ని కలిగిస్తోందో గౌరునాయుడు కథలు రుజువు చేస్తున్నాయి'' అంటారు కిన్నెర శ్రీదేవి విమర్శకురాలు.



గంటేడ గౌరునాయుడు

మన్యం ప్రాంతమైన కురుపాంకు దగ్గరలోని దలాయి పేటలో రైతు కుటుంబంలో పుట్టిన గౌరునాయుడు, వ్యవసాయ పనులు చేస్తూనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి బాధ్యత గల ఉపాధ్యాయుడిగా పేరుపొందారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15న జెండా వందనానికి పిల్లలకు ఓ పాట రాసిచ్చి, బాణీ కట్టి పాడించడం అలవాటు చేసుకున్న గౌరునాయుడు గేయ రచయిత కూడా అయ్యారు. ''పాడుదమా స్వేచ్ఛా గీతం'' గేయం ఎంతలా ప్రసిద్ధి చెందిందో తెలిసిందే. ఇటీవలే ఈ గీతాన్ని 10,000 మంది పిల్లలు ఒక్కసారిగా ఆలపించి రికార్డు దక్కించుకున్నారు. ''ఇది నా వూరేనా, ఇది నే నడిచిన దారేనా'' అంటూ మారిపోతున్న పల్లె ముఖచిత్రాన్ని ఎంతో ఖేదంతో మరో గేయ రూపంలో అందించారు. తండ్రి అవసానదశలో సపర్యలు చేస్తూ తాత్వికతకు లోనయ్యారో ఏమో, భగవద్గీతను వచన కవితా రూపంలో రచించారు. మహాభారతాన్ని కూడా సరళమైన భాషలో రచించారు.

పతంజలి సాంస్కృతిక వేదిక, విజయనగరం వారు పతంజలి పేరిట ఇస్తున్న సాహిత్య పురస్కారాన్ని గౌరునాయుడు నేడు అందుకుంటున్న సందర్భంగా అభినందనలు.

– ఎస్.కె. బాబు, విజయనగరం

పబ్లిక్ సర్వీస్ కమిషన్ల తీరు మారేనా?

అభిప్రాయం



కన్నోజు శ్రీహర్ష

అభివృద్ధి చెందిన దేశాల కన్నా మన భారతదేశంలోనే ప్రభుత్వ ఉద్యోగానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ జరుగుతున్నా ప్రభుత్వ ఉద్యోగాలపై మక్కువ తగ్గలేదు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అంటే ఇక తమ కుటుంబంలో భవిష్యత్ తరాలకు బాట పడినట్లేనని భావిస్తారు. ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి కొన్ని లక్షల మంది విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు కష్టపడుతూ ఉంటారు. తీరా ఆ పరీక్షలు నిర్వహించే పబ్లిక్ సర్వీస్ కమిషన్లు చేసే తప్పిదాలకు వారి భవిష్యత్ అంధకారంలో పడిపోతోంది. ముఖ్యంగా పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారం సర్వీస్ కమిషన్లపై నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తోంది.

ఉద్యోగ నియామకాల కోసం ఆయా సర్వీస్ కమిషన్లు, లేదా బోర్డులు రాజ్యాంగం ప్రకారం ఏర్పాటవుతాయి. వీటి చైర్మన్లు, సభ్యులు ఆయా రాష్ట్రాల గవర్నర్ల ద్వారా నియమితులు అవుతారు. వీరిని తొలగించే అధికారం మాత్రం రాష్ట్రపతికి ఉంటుంది. సహజంగా ప్రభుత్వ ఉద్యోగం చేసి ప్రభుత్వంతో సమన్వయం ఉన్నవారిని సర్వీస్ కమిషన్‌లో నియమిస్తూ ఉంటారు. ఇక్కడే అసలు సమస్యలు మొదలవుతున్నాయి. రాజకీయ నాయకుల ప్రమేయం, ప్రభుత్వ ఒత్తిడులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులు కమిషన్‌లో పని చేయడం వల్ల అవకతవకలకు అవకాశం ఉంటోంది. సాంకేతిక లోపాలు దాదాపు అన్ని రాష్ట్రాల కమిషన్లలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని 'వ్యాపం' కుంభకోణం దీనికి ఒక ఉదాహరణ మాత్రమే. ఇటీవలి తెలంగాణ వ్యవహారం తెలిసిందే! సైబర్ సెక్యూరిటీ లాంటివి పటిష్ఠంగా లేకపోవడం, బయటి వ్యక్తులు కమిషన్‌లోకి రావడానికి అనుమతి ఇవ్వడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. మన దేశంలో గత 5 సంవత్సరాల్లో గుజరాత్‌లో 15 సార్లు, బిహార్‌లో 12 సార్లు, అస్సాంలో 8 సార్లు, మధ్యప్రదేశ్‌లో 8 సార్లు ప్రశ్నపత్రాలు లీకయ్యాయి. నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల్లోనూ పేపర్ లీకుల వార్తలొచ్చాయి. ఇటీవల జరిగిన రైల్వే బోర్డు పరీక్షల్లో సైతం పేపర్ లీకు ఉదంతం బయట పడింది.



ఈ వ్యవహారాలను చూస్తుంటే పోటీ పరీక్షల వ్యవస్థలను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉంది. కమిషన్‌కు చైర్మన్, సభ్యులను ప్రభుత్వంతో తక్కువగా సంబంధం ఉన్నవారిని, అపారమైన అనుభవం ఉన్న ప్రొఫెసర్లను నియమించాలి. వీరితోపాటు కొంత మంది జ్యుడీషియరీకి సంబంధించిన సభ్యులను నియమించాలి. క్వాజీ – జ్యుడీషియల్ వ్యవస్థగా సర్వీస్ కమిషన్‌ను రూపొందించినప్పుడే తప్పులు జరిగినా... కోర్టు మెట్లు ఎక్కకుండానే లోపాలను వీరు అంతర్గతంగా సరిచేసే అవకాశం ఉంది. పటిష్ఠమైన సాంకేతిక భద్రతా వ్యవస్థను నిర్మించాలి. కఠినమైన శిక్షలు విధించే విధంగా బోర్డుకు కొన్ని అధికారాలు ఇవ్వాలి.

పోలీస్ వ్యవస్థ మాదిరి కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా ప్రతి పరీక్ష సెంటర్‌ను జియో ట్యాగింగ్ చేసి పకడ్బందీగా నిర్వహించాలి. సెక్యూరిటీ చిప్ ద్వారా హాల్ టికెట్‌ను, ప్రశ్నపత్రాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉంది. దీని ద్వారా ఆ విద్యార్థి ఏం చేస్తున్నాడనేది స్పష్టంగా బోర్డుకి తెలుస్తుంది. అవుట్ సోర్సింగ్ విధానాన్ని తొలగించి పూర్తిస్థాయి ఉద్యోగాలను బోర్డులో నియమించాలి. ముఖ్యమైన సెక్యూరిటీ పాస్‌వర్డ్ చైర్మన్ వద్ద మాత్రమే ఉండాలి.

అలాగే ప్రతి సంవత్సరం ఉద్యోగాల భర్తీకి వార్షిక క్యాలెండర్‌ను ప్రతి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కచ్చితంగా విడుదల చేయాలి. రాష్ట్ర శాసన సభకు, పార్లమెంట్‌కు ప్రతి ఏడాదీ నిర్వహించిన ఉద్యోగ నియామకాల నివేదిక ఇవ్వాలి. ఈ చర్యలు తీసుకుంటే ఉద్యోగ నియామక వ్యవస్థ చాలావరకు దారిలోకి వస్తుంది. నిరుద్యోగులకు ఎంతో మేలు చేకూరుతుంది.

వ్యాసకర్త విశ్లేషకులు

రామం భజే శ్యామలం

ధర్మ సంస్థాపన కోసం, దశకంఠుడి వధ కోసం శ్రీహరి ఏడవ అవతారంగా శ్రీరాముడుద్భవించిన తిథి చైత్ర శుద్ధ నవమి. ఆస్తికులకు శ్రీరాముడు మిగతా అవతారాల కన్నా మిన్న. కారణం ఆయన మనిషిగానే అవతరించినా, దేవుడి లాంటి మనిషిలా జీవించాడు. మనిషి అనుసరించదగిన ఉన్నతాదర్శాలన్నిటి సమ్మేళనం ఆయన. ఎన్నో లోకోత్తరమైన ఘనకార్యాలు సాధించినా, 'నన్ను నేను మనిషిగానే భావిస్తున్నాను' అని ప్రకటించి, మానవ జాతికి 'రామాదివ వర్తితవ్యం' (రాముడిలా ప్రవర్తించాలి) అన్న ఒజ్జ బంతి ఏర్పరిచాడు.

'నీ మేను, నామ వైభవమ్ములను, నీ పరాక్రమ ధైర్యముల, శాంత మానసము, ఈవులను, వచన సత్యముల, నీ ఎడ సద్భక్తియు జనింపగను... నీ గుణ భజనానంద కీర్తనము చేసేవారు ఎందరో మహానుభావులు' అన్నారు త్యాగరాజస్వామి. శ్రీరాముడి మేను 'పుంసాం మోహన రూపం'– పురుషులనే మోహింపజేసేది. ఆయన నామ వైభవమో? రామ మహిమ కంటే రామనామ మహిమ గొప్పదని, ఆ రుచి బాగా తెలిసినవారందరూ– హనుమంతుడు, వాల్మీకి నుంచి, కబీరు, రామదాసు దాకా – చెప్తూ వచ్చిన మాట. ఆయన పరాక్రమమా? అది తాటకకూ, మారీచ సుబాహులకూ, దండకలో ఆయన ఒక్కడి మీద మూకుమ్మడిగా దండెత్తి వచ్చిన ఖర దూషణాది పధ్నాలుగు వేల మంది రాక్షసులకూ, ఆ పిమ్మట రావణ కుంభకర్ణాదులకూ బాగా తెలుసు. కేవలం కోతులను మాత్రం తోడు చేసుకొని, సముద్రం ఆవల సురక్షితంగా ఉన్న లంకలో రాక్షసేశ్వరుడిని ముట్టడించేటంత ధైర్యం ఆయన సొత్తు. అంత పరాక్రమ శాలి అయినా, ఆయనది క్రోధమూ, క్రౌర్యమూ ఎరగని శాంత మానసం. ఈవిలో – అంటే దాతృత్వంలో – ఆశ్రితామిత కామిత ప్రదుడైన సాకేత రాముడికి సరి ఎవ్వరు? 'వచన సత్యం' సరేసరి. ఒక మాటా, ఒక బాణం, ఒక పత్ని ఆయనకు, శరణాగత రక్షణ లాగా వ్రతం.



జన్మ దినోత్సవ సందర్భంగా రామయ్య తండ్రికీ, కల్యాణోత్సవ సందర్భంగా సీతమ్మ తల్లికీ శతకోటి వందనాలు! సాధుజనావన వ్రతో/ద్ధాముడు, రాముడే పరమ దైవము మాకని నీ అడుంగు కెం/దామరలే భజించెదను దాశరథీ, కరుణాపయోనిధీ!

– ఎం. మారుతి శాస్త్రి
(రేపు శ్రీరామనవమి)

క్లుప్తంగా...

భద్రాద్రి రామయ్యకు బంగారు కిరీటం



భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామికి హైదరాబాద్ వాస్తవ్యులు బంగారు కిరీటం తయారు చేయించి మంగళవారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రాధికా రాణి రూ.15 లక్షల విలువైన 250 గ్రాముల బంగారంతో కిరీటం చేయించారు. ఈ కిరీటాన్ని స్వామి వారి పాదాల చెంత ఉంచి పూజల అనంతరం ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు.

కొత్తగా ఏడు జిల్లాల్లో పేదలకు బలవర్ధక బియ్యం



సాక్షి, హైదరాబాద్: పేదలకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కొత్తగా ఏడు జిల్లాల్లో బలవర్ధక బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్) అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో బలవర్ధక బియ్యం పంపిణీ ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. 2021 సెప్టెంబర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా మొదలైన బలవర్ధక బియ్యం పంపిణీ ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఐసీడీఎస్, మధ్యాహ్నభోజన పథకం, హాస్టళ్లకు అందించామని చెప్పారు. అనంతరం మే 2022 నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రజాపంపిణీ చేస్తున్నామని వివరించారు. తాజాగా రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హనుమకొండ, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం, వికారాబాద్.. జిల్లాల పరిధిలో పౌరసరఫరాల శాఖ ఏప్రిల్ నెల నుంచి బలవర్ధక బియ్యం పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ పేద ప్రజలు పోషకాహార లోపంతో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో బలవర్ధక బియ్యంను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. మిగతా జిల్లాల్లో సైతం విడతల వారీగా 2024 మార్చిలోగా ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకోనున్నట్లు గంగుల వివరించారు.

బాసర ఆర్జీయూకేటీ డైరెక్టర్‌కు పేటెంట్

భైంసా: విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులను నివారించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు వీలు కల్పించే సాంకేతికతపై బాసర ఆర్జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ పేటెంట్ (ప్రత్యేక హక్కు) సాధించారు. 'నోవెల్ ఇంటర్‌లైన్ యూనిఫైడ్ పవర్ క్వాలిటీ కండిషనర్ మల్టీఫీడర్ సిస్టం విత్ ఫోర్ కన్వర్టర్స్'టెక్నాలజీపై మూడేళ్లుగా చేసిన పరిశోధన కృషికిగాను ఈ పేటెంట్ వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ పేటెంట్ కాలవ్యవధి 20 ఏళ్లపాటు ఉంటుందని చెప్పారు. పలు జాతీయ, అంతర్జాతీయ బహుళజాతి సంస్థలు ఈ పేటెంట్ హక్కుదారుల నుంచి అనుమతి పొంది నాణ్యమైన విద్యుత్, చౌక విద్యుత్‌ను వినియోగదారులకు అందించే వీలుంటుందని వివరించారు. విద్యుత్ సంస్థలకు సంబంధించి పలు సంస్కరణలకు ఇందులో పరిష్కార మార్గాలు చూపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘనత సాధించినందుకు వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు మంగళవారం ప్రొఫెసర్ సతీశ్‌కుమార్‌ను సన్మానించారు.

ఖేలో ఇండియా దస్ కా దమ్..



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో గచ్చిబౌలి వేదికగా ఖేలో ఇండియా దస్ కా దమ్ ఆర్చరీ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో పలువురు ఆర్చరీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. గెలుపొందిన క్రీడాకారులకు గచ్చిబౌలి అడ్మినిస్ట్రేటర్ నందకిషోర్ గోకుల్, శాట్స్–హైదరాబాద్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి అరవింద్ కుమార్ పతకాలను అందజేశారు.

బిల్లుల కోసం యూఎస్పీసీ ధర్నా

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) మంగళవారం హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ.300 కోట్లు కేటాయించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సప్లిమెంటరీ వేతనాలు, సెలవు జీతాలు, టీఎస్జీఎల్ఐ, జీపీఎఫ్ క్లైములు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు తదితర బిల్లులన్నీ నెలల తరబడి మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, వై అశోక్ కుమార్, టి లింగారెడ్డి, చావ రవి పాల్గొన్నారు.

భద్రగిరిలో ధ్వజారోహణం

రేపు శ్రీ సీతారాముల కల్యాణం

భద్రాచలం: భద్రగిరి పుణ్యక్షేత్రంలో మంగళవారం ధ్వజారోహణం వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుగుతుండటం తెలిసిందే. వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీ మహా విష్ణువు ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారిని ధ్వజస్తంభం వద్దకు తోడ్కొని వచ్చారు. మంగళ వాయిద్య ఘోష నడుమ ధ్వజారోహణం చేశారు. కాగా, భద్రాచలంలో గురువారం శ్రీ సీతారాముల కల్యాణం, శుక్రవారం పుష్కర పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. మరోపక్క నవమి వేడుకలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం రాత్రి విద్యుద్దీపాలు వెలిగించడంతో ఆలయం, పరిసరాలు మిరుమిట్లు గొలిపే కాంతులతో వెలుగులీనాయి.



విద్యుత్ దీపాల వెలుగుల్లో రామాలయం. (ఇన్‌సెట్) ధ్వజస్తంభం వద్ద గరుత్మంతుడి పటంతో పూజలు

భద్రాచల స్వామివారి కల్యాణ తలంబ్రాలకు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటికే చేరవేసేందుకు తెలంగాణ ఆర్టీసీ చేపట్టిన కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాల్లో రూ.116 చెల్లించి పేర్లు నమోదు చేసుకునే వారి ఇళ్లకు స్వామి ప్రసాదంగా తలంబ్రాలను చేర్చనున్నట్టు పది రోజుల క్రితం ఆర్టీసీ ప్రకటించింది. ఈ పది రోజుల్లో ఏకంగా 50 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, ఎండీ సజ్జనార్‌లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సేవను పొందాలనుకునేవారు 9177683134, 7382924900, 9154680020 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

10,783 కనెక్షన్లకు 'జీరో' బిల్లు!

జీరో యూనిట్లు వాడినట్లు తప్పుడు బిల్లుల జారీ
- నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ అవకతవకతలు
- టీఎస్ఎస్పీడీసీఎల్‌కు రూ. లక్షల్లో ఆదాయ నష్టం
- విజిలెన్స్ విచారణతో వెలుగులోకి.. 41 మందిపై చర్యలకు సిఫారసు
- అయినా వారిపై ఇంకా పడని సస్పెన్షన్?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసలే ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లను కొందరు అధికారులు, సిబ్బంది మరింతగా ముంచుతున్న ఉదంతం వెలుగులోకి వచ్చింది. నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలో ఏకంగా 10,783 విద్యుత్ కనెక్షన్లకు జీరో యూనిట్ల వినియోగంతో బిల్లులు జారీ చేస్తున్నట్లు సంస్థ విజిలెన్స్ విభాగం విచారణలో తేలింది. దీంతో సంస్థ ప్రతి నెలా రూ. లక్షల్లో ఆదాయాన్ని నష్టపోయినట్లు వెల్లడైంది. అయితే ఆయా బిల్లుల వాస్తవ మొత్తాలను వినియోగదారుల నుంచి కొందరు అధికారులు, సిబ్బంది వసూలు చేసుకొని జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) చైర్మన్ తన్నీరు శ్రీరంగారావుకు జీ.సత్యనారాయణ అనే న్యాయవాది చేసిన ఫిర్యాదుతో ఈ అవకతవకతలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా ప్రతి విద్యుత్ కనెక్షన్‌కు ఒక మీటర్, ఆ మీటర్‌కు ఒక విశిష్ట సంఖ్య ఉంటుంది. కానీ ఒకే మీటర్ నంబర్‌తో 10,783 సర్వీసు కనెక్షన్లు ఉన్నట్లు విజిలెన్స్ తేల్చినట్లు సమాచారం.

2,788 కనెక్షన్లపైనే విచారణ..

ఈఆర్సీ సూచనలతో టీఎస్ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగంతో విచారణ జరిపించింది. 10,783 సర్వీసు కనెక్షన్లలో 2,788 కనెక్షన్లను మాత్రమే విజిలెన్స్ విభాగం తనిఖీ చేయగలిగింది. సిబ్బంది కొరతతో మిగిలిన కనెక్షన్లను తనిఖీ చేయలేకపోయింది. తనిఖీ చేసిన 2,788 కనెక్షన్లలో కేవలం 687 కనెక్షన్లకే మీటర్లున్నాయని, మిగిలిన 2101 కనెక్షన్లకు మీటర్లు లేవని గుర్తించింది. తనిఖీ చేసిన కనెక్షన్లకు సంబంధించి తప్పుడు మీటర్ రీడింగ్‌ను నమోదు చేసి బిల్లులు జారీ చేయడంతో సంస్థ రూ. 9.32 లక్షల ఆదాయాన్ని నష్టపోయినట్టు నిర్ధారించింది. 10,783 కనెక్షన్లలో ఏకంగా 4,842 కనెక్షన్లకు మీటర్లే లేవని నాగర్‌కర్నూల్ డీఈ మరో నివేదికలో టీఎస్ఎస్పీడీసీఎల్‌కు తెలియజేశారు. ఒక్క నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోనే ఈ పరిస్థితి బయటపడగా రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా అవకతవకతలతో డిస్కంలు రూ. వందల కోట్ల మేర ఆదాయాన్ని నష్టపోతున్నాయని ఆరోపణలున్నాయి.

41 మందిపై చర్యలకు ఆదేశం..

నాగర్‌కర్నూల్ డివిజన్‌లో వెలుగు చూసిన భారీ అక్రమాల్లో స్థానికంగా పనిచేసే 41 మంది ఓఅండ్ఎం విభాగం అధికారులు, సిబ్బంది, మరో ముగ్గురు అకౌంట్స్ విభాగం అధికారులను బాధ్యులుగా విజిలెన్స్ విభాగం తేల్చింది. ఈ నివేదిక ఆధారంగా 14 మంది ఏఈలు, నలుగురు ఏడీఈలు, మరొక డీఈపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీఎండీ జి.రఘుమారెడ్డి ఆదేశించారు. వారి బాధ్యతారాహిత్యం, విధుల్లో నిర్లక్ష్యంతోనే మీటర్ రీడర్లు అక్రమాలకు పాల్పడ్డారని, వారితోపాటు ప్రైవేటు మీటర్ రీడింగ్ ఏజెన్సీపైనా చర్యలు తీసుకోవాలన్నారు. అయితే ఈ వ్యవహారంలో ఇంకా ఎవరినీ సస్పెండ్ చేయలేదని అధికార వర్గాలు తెలిపాయి.

భద్రాద్రి సీతమ్మకు సిరిసిల్ల పట్టుపితాంబరం చీర

చేనేత మగ్గంపై నేసిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్



సిరిసిల్ల: సిరిసిల్ల చీరలో సీతమ్మ అందాలు భక్తులను మురిపించనున్నాయి. పట్టుపితాంబరం చీరలో సరికొత్తగా సీతమ్మ దర్శనం ఇవ్వనుంది. సీతమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వ లాంఛనంగా ఏటా అందించే పట్టుచీరకు బదులుగా తొలిసారి సిరిసిల్లలో వెండి, పట్టుపోగులతో తయారైన పట్టుపితాంబరం చీరను అందించనున్నారు. సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ చేనేత మగ్గంపై 20 రోజులపాటు శ్రమించి ఈ చీరను నేశారు. 150 గ్రాముల బరువైన వెండి పోగులను, 600 గ్రాముల పట్టుపోగులను కలిపి మగ్గంపై జరీ అంచులతో కూడిన పట్టుపితాంబరం చీరను తయారు చేశారు. ఈ చీరను శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి సీతమ్మవారికి కానుకగా అందిస్తానని హరిప్రసాద్ రాష్ట్రమంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి అనుమతి ఇప్పించగా దానిని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు అందించారు. ఈ చీర తయారీకి రూ.45 వేలు ఖర్చు అయినట్లు హరిప్రసాద్ తెలిపారు. కూలీ తీసుకోకుండా కేవలం సీతమ్మవారికి అందించే లక్ష్యంతో చీర నేసినట్లు చెప్పారు. సిరిసిల్ల చీర సీతమ్మవారికి కానుకగా వెళ్లడం ఆనందంగా ఉందని హరిప్రసాద్ వెల్లడించారు. ఇప్పటికే చేనేత మగ్గంపై పలు ప్రయోగాలు చేసి ప్రధాని నరేంద్రమోదీ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ప్రశంసలు పొందిన హరిప్రసాద్ తాజాగా భద్రాద్రికి సిరిసిల్ల చేనేత పట్టు పితాంబరం చీరను అందించడం విశేషం. ఏటా ఇలాగే అమ్మవారికి అందిస్తానని తెలిపారు.

ఒకే కాన్పులో నలుగురు

ముగ్గురు మగ, ఒక ఆడ శిశువు జననం • తల్లి, శిశువులు క్షేమం



ఒకే కాన్పులో జన్మించిన నలుగురు శిశువులు

ముస్తాబాద్ (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పీపుల్స్ హాస్పిటల్‌లో ఒకే కాన్పులో నలుగురు శిశువులకు ఓ మహిళ మంగళవారం జన్మనిచ్చింది. గంభీరావుపేట మండలం సముద్రాలింగాపూర్ గ్రామానికి చెందిన గొట్టిముక్కల లావణ్య, కిషన్ దంపతులకు మొదటి కాన్పులో బాబు జన్మించాడు. తొమ్మిదేళ్ల తర్వాత లావణ్య రెండోసారి గర్భం దాల్చింది. లావణ్యకు పురిటినొప్పులు రావడంతో పీపుల్స్ హాస్పిటల్‌లో చేరింది. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ చింతోజు అఖిల ఆధ్వర్యంలో లావణ్యకు పరీక్షలు చేశారు. గర్భంలో నలుగురు శిశువులు ఉన్నట్లు స్కానింగ్‌లో గుర్తించారు. అనంతరం లావణ్యకు ఆపరేషన్ చేసిన వైద్యులు లావణ్య ముగ్గురు మగ, ఒక ఆడ శిశువులకు జన్మనిచ్చినట్లు తెలిపారు. తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. 10 లక్షల ప్రసవాలలో ఇలా ఒకటి జరిగే అవకాశాలు ఉన్నాయని, వైద్య పరిభాషలో దీన్ని క్వాట్రల్ ఫ్లెక్స్‌గా పిలుస్తారని తెలిపారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం నలుగురు శిశువులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లంచాలు వెనక్కి ఇప్పించిన ఈఆర్సీ

- లంచాలు మెక్కిన సిబ్బంది..
- ముక్కుపిండి వసూలు చేసి బాధితులకు ఇప్పించిన ఈఆర్సీ

సాక్షి, హైదరాబాద్: పలువురు విద్యుత్ వినియోగదారుల నుంచి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల అధికారులు, సిబ్బంది తీసుకున్న లంచాలను తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) ముక్కుపిండి వసూలు చేసి వినియోగదారులకు ఇప్పించింది. పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి ఆన్‌లైన్ పేమెంట్ యాప్స్ ద్వారా చెల్లించిన లంచాలపై ఆధారాలతో సహా పలువురు వినియోగదారులు ఈఆర్సీకి ఫిర్యాదు చేయగా, ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు సదరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నారు.

ఫిర్యాదు చేశారన్న కోపంతో..: సుంకరి లక్ష్మి (మెదక్ జిల్లా తిమ్మానగర్) తన పౌల్ట్రీ ఫారమ్‌కు కొత్త ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ కనెక్షన్ కోసం రూ.1.92లక్షలను డీడీ రూపంలో టీఎస్ఎస్పీడీసీఎల్‌కు చెల్లించారు. ఈ పని కావడం కోసం లైన్‌మెన్ సంతోష్‌కు రూ. 28,500, ఫోన్‌పే ద్వారా, రూ.10 వేలను నగదుగానూ ఇవ్వాల్సి వచ్చింది. ఏఈ తిరుపతి రెడ్డి సైతం లంచం డిమాండ్ చేయడంతో లక్ష్మి భర్త టీఎస్ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అన్ని ఆధారాలతో అందిన ఫిర్యాదుపై స్పందించిన ఈఆర్సీ సదరు లంచాలను సిబ్బందితో కక్కించింది. అలాగే, వికారాబాద్‌కు చెందిన ఓ వినియోగదారుడికి ఈఆర్సీ న్యాయం చేసింది. ఈ వ్యవహారంలో డీఈని సస్పెండ్ చేసింది. ఇంకా, యాదాద్రి జిల్లా పల్లెపహాడ్‌కి చెందిన సుంకరి రేణుక లైన్‌మెన్‌కు లంచంగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇప్పించింది.

భారీగా చందాలు, విరాళాల సేకరణ

చంద్రబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ పొలిట్‌బ్యూరో భేటీలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ కోసం మరోసారి భారీఎత్తున విరాళాలు, చందాలు స్వీకరించాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. దేశ, విదేశాల నుంచి భారీగా విరాళాలను ఆహ్వానించాలని, ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని తీర్మానించింది. ఆ పార్టీ అధినేత, ఏపీ మాజీ సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. ఇక నుంచి రెన్యూవల్ అవసరం లేని రూ.5 వేల శాశ్వత సభ్యత్వాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. సమావేశంలో ఏపీకి సంబంధించిన 13, తెలంగాణకు సంబంధించిన 4 అంశాలపై చర్చ జరిగింది. అనంతరం సమావేశం వివరాలను ఆ పార్టీ ఏపీ, తెలంగాణ విభాగాల అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 40 శాతం టికెట్లు యువతకు కేటాయించాలని నిర్ణయించినట్లు చెప్పారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు, మే 28 వరకు వంద సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో టీడీపీ ఒంటరిగా 119 స్థానాల్లో పోటీ చేస్తుందని టీడీపీ నేతలు తెలిపారు.

మీరు రైతులా! దున్నపోతులా!

- రైతుల సమావేశంలో అన్నదాతలపై దుర్భాషలాడిన మంత్రి మల్లారెడ్డి
- నిరసన తెలిపిన అన్నదాతలు
- ఆందోళనతో అర్ధంతరంగా ముగిసిన రైతుల సమావేశం

ఘట్‌కేసర్: రైతుల సమావేశంలో మంత్రి మల్లారెడ్డి అన్నదాతలపై విరుచుకుపడ్డారు. రుణమాఫీ ఎక్కడ చేశారని నిలదీసిన రైతుల్ని పట్టుకుని 'మీరు రైతులా దున్నపోతులా'అంటూ దుర్భాషలాడారు. దీంతో ఆగ్రహించిన రైతులు అక్కడికక్కడే సభలో నుంచి లేచి నిరసనకు దిగారు. మంగళవారం పట్టణంలోని నారాయణగార్డెన్‌లో రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన 2022–23 అర్ధ వార్షిక నివేదిక సదస్సుకు మంత్రి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణలో ఒకప్పుడు వ్యవసాయం దండుగ అనేవారని, నేడు పండుగ వాతావరణంలో సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో హరినాథ్‌రెడ్డి అనే రైతు రుణమాఫీ అవుతుందని తీసుకున్న రూ.80 వేలకు మరో 80 వేలు వడ్డీ అయిందని రుణమాఫీ ఎక్కడ చేశారని అడగగా మరో రైతు మహిపాల్‌రెడ్డి వడ్డీ రేటు తగ్గించాలని కోరారు. దీంతో దున్నపోతుల్లా ఉన్నారు, మీరు రైతులా, బయటకు గుంజుకుపోండని మల్లారెడ్డి ఆదేశించడంతో రైతులు నిరసనకు దిగారు. దీంతో రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి సభ ముగిసినట్లు ప్రకటించడంతో అక్కడి వాతావరణం గందరగోళంగా మారింది. అనంతరం ఆ రైతుల్ని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు.

తెలుగు పాటకు ఆస్కార్ అభినందనీయం

చంద్రబోస్‌కు త్వరలో సన్మానం • రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



గన్‌ఫౌండ్రీ: ఆసియా ఖండంలోనే పాటల రచయితకు మొట్టమొదటిసారి ఆస్కార్ అవార్డు దక్కడం గొప్ప విషయమని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ, గ్రంథాలయ పరిషత్, తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ రచయితల వేదికలతో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత చంద్రబోస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 95 ఏళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణలో కవులే లేరని, గతంలో అవహేళన చేశారని కానీ నేడు విశ్వవ్యాప్తంగా తెలంగాణ కవులు సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. ఆస్కార్ అవార్డు సాధించిన చంద్రబోస్‌ను త్వరతలో ప్రభుత్వం తరఫున ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. సినీనటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ఆస్కార్ అంటే హాలివుడ్‌కు మాత్రమే పరిమితమైందని, కానీ చంద్రబోస్ ఆ చరిత్రను తిరగరాశారని కొనియాడారు.

కవిగా గర్వించే క్షణాలు: చంద్రబోస్

ఒక కవిగా తనకు లభించిన ఈ గుర్తింపు ఎంతో గర్వించదగ్గ క్షణాలని సినీ గేయ రచయిత చంద్రబోస్ అన్నారు. 'నాటు నాటు' పాట కోసం సంగీత దర్శకుడు కీరవాణితో పాటు తాను సంవత్సరం పాటు చేసిన కృషికి ప్రతిఫలం దక్కడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నాటు నాటు పాటపాడి సభికులను ఆనందపరిచారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు ఆయనను ఘనంగా సన్మానించారు.

రైతుబంధుతో పెరిగిన ఆర్థిక స్తోమత

అహ్మదాబాద్ ఐఐఎం రీసెర్చ్ గ్రూప్ అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: రైతుబంధుతో తెలంగాణలో వ్యవసాయ రైతు కుటుంబాల్లో ఆర్థిక స్తోమత పెరిగిందని దీంతో పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆయా కుటుంబాల్లో వినియోగ వ్యయం 12.9% ఉంటోందని అహ్మదాబాద్ ఐఐఎం రీసెర్చ్ గ్రూప్ చేసిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఐఐఎం కు చెందిన అభిషేక్ షా, సావన్ రాతి తెలంగాణలోని రైతుబంధు ప్రభావంపై ఒక అధ్యయన పత్రాన్ని తయారు చేశారు. మొదట్లో రైతులకు ఎకరా వ్యవసాయ భూమికి ఏడాదికి రెండుసార్లు రూ.4,000 చొప్పున అందజేశారు. దీనికి ముందు ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రామ్ (ఎల్ఆర్‌యూపీ) ద్వారా ప్రభుత్వం భూమి రికార్డులను డిజిటలైజేషన్ చేసి రైతులకు భూ పాస్‌బుక్‌లను అందించింది. ఆహారం, ఇంధనం, ఆరోగ్య ఖర్చులలో పెరుగుదల ప్రధానంగా ఉందని తెలిపింది. దేశంలో రైతుల కోసం ఇలాంటి పథకం అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వమేనని వెల్లడించింది. ఈ పథకం ద్వారా 89% చిన్న సన్నకారు రైతులకు మేలు జరుగుతుందని పేర్కొంది. రైతుబంధు పథకం కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినట్లు వెల్లడించింది. ఈ పథకాన్ని అనుసరించే కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ పేరుతో, ఇతర రాష్ట్రాలు కాళియా, క్రిషక్ బంధు, ఎన్‌వైఎవై పేర్లతో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది. 2018లోనే ఏటా రూ.12వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ఈ పథకం ద్వారా ప్రతియేటా గతంలో 58 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నట్లు పేర్కొంది. 2018లోనే ఈ పథకం ద్వారా ప్రతిరైతు సగటున రూ.9,974 పెట్టుబడి సాయం పొందినట్లు వెల్లడించింది. ఇక 2017లో ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమానికి కూడా పరిశోధక బృందం కితాబిచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 86శాతం భూ వివాదాలను పరిశీలించి పరిష్కరించదని పేర్కొంది.

నాపై కుట్రలు చేశారు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కావాలనే నిరాధార ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై వస్తున్న ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. అటు రాజకీయ వర్గాలు, ఇటు జిల్లా ప్రజల్లో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. మరోవైపు ఈ వ్యవహారంపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీశాయి. కాగా, ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే మంగళవారం స్పందించారు.తనపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, బురద జల్లేందుకే కొందరు సోషల్ మీడియా వేదికగా కుట్రలు చేశారని ఆరోపించారు. వారి వివరాలను బయటపెడతానని స్పష్టం చేశారు. గత మూడు రోజులుగా సోషల్ మీడియాలో యువతుల కోసం చాటింగ్ పేరుతో వైరలైన ఫొటోలతో తనకు సంబంధం లేదని తెలిపారు. డెయిరీ విస్తరణ కోసం ఎమ్మెల్యేగా పిలిస్తే వెళ్లానని, అంతకుమించి తనకు ఏం తెలియదనీ అన్నారు. బాధిత రైతులు నిర్వాహకులపై కేసులు పెట్టగా, కొందరు కావాలనే తనపై నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. డెయిరీ నిర్వాహకులపై ఆంధ్రప్రదేశ్‌లో గతంలోనే పలుచోట్ల కేసులు ఉన్నాయని చెప్పారు. తనపై గిట్టనివాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు తమ వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశారని డెయిరీలో పనిచేసిన ఓ ఉద్యోగి, పలువురు రైతులు నిర్వాహకులపై ఆరోపణలు చేశారు. కాగా, డెయిరీ భాగస్వామి అయిన షెజల్ మంగళవారం మరో వీడియోను విలేకరులకు విడుదల చేశారు. 'మేం బ్లాక్ మెయిల్ చేస్తున్నామని అంటున్నారు, ఇంతటితో ఆపేస్తే ఆయనకు మంచిది, లేదంటే మేం నిజాల్ని బయటపెడతాం, మేం ఎవరికీ అన్యాయం చేయడం లేదు. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం'అని పేర్కొన్నారు.

ఏపీలో జూన్ 3 నుంచి గ్రూప్–1 మెయిన్ పరీక్షలు

సాక్షి, అమరావతి: ఏపీలో గ్రూప్–1 పోస్టుల భర్తీకి నిర్వహించాల్సిన మెయిన్ పరీక్షలను ఏపీపీఎస్సీ రీషెడ్యూల్ చేసింది. ఏప్రిల్ 23 నుంచి 29 వరకు నిర్వహించాలని గతంలో నిర్ణయించిన ఈ పరీక్షలను జూన్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనుంది. యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ పరీక్షలకు సంబంధించిన మూడోవిడత ఇంటర్వ్యూలు ఏప్రిల్ 24 నుంచి మే 18 వరకు జరుగనుండడంతో ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్ పరీక్షలను రీషెడ్యూల్ చేసింది. సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారు ఆ ఇంటర్వ్యూల్లో విజయం సాధించేలా సన్నద్ధమయ్యేందుకు వీలుగా గ్రూప్–1 మెయిన్ పరీక్షలను వాయి దా వేయాలని కమిషన్ నిర్ణయించినట్లు ఏపీపీఎస్సీ సభ్యుడు ఎస్.సలాంబాబు తెలిపారు.

70 వేల మంది కార్మికులకు, ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలలో 70 వేలకు పైగా ఉన్న కార్మికులకు, ఉద్యోగులకు, ఇంజనీర్లకు, ఆర్టిజన్స్‌కు, రిటైర్డ్ ఉద్యోగులకు ఏప్రిల్ 2022 నుండి అమలు చేయవలసిన పీఆర్సీని వెంటనే అమలు చేయడం వల్ల 3 లక్షల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 2017 సంవత్సరంలో విద్యుత్ కంపెనీలలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నటువంటి సుమారు 23 వేల మందిని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిజన్స్‌గా గుర్తించిందని, వారిని క్రమబద్ధీకరించాలని కూనంనేని కోరారు.

దళితబంధు అమలుపై అధికారులపై కొప్పుల ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: దళితబంధు అమలుపై అధికారులపై ఎస్సీ సంక్షేమ శాఖమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కింది స్థాయిలో దళితబంధులో అక్రమాలు జరుగుతున్నాయని, వెంటనే అక్రమాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తిరిగి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. దళితబంధుపై ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో కొప్పుల ఈశ్వర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్, ఎండీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నెల నెలా ఎంత ఆదాయం వస్తుందో కూడా తెలుసుకోవాలి, పక్కాగా నమోదు చేయాలని కొప్పుల ఆదేశించారు. ఇప్పటివరకు ఇచ్చిన దళితబంధు పథకం విజయవంతంగా నడుస్తున్న వాటిపై అవగాహన పెంచి అలాంటి వాటిని ఎక్కువ లబ్ధిదారులకు వచ్చేలా చూడాలని సూచించారు. దళితబంధు కింద అందజేసిన యూనిట్లు ఎక్కడ కూడా ఫెయిల్ కావొద్దని, జాగ్రత్తగా అందజేయాలన్నారు. ఆవులను, గేదెలను ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు వాటి పెంపకంపై ఎప్పటికప్పుడు పశు వైద్యులతో వాటి ఆరోగ్యంపై సలహాలు, సూచనలు ఇవ్వాలని చెప్పారు.

క్లుప్తంగా..

స్వల్పంగా పెరిగిన ఈపీఎఫ్‌వో వడ్డీ రేటు

న్యూఢిల్లీ: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) డిపాజిట్లపై వడ్డీ రేటు 2022–23 ఆర్థిక సంవత్సరానికి 8.15 శాతానికి పెరిగింది. ఈ మేరకు కేంద్ర కార్మిక మంత్రి భూపేంద్ర యాదవ్ నేతృత్వంలోని ఈపీఎఫ్‌వో అత్యున్నత నిర్ణాయక సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (ఈబీటీ) నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖ అనుమతి పొందిన తర్వాత ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ జారీ చేయనుంది. ఆ తర్వాత తాజాగా పెంచిన వడ్డీరేటు మొత్తాన్ని ఈపీఎఫ్‌వో చందాదారుల ఖాతాల్లో జమ చేయనుంది. 2022 మార్చిలో డిపాజిట్లపై వడ్డీ రేటును ఈపీఎఫ్‌వో 8.10%కి తగ్గించిన విషయం తెలిసిందే. ఇది గత నాలుగు దశాబ్దాల్లోనే అత్యల్పం కావడం గమనార్హం. అంతకుముందు అది 8.5 శాతంగా ఉండేది.

మరింత అణు ఇంధనోత్పత్తి

ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్

సియోల్: అణుపాటవాన్ని మరింతగా పెంచుకునేందుకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ తీవ్రంగా యత్నిస్తున్నారు. అణు బాంబుల తయారీకి అవసరమైన అణు ఇంధన ఉత్పత్తిని మరింత వేగవంతం చేయాలని మంగళవారం జరిగిన సమావేశంలో అధికారులు, శాస్త్రవేత్తలను ఆయన ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ముఖ్యమైన లక్ష్యాలను అధ్యక్షుడు వారికి వివరించినట్లు అధికార వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా తాజా అణ్వాయుధ వ్యవస్థలను, వారి తయారీలో పురోగతిని అధికారులతో ఆయన సమీక్షించినట్లు తెలిపింది.

రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఒక్కరోజులో ఆపేవాణ్ని: ట్రంప్

వాషింగ్టన్: 2020 ఎన్నికల్లో మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైతే రష్యా–ఉక్రెయిన్‌ల యుద్ధం జరిగి ఉండేదే కాదని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో తనకున్న మంచి సంబంధాల దృష్ట్యా, అసలు ఈ యుద్ధం మొదలయ్యేదే కాదన్నారు. ఇటీవల ఫాక్స్ న్యూస్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. అమెరికా అధ్యక్షుడిగా రష్యా–ఉక్రెయిన్ సంక్షోభానికి 24 గంటల్లోనే ముగింపు పలికి ఉండేవాడినని చెప్పుకున్నారు. ''2024 దాకా యుద్ధం కొనసాగితే, నేను మళ్లీ అధ్యక్షుడినైతే ఒక్క రోజులోనే శాంతి ఒప్పందం కుదురుస్తా. నాకు, పుతిన్‌కు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య శాంతి చర్చలు చాలా ఈజీ వ్యవహారం. సంక్షోభం ఇలాగే కొనసాగితే, అమెరికా అధ్యక్ష ఎన్నికల నాటికి మూడో ప్రపంచయుద్ధానికి దారితీసి, అణుయుద్ధంగా మారే ప్రమాదముంది. రెండు ప్రపంచ యుద్ధాలు మూర్ఖుల కారణంగా స్వల్ప కారణాలతోనే జరిగాయి'' అన్నారు.

కన్నడనాట రిజర్వేషన్ల రగడ


- 4 % ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ సర్కారు వేటు
- లింగాయత్, వక్కలిగలకు సమానంగా పంపకం
- అసెంబ్లీ ఎన్నికల వేళ వివాదాస్పద నిర్ణయం
- ఎస్సీ 'అంతర్గత'రిజర్వేషన్లపైనా మంటలు

అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటకలో బసవరాజ్ బొమ్మై సారథ్యంలోని బీజేపీ సర్కారు రిజర్వేషన్ల తేనెతుట్టెను కదిపింది. ఓబీసీ కోటాలో ముస్లింలకు అందుతున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ గత వారం వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఆ 4 శాతాన్ని బీజేపీకి గట్టి ఓటు బ్యాంకైన వక్కలిగలు, లింగాయత్‌లకు సమానంగా పంచడంపై కలకలం రేగుతోంది. ఈ పరిణామం విపక్ష కాంగ్రెస్‌కు మింగుడు పడటం లేదు. ఇవి ఓటు బ్యాంకు రాజకీయాలని విమర్శిస్తూనే, తాము అధికారంలోకి వస్తే ముస్లింల కోటాను పునరుద్ధరిస్తామంటూ హస్తం పార్టీ తాజాగా ఎన్నికల హామీ ఇచ్చింది. మరోవైపు ఎస్సీ రిజర్వేషన్లను ఉప కులాలవారీగా విభజించిన తీరుతో తమకు అన్యాయం జరిగిందంటూ బంజారాలు, ఆదివాసీలు రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏం జరిగింది?

కర్ణాటకలో ముస్లింలను ఓబీసీ జాబితాలోని 2బీ కేటగిరీ నుంచి తొలగిస్తూ బొమ్మై ప్రభుత్వం వారం క్రితం నిర్ణయం తీసుకుంది. ఓబీసీ కోటాలో భాగంగా విద్య, ఉద్యోగాల్లో వారికి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేసింది. వాటిని లింగాయత్‌లు, వక్కలిగలకు చెరో 2 శాతం చొప్పున పంచింది. ముస్లింలను ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనకబడ్డ వర్గాల) జాబితాకు మారుస్తున్నట్టు సీఎం బొమ్మై చెప్పుకొచ్చారు. ''మతాధారిత రిజర్వేషన్లకు రాజ్యాంగంలో చోటు లేదు. ముస్లింలకు ఇకనుంచి 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అందుబాటులో ఉంటాయి'' అన్నారు.



వక్కలిగ, లింగాయత్... బలీయమైన ఓటు బ్యాంకులు

వక్కలిగలు, లింగాయత్‌లు కర్ణాటకలో బలమైన సామాజిక వర్గాలు. బలీయమైన ఓటు బ్యాంకులు కావడంతో ఎన్నికల్లో వాటి ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. బెంగళూరు నగర నిర్మాత కెంపె గౌడది వక్కలిగ సామాజిక వర్గమే. రాష్ట్రంలో గత, ప్రస్తుత రాజకీయ ప్రముఖుల్లో చాలామంది ఈ కులాలకు చెందినవారే.



- పలు నివేదికల ప్రకారం రాష్ట్ర జనాభాలో లింగాయత్‌లు 17 శాతం ఉంటారు.
- మొత్తం 224 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 100 చోట్ల వీరు ఫలితాలను శాసించే స్థితిలో ఉన్నారు.
- లింగాయత్‌లు రెండు దశాబ్దాలకు పైగా బీజేపీకి గట్టి మద్దతుదారులుగా ఉంటూ వస్తున్నారు.
- ఇక వక్కలిగలు జనాభాలో 11% ఉన్నట్టు అంచనా. కానీ తాము నిజానికి 16 శాతం దాకా ఉంటామన్నది వీరి వాదన.
- తొలుత ప్రధానంగా వ్యవసాయదారులైన వక్కలిగలు స్వాతంత్ర్యానంతరం పలు రంగాలకు విస్తరించి పట్టు సాధించారు.
- తమకు రిజర్వేషన్లు పెంచాలంటూ ఈ రెండు సామాజిక వర్గాలూ కొద్ది నెలలుగా బొమ్మై ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. లేదంటే ఈసారి బీజేపీకి ఓటేసేది లేదంటూ భీష్మించుకున్నాయి.
- తాజాగా ముస్లింల 4 శాతం రిజర్వేషన్లను వీరికి పంచడంతో వక్కలిగల రిజర్వేషన్లు 4 నుంచి 6 శాతానికి, లింగాయత్‌లకు 5 నుంచి 7 శాతానికి పెరిగాయి.

కాంగ్రెస్ ఏమంటోంది?


ముస్లింలను ఓబీసీ జాబితా నుంచి ఏ ప్రాతిపదికన తొలగించారంటూ కాంగ్రెస్ మండిపడింది. ఇది మతాల మధ్య మంటలు రాజేసే యత్నమంటూ దుయ్యబట్టింది. ముస్లింల 4 శాతాన్ని తమకు పంచడంపై లింగాయత్‌లు, వక్కలిగలు కూడా సంతోషంగా లేరని చెప్పుకొచ్చింది. ''ముస్లింలను ఓబీసీ నుంచి ఈడబ్ల్యూఎస్ కోటాకు మార్చడం రాజ్యాంగవిరుద్ధం. ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఏ మతానికి, కులానికి చెందిన వారైనా జనరల్ కేటగిరీ అయిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాకు అర్హులే అవుతారు. అలాంటి కోటాకు ముస్లింలను మార్చి, వారికేదో కొత్తగా 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు బీజేపీ చెప్పుకోవడం విడ్డూరం''అంటూ మండిపడింది. తాము అధికారంలోకొస్తే వారికి 4 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని ప్రకటించింది.

భగ్గుమన్న బంజారాలు, ఆదివాసీలు

విద్య, ఉద్యోగాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లను 15 నుంచి 17 శాతానికి, ఎస్టీలకు 4 నుంచి 7 శాతానికి బీజేపీ సర్కారు గత డిసెంబర్‌లో పెంచింది. అయితే వారిలో అణగారిన ఉప కులాల వారికి రిజర్వేషన్ల ఫలాలు అందకుండా బలవంతులైన కొన్ని ఉప కులాల వాళ్లే వాటిని అత్యధికంగా చేజిక్కించుకుంటున్నారన్న ఫిర్యాదు చాలాకాలంగా ఉంది. ఈ అసమానతలను సరిచేయాలన్న వారి చిరకాల డిమాండ్‌పై బొమ్మై ప్రభుత్వం ఇటీవలే రంగంలోకి దిగింది. 101 ఎస్సీ కులాల వారికి సమ న్యాయం చేసేందుకు అంతర్గత రిజర్వేషన్లను నిర్ణయించింది.

- ఆ మేరకు రాజ్యాంగంలోని 341(2) ఆర్టికల్ ప్రకారం ఎస్సీలను 4 విభాగాలుగా వర్గీకరించారు. ఎస్సీ (లెఫ్ట్)కు 6 శాతం రిజర్వేషన్లు కేటాయించింది. ఆ జాబితాలోకి మాదిగ, ఆది ద్రవిడ, బాంబి ఉపకులాలు వస్తాయి.
- ఎస్సీ (రైట్)కు 5.5 శాతం కేటాయించింది. ఆది కర్ణాటక, హోలెయా, చలవాది ఉప కులాలు దీని కిందికి వస్తాయి. బంజారా, భోవి, కొరచ, కొరమలకు 4.5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.
- మిగిలిన ఒక్క శాతం సంచార, ఆదివాసీ జాతులైన అలెమరి, ఆరె అలెమరిలకు దక్కుతుంది.
- దీన్ని బంజారా, భోవి కులాలవాళ్లు తీవ్రంగా నిరసిస్తున్నారు. తమకు తీరని అన్యాయం జరిగిందంటూ ఆందోళనలకు దిగారు. తాజాగా మాజీ సీఎం యడ్యూరప్ప నివాసంపై రాళ్లు రువ్వడం అందులో భాగమే.

కర్నాటకలో రిజర్వేషన్ల తీరుతెన్నులు..



అతీక్ అహ్మద్‌కు జీవిత ఖైదు

ఉమేశ్ పాల్ కిడ్నాప్ కేసులో కోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్(యూపీ): 2006 నాటి ఉమేశ్‌పాల్ కిడ్నాప్ కేసులో గ్యాంగ్‌స్టర్–రాజకీయ నేత అతీక్ అహ్మద్, మరో ఇద్దరికి కఠిన జీవిత ఖైదు విధిస్తూ ఎంపీ–ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. తలా రూ.1 లక్ష చొప్పున జరిమానా కూడా విధించింది. అతీక్‌పై నమోదైన 100కు పైగా కేసుల్లో శిక్ష పడిన మొట్టమొదటి కేసు ఇదే. ఇదే కేసులో అతీక్ సోదరుడు ఖాలిద్ అజీం అలియాస్ అష్రఫ్, మరో ఆరుగురిని కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. తీర్పుపై హైకోర్టుకు వెళతామని అతీక్ పోలీస్ వ్యాన్ నుంచి విలేకరులతో అన్నాడు. కోర్టు తీర్పు అనంతరం పోలీసులు ముగ్గురినీ వేర్వేరు వ్యాన్లలో నైని జైలుకు తరలించారు. 2005లో జరిగిన బీఎస్‌పీ ఎమ్మెల్యే రాజు హత్య కేసులో అహ్మద్ తదితరులు నిందితులు. ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఉమేశ్ పాల్‌ను అతీక్ కిడ్నాప్ చేసి, బెదిరించాడు. ఈ కేసులో అతీక్ జైలుపాలయ్యాడు.

సౌదీలో బస్సు ప్రమాదం..20 మంది మృతి

రియాద్: సౌదీ అరేబియాలో ఉమ్రాహ్ తీర్థయాత్రికులతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురై 20 మంది చనిపోగా మరో 24 మంది గాయపడ్డారు. అసిర్ ప్రావిన్స్‌లోని అకాబట్ షార్ వద్ద సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఖమిస్ ముషాయత్ నుంచి అభా వైపు వెళ్తున్న బస్సు బ్రేకులు ఫెయిలై వంతెన గోడను ఢీకొట్టిన అనంతరం బోల్తాపడి మంటల్లో చిక్కుకుంది.

ఆ బంగ్లాతో ఎన్నో జ్ఞాపకాలు

అయినా ఖాళీ చేస్తా: రాహుల్



న్యూఢిల్లీ: ఎంపీగా అనర్హత వేటు పడ్డ నేపథ్యంలో అధికారిక బంగ్లాను ఖాళీ చేస్తానని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. నెల రోజుల్లోపు దాన్ని ఖాళీ చేయాలన్న లోక్‌సభ సచివాలయం నోటీసుపై ఆయన మంగళవారం స్పందించారు. ''12, తుగ్లక్ లేన్‌లో నాకు కేటాయించిన బంగ్లాను ఖాళీ చేయాలంటూ మీరు పంపిన లేఖకు ధన్యవాదాలు. నాలుగుసార్లు ఎంపీగా ఆ బంగ్లాలో చాలా ఏళ్లు గడిపాను. నాకక్కడ ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. నా హక్కులకు భంగం కలగని రీతిలో వ్యవహరిస్తా'' అంటూ నోటీసుకు బదులిచ్చారు. సదరు బంగ్లాలో రాహుల్ 2005 నుంచీ ఉంటున్నారు. దాన్ని ఖాళీ చేయాలన్న తాఖీదులపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. మోదీ సర్కారు తాలూకు 'బెదిరించి, భయపెట్టి, అవమానించే' వైఖరికి ఇది పరాకాష్ట అంటూ దుయ్యబట్టారు. రాహుల్‌ను బలహీనపరిచేందుకు ముందు కూడా ఎంత చేయాలో అంతా చేస్తారని అభిప్రాయపడ్డారు. ''రాహుల్‌కంటూ సొంతిల్లు లేదు. అధికారిక బంగ్లా వీడాక తన తల్లి సోనియాతో 10, జన్‌పథ్ నివాసంలో ఉంటారు. లేదంటే నా ఇంటిని ఖాళీ చేసి ఆయనకిస్తా'' అని ఖర్గే చెప్పుకొచ్చారు. ''ఎన్నికల ఫలితాలు వచ్చిన ఆర్నెల్ల తర్వాత గానీ నాకు అధికారిక బంగ్లా కేటాయించలేదు. ఇలాంటివి బీజేపీకి అలవాటే'' అని విమర్శించారు.

మళ్లీ వాయిదా

ఉభయసభల్లో అదే తంతు

న్యూఢిల్లీ: అవే డిమాండ్లు. అవే ఆందోళనలు. అవే దృశ్యాలు. అదే తంతు. పార్లమెంటు ఉభయ సభల్లో మంగళవారం కూడా విపక్ష ఆందోళనలు యథావిధిగా కొనసాగాయి. సభ్యులంతా మరోసారి నల్ల దుస్తులతో సభలకు వచ్చారు. అదానీ అంశంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేశారు. 'మోదీ–అదానీ భాయీ భాయీ' వంటి నినాదాలతో హోరెత్తించారు. పదేపదే వెల్‌లోకి దూసుకెళ్లారు. సభాపతి స్థానాలపైకి పేపర్లు, స్కార్ఫులు విసిరారు! దాంతో లోక్‌సభ, రాజ్యసభ రెండూ ముందు మధ్యాహ్నానికి, అనంతరం బుధవారానికి వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే రాజ్యసభలో పలు నివేదికలను ప్రవేశపెట్టారు. మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలతో చరిత్ర సృష్టించిన నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహైన్, నీతూ ఘంఘాస్, స్వీటీ బూరాలను సభ అభినందించింది.

అవినీతిపరులను కాపాడేందుకే...
విపక్షాల ఉద్యమం

దేశ వ్యతిరేక శక్తులు చేతులు కలుపుతున్నాయి • విపక్షాలపై మోదీ విసుర్లు

- బీజేపీ ఎంతగా గెలుస్తుంటే అంతగా విమర్శలు
- అయినా అవినీతిపై చర్యలు ఆగవు
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అవినీతికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యల వల్లే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలు అవినీతికి వ్యతిరేకంగా జరిగే పోరును ఆపలేవని స్పష్టం చేశారు. బీజేపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ఖ్యాతి అత్యున్నత శిఖరాలకు చేరుకున్న ఈ సమయంలో, భారత వ్యతిరేక శక్తులు అంతర్గతంగా, వెలుపలా చేతులు కలపడం సహజమేనని ప్రధాని పేర్కొన్నారు. కేంద్రం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందంటూ కొన్ని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలపై ఆయన.. కొన్ని 'అవినీతి రక్షణ ఉద్యమం' ప్రారంభించాయంటూ పరోక్షంగా దుయ్యబట్టారు. కొందరికి కోపం కూడా వస్తోందంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలతోనే గతంలో ఇంతగా అవినీతి జరిగిందనే విషయాన్ని ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. 'తప్పుడు ఆరోపణలతో దేశం తలవంచదు. అవినీతిపై చర్యలు ఆగవు. భారత వ్యతిరేక శక్తులు బలమైన పునాది వంటి రాజ్యాంగ సంస్థలపై దాడులు చేస్తున్నాయి. దేశాభివృద్ధిని ఆపేందుకు దాడికి దిగుతున్నాయి. న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేందుకు, వాటి విశ్వసనీయతను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయి'అని ఆరోపించారు. 2004–14 సంవత్సరాల మధ్య యూపీఏ ప్రభుత్వం మనీలాండరింగ్ ఆరోపణలపై రూ.5 వేల కోట్ల సొత్తును స్వాధీనం చేసుకోగా 9 ఏళ్లలో తమ ప్రభుత్వం రూ.1.10లక్షల కోట్ల ఆస్తుల్ని స్వాధీనం చేసుకుందన్నారు. ఎన్నికల్లో బీజేపీ విజయాలకు, తమ ప్రభుత్వంపై విపక్షాల విమర్శలకు సంబంధముందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బీజేపీ ఎంతగా విజయాలు సాధిస్తే ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని అంతగా లక్ష్యంగా చేసుకుంటాయన్నారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వంపై పలు అంశాలపై ప్రతిపక్షాలు విమర్శలు ఎక్కుపెడుతుండటాన్ని ఆయన ప్రస్తావించారు. బీజేపీ వరుస విజయాలు నమోదు చేసుకుంటున్న నేపథ్యంలోనే గుజరాత్ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల విమర్శల దాడులు ఎక్కువైనట్లు చెప్పారు. ముమ్ముందు ఈ విమర్శలు అన్ని స్థాయిల్లోనూ తీవ్రతరమవుతాయని హెచ్చరించారు.

ఏప్రిల్ 6–14 మధ్య సేవా కార్యక్రమాలు

బీజేపీ వ్యవస్థాపక దినం ఏప్రిల్ 6 నుంచి మొదలుకొని ఏప్రిల్ 14వ తేదీ అంబేడ్కర్ జయంతి రోజు వరకు సొంత నియోజకవర్గాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నం కావాలని మోదీ ఎంపీలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమాజంపై ఎంతో ప్రభావం చూపే రాజకీయ నేతలు రాజకీయేతర అంశాలపైనా దృష్టి సారించాలన్నారు. ''విష రసాయనాల నుంచి నేలకు విముక్తి కల్పించాలి. ఎంపీలు కొత్త సాంకేతికతను అలవర్చుకునేందుకు నిపుణుల సేవలను వినియోగించుకోవాలి. మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో విజయాలకు మోదీని పార్టీ ప్రశంసించింది.



బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో నేతలతో మోదీ

బీజేపీ దేశవ్యాప్త ఆందోళనలు

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ 'దొంగలందరి ఇంటి పేరు మోదీ' వ్యాఖ్యలపై దేశవ్యాప్త ఆందోళనలకు బీజేపీ ఓబీసీ మోర్చా నిర్ణయించింది. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 14 దాకా రాహుల్‌కు వ్యతిరేకంగా ప్రచారోద్యమం చేపట్టనున్నట్టు ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రకటించారు. రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ ఓబీసీ ఎంపీలు మంగళవారం ఢిల్లీలో ర్యాలీ చేశారు. ఆయన తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

స్పీకర్‌పై అవిశ్వాసం!

రాహుల్ అనర్హత వేటుపై కాంగ్రెస్ యోచన	విపక్ష పార్టీలతో విస్తృత సంప్రదింపులు	విపక్షాల కూటమి బలోపేతానికి యత్నం	ప్రతిపక్ష అగ్ర నేతలతో త్వరలో సమావేశం



కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో పాల్గొన్న పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీపై అనర్హత వేటుపై జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ అంశంపై బహుముఖ దాడితో అధికార బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా ముందుగా 'ఏకపక్షంగా వ్యవహరించి రాహుల్‌పై వేటు వేశా'రంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని యోచిస్తోంది. కాంగ్రెస్ ఎంపీలంతా మంగళవారం ఉదయమే సమావేశమై దీనిపై మల్లగుల్లాలు పడ్డారు. కోర్టు శిక్ష విధించిన గంటల వ్యవధిలోనే ఆగమేఘాలపై రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిన వైనాన్ని అవిశ్వాస తీర్మానం ద్వారా హైలైట్ చేయొచ్చన్న భావన వ్యక్తమైంది. అనంతరం దీనిపై విపక్షాలతో కూడా విస్తృతంగా చర్చోపచర్చలు జరిపినట్టు సమాచారం. అన్నీ కుదిరితే వచ్చే సోమవారం అవిశ్వాసం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే కొన్ని విపక్షాలు ఇందుకు అభ్యంతరం చెబుతున్నట్టు సమాచారం. ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటున్న విపక్షాల ఐక్యత యత్నాలకు ఇది గండి కొట్టే ప్రమాదముందన్నది వాటి వాదనగా తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే కనీసం 50 మంది ఎంపీల మద్దతు సంతకాలు అవసరం. పైగా పార్లమెంటు ఉభయ సభలూ రెండు వారాలుగా ఒక్క రోజు కూడా సజావుగా నడవని నేపథ్యంలో తీర్మానం సాధ్యాసాధ్యాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

త్యాగాలకు సిద్ధమవ్వాలి | విపక్షాలకు రాహుల్ పిలుపు

రాహుల్‌పై వేటును నిరసిస్తూ తృణమూల్ కాంగ్రెస్‌తో సహా 17 ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్‌కు తాజాగా సంఘీభావం ప్రకటించడం తెలిసిందే. ఈ క్రమంలో పార్లమెంటులో కన్పించిన విపక్షాల ఈ ఐక్యతను మరింత ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోంది. అందులో భాగంగా ఏప్రిల్ తొలి వారంలో విపక్ష అగ్రనేతలతో కీలక సమావేశం జరపాలని నిర్ణయించింది. సోమవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన విపక్షాల భేటీలోనే ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ''విపక్షాల అగ్ర నేతలు, అధ్యక్షులంతా భేటీ అయ్యేలా కాంగ్రెస్ చొరవ తీసుకోవాలని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్‌తో పాటు డీఎంకే, జేడీ(యూ), సీపీఎం నేతలు ప్రతిపాదించారు. 2024 సాధారణ ఎన్నికలకు అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాన్ని నిర్ణయించుకోవాల్సిన అవసరం చాలా ఉందని వారు పదేపదే చెప్పారు'' అని కాంగ్రెస్ ముఖ్యనేత ఒకరు వివరించారు. విపక్షాలన్నీ త్యాగాలకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ స్పష్టం చేసినట్టు చెబుతున్నారు. ''విపక్షాల ఐక్యత కోసం ఎంతటి త్యాగాలకైనా కాంగ్రెస్ సిద్ధం. నేనూ సిద్ధం'' అని ఆయన కుండబద్దలు కొట్టారని సమాచారం. ఆ భేటీకి దూరంగా ఉన్న శివసేన (ఉద్ధవ్ వర్గం) కూడా తమతో కలిసి నడుస్తోందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ వివరించారు అదానీ ఉదంతం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో తృణమూల్ సహా విపక్షాలను కాంగ్రెస్‌కు దగ్గర చేయడం తెలిసిందే.

'అదానీ'పై మోదీకి లేఖలు!

రాహుల్‌పై వేటును నిరసిస్తూ, అదానీ అంశంపై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ నెల రోజుల పాటు బ్లాక్ స్థాయి నుంచి హస్తిన దాకా దేశవ్యాప్త ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మార్చి 24న పార్టీ స్టీరింగ్ కమిటీ, పీసీసీ చీఫ్‌లు, అనుబంధ విభాగాల చీఫ్‌లతో జరిగిన భేటీలో అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. వివరాలు...

- ➔ ఢిల్లీలోని ఎర్రకోట నుంచి మొదలు పెట్టి దేశంలోని 35 ప్రధాన నగరాల్లో మంగళ, బుధ వారాల్లో 'లోక్‌తంత్ర్ బచావో శాంతి మార్చ్'
- ➔ ఏప్రిల్ రెండో వారంలో 'జై భారత్ మహా సత్యాగ్రహం'. ఇందులో భాగంగా బ్లాక్/మండల కాంగ్రెస్ విభాగాలు సభలు, సమావేశాలు నిర్వహించి రాహుల్‌పై వేటు, అదానీతో ప్రధాని మోదీ బంధంపై ప్రజలకు వివరిస్తాయి. రాహుల్ సందేశాన్ని పార్టీ సోషల్ మీడియా విభాగాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తాయి.
- ➔ ఏప్రిల్ 15 నుంచి 20 దాకా జై భారత్ మహా సత్యాగ్రహంలో భాగంగా విపక్షాలతో కలిసి జిల్లాల్లో కలెక్టరేట్ల ఘెరావ్. రాష్ట్ర స్థాయిలోనూ భారీ కార్యక్రమం. ఒక్క రోజు ఉపవాస దీక్షలు. అనంతరం ఢిల్లీలో జాతీయ స్థాయిలో భారీ సత్యాగ్రహం.
- ➔ మార్చి 31న జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ నేతల మీడియా సమావేశాలు.
- ➔ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ తదితరాల ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమం. అదానీ అవినీతి, రాహుల్‌పై వేటు తదితరాలపై ప్రశ్నిస్తూ ప్రధాని మోదీకి లేఖలు.
- ➔ మహిళా కాంగ్రెస్ నిరసన ర్యాలీ.

నాష్‌విల్లే స్కూల్‌లో దురాగతం..
మాజీ విద్యార్థి పనే

28 ఏళ్ల ట్రాన్స్‌జెండర్‌గా గుర్తింపు



కాల్పులు జరుపుతున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) షూటర్

నాష్‌విల్లే: అమెరికాలోని నాష్‌విల్లే క్రిస్టియన్ ఎలిమెంటరీ స్కూల్‌లో జరిగిన కాల్పుల్లో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. మృతుల్లో తొమ్మిదేళ్ల ముగ్గురు చిన్నారులతోపాటు స్కూల్ హెడ్ కేథరిన్, ఒక సబ్‌స్టిట్యూట్ టీచర్, కస్టోడియన్ ఒకరు ఉన్నారు. అనంతరం పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయిన వ్యక్తిని 28 ఏళ్ల ఆడ్రే ఎలిజబెత్ హేల్ అనే ట్రాన్స్‌జెండర్ మహిళగా గుర్తించారు. కాల్పుల గురించి పోలీసులకు 10.13 గంటల సమయంలో సమాచారం అందింది. వెంటనే స్కూల్ వద్దకు చేరుకుని మొదటి అంతస్తులో ఉన్న విద్యార్థులు, సిబ్బందిని ఖాళీ చేయించారు. రెండో అంతస్తులో కాల్పుల శబ్దం వినిపించడంతో అక్కడికి వెళ్లిన పోలీసులపై హేల్ కాల్పులకు తెగించింది. వెంటనే జరిపిన ఎదురుకాల్పుల్లో హేల్ అక్కడికక్కడే హతమైంది. ఆమె వద్ద ఉన్న రెండు అసాల్ట్ రైఫిళ్లు, ఒక హ్యాండ్ గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15 నిమిషాల్లో ఇదంతా జరిగిపోయింది. ఆమె స్కూల్‌లోకి కారులో వచ్చినట్లుగా సీసీ పుటేజీలో రికార్డయి ఉంది. షూటర్ హేల్ మాజీ విద్యార్థి అని అంటున్న పోలీసులు ప్రస్తుతం ఆమెకు స్కూల్‌తో గానీ స్కూల్ స్టాఫ్‌తో గానీ ఎటువంటి సంబంధాలున్నాయి? ఎవరిపై అయినా విరోధంతో ఈ ఘోరానికి పాల్పడిందా? అనే విషయాలను పోలీసులు వెల్లడించలేదు. అయితే, కోవెనంట్ స్కూల్‌పై ద్వేష భావం ఉన్నట్లు కనిపిస్తోందని పోలీస్ చీఫ్ జాన్ డ్రేక్ అన్నారు. మరోచోట కూడా కాల్పులు జరిపేందుకు హేల్ పథకం వేసినట్లు భావిస్తున్నామన్నారు. ఎన్‌కౌంటర్ ముగిసిన వెంటనే హేల్ ఇంట్లో జరిపిన సోదాల్లో పోలీసులకు రెండు షాట్‌గన్‌లు దొరికాయి. ఇంకా స్కూల్‌కు సంబంధించిన మ్యాప్, ఇతర ప్రదేశాల మ్యాప్‌లు, కాల్పులకు ముందు రెక్కీ చేపట్టినట్లు ఆధారాలు దొరికాయి. ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు, అనూహ్య ఘటన జరగబోతోందంటూ కొద్ది నిమిషాలకు ముందే హేల్ తమకు మెసేజీలు పంపినట్లు స్నేహితులు చెబుతున్నారు. దారుణానికి వేదికైన కోవెనంట్ ప్రెస్బిటేరియన్ చర్చి స్కూల్ 2001లో ప్రారంభమైంది. ఇక్కడ ప్రి స్కూల్ నుంచి ఆరో గ్రేడ్ వరకు 200 మంది వరకు చిన్నారులు చదువుకుంటుండగా, 50 మంది సిబ్బంది ఉన్నారు.

మెక్సికో వలసదారుల కేంద్రంలో విషాదం..
39 మంది సజీవ దహనం

మెక్సికో సిటీ: మెక్సికోలో అమెరికా సరిహద్దుల్లో వలసదారుల డిటెన్షన్ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం 39 మంది సజీవ దహనం కాగా 29 మంది పరిస్థితి విషమంగా ఉంది. వలసదారులు పరుపులకు నిప్పు పెట్టడమే దీనికి కారణమంటున్నారు. అమెరికాలోకి ప్రవేశించేందుకు ఎదురుచూసే వారిని, ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఈ డిటెన్షన్ సెంటర్‌లోనే ఉంచుతుంటారు.

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామి



సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎడపాడి పళనిస్వామి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాదిగా పార్టీపై పట్టు సాధించేందుకు ఆయనకు, పన్నీరు సెల్వానికి పోరు సాగుతుండటం తెలిసిందే. గత నెలలో కోర్టు ఉత్తర్వులతో పార్టీ గుర్తు రెండాకులను కూడా పళనిస్వామి దక్కించుకున్నారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 29 । మార్చి । 2023



రక్తహీనతను జయించాలి

రక్తహీనతను ప్రతీ మహిళ జయించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. బుట్టిరాజారాం కాలనీ ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. - 8లో▸



వాతావరణ మార్పు ప్రమాదకరం

అధిక వర్షాలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, చలి తీవ్రత వంటి వాతావరణ మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

రమజాన్ అంటే స్నేహం. నేను న్నానని చెప్పడం, నువ్వున్నావని గుర్తు చేసుకోవడం.
- మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6:32	గురు 4:47

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ఇల్లందకుంటలో బ్రహ్మోత్సవాలు షురూ



ఇల్లందకుంట: అపరభద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం గ్రామ దేవాలయం నుంచి ఉత్సవమూర్తులను డప్పుచప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు శేషం వంశీధరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి తలంబ్రాలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవితాకూర్, సర్పంచ్ కంకణాల శ్రీలత పాల్గొన్నారు.

రాములోరి సేవలో జెడ్పీ సీఈఓ

సీతారామచంద్రస్వామిని జెడ్పీ సీఈవో ప్రియాంక మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మేళతాళాల మధ్య ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆశీర్వచనాలు అందించి, శాలువాతో సన్మానించారు.

ఇంటర్‌లో 515 మంది గైర్హాజరు

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయని డీఐఈవో రాజ్యలక్ష్మి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విభాగంలో 14,953 మందికి 346 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 14,607 మంది పరీక్ష రాశారు. ఒకేషనల్ విభాగంలో 1,416 మందికి 1,247 మంది పరీక్షకు హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తంగా 16,369 మంది విద్యార్థులకు 15,854 మంది వచ్చారని పేర్కొన్నారు. 515 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు డీఐఈవో వెల్లడించారు.



విద్యార్థులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

మంత్రి గంగుల క్యాంప్ ఆఫీస్ ముట్టడి

కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారకులపై చర్యలు తీసుకోవాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని, లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్ ముట్టడించారు. పోలీసులు వారిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ టీఎస్పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే తొలగించి హైకోర్టు జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 లక్షల మంది విద్యార్థులు నిరుద్యోగులు టీఎస్పీఎస్సీ మీద ఆధారపడి చదువుకుంటూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు సకాలంలో ఉన్నతమైన విద్య అందించడంలో విఫలమైందన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయడంలో పేపర్లను డబ్బులకు కక్కుర్తి పడి అమ్ముకోవడంలో మంత్రి కేటీఆర్ హస్తం ఉందన్నారు. సిట్ ద్వారా దర్యాప్తు చేపిస్తున్నామని పేపర్ల ప్రకటననే కనిపిస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పిస్తుందని అన్నారు. లేనిపక్షంలో మరోసారి తెలంగాణ ఉద్యమాన్ని కరీంనగర్ గడ్డ నుంచి తెరలేపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు రంజిత్, పూసాల విష్ణు, నందు, వేణు, శివ, సాయికృష్ణ పాల్గొన్నారు.




గంగుల క్యాంప్ ఆఫీసు ముందు బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

పంచాయతీరాజ్‌లో టీఎస్‌పీఎస్సీ తరహా కుంభకోణం

- 1988లో కట్టా చేరే సమయంలో ఫోర్జరీ సంతకాలు
- సర్వీస్ రికార్డులో ఒక్కో పేజీకి ఒక్కో అధికారి సంతకం
- అంతర్గత సిబ్బందే అతనికి సాయం చేశారని సందేహాలు
- తప్పుడు విధానంలో చేరారంటూ నిగ్గుతేల్చిన నివేదిక
- త్వరలోనే వేటు ఖాయమంటున్న సహోద్యోగులు

పట్టుకోండి చూద్దాం పార్ట్-6



ఎస్‌ఆర్‌లో ఫోర్జరీగా చెబుతున్న సంతకం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసు.. పంచాయతీరాజ్ విభాగంలో ప్రస్తుతం ఏఈగా కొనసాగుతున్న ఈ ఉద్యోగి నియామకం, విద్యార్హతల విషయంలో ఆయన అందరినీ తప్పుదోవ పట్టించారని ఇంతకాలం అనుకున్నారు. కానీ.. అతని సర్వీసు రికార్డులు చూస్తే.. కట్టా విష్ణువర్ధన్ ఇదంతా బయట నుంచి ఒక్కరే చేయలేదనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీల తరహాలోనే అతనికి పంచాయతీరాజ్ విభాగంలోని కొందరు సిబ్బంది సహకరించారన్న విషయం సర్వీసు రికార్డు చూస్తే అర్థం అవుతోంది. నేటి హైటెక్ యుగంలో ఉద్యోగ నియామకాల్లో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కానీ.. ఎలాంటి టెక్నాలజీ లేని రోజుల్లోనే కట్టా విష్ణువర్ధన్ చాలా తెలివిగా తన సర్వీసు రికార్డులో అధికారుల సంతకాల ఫోర్జరీకి వ్యూహం రచించారని అతని సహోద్యోగులు కొత్త సందేహాలను లేవనెత్తుతున్నారు.

రెండు సంతకాలు, రెండు స్టాంపులు..

ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. రెండో పేజీలో డీఈ రవికుమార్ సంతకం, సుల్తానాబాద్ సబ్ డివిజన్ స్టాంప్ ఉంది. అదే సమయంలో మరో అధికారి సంతకం, జగిత్యాల సబ్‌డివిజన్ స్టాంప్ ఉంది. ఇంకా పరిశీలించి చూస్తే.. వీటి అడుగున వేములవాడ సబ్ డివిజన్ స్టాంప్ కూడా ఉంది. మొత్తానికి రెండు సంతకాలు మూడు స్టాంపులతో రెండో పేజీని అత్యంత గందరగోళంగా ఉంది. ఈ లెక్కన చూస్తుంటే.. ఈ సంతకాలను ఫోర్జరీ చేసి ఉంటారని, దీనికి సూత్రధారి విష్ణువర్ధన్ అయి ఉంటాడని సహోద్యోగులు అనుమానిస్తున్నారు. తప్పుడు దారిలో కొలువు సాధించి, అనుమానాస్పద విద్యార్హతలతో ఉద్యోగం చేస్తున్న కట్టాకు ఫోర్జరీలు పెద్ద విషయమేమీ కాదని ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన అతని నియామకం సమయంలో కొందరు కీలక ఉద్యోగులు విష్ణువర్ధన్‌కు సహకరించారని తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సర్వీసు రికార్డును ఇంతకాలం వీసమెత్తు అనుమానం రాకుండా ఉందని విమర్శిస్తున్నారు.

ఏం జరిగింది?



కట్టా విష్ణువర్ధన్

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు వివాదం మరోసారి వార్తల్లోకెక్కింది. పంచాయతీ రాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్-డివిజన్, ఏఈ, విష్ణువర్ధన్ మార్చి2, 1967లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకట నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవపూర్‌లో గ్రేడ్-3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 2, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్లు చిన్నవాడైన ఉద్యోగిగా అరుదైన రికార్డును తనపేరిట లిఖించుకున్నాడు. అదే సమయంలో గ్రేడ్-3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో చేరారు. ఈ విషయం తన సర్వీసు రికార్డులోని అతని చేరికను ధ్రువీకరిస్తూ అతనిపై అధికారి తొలిపేజీలో చేసిన సంతకాన్ని చూసి చెప్పొచ్చు. రెండోపేజీలోనూ అదే అధికారి సంతకం ఉండాలి. కానీ, మరో సబ్ డివిజన్ సుల్తానాబాద్‌కు చెందిన డీఈ సంతకం ఉండటంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. నిబంధనల ప్రకారం.. రెండు పేజీల్లోనూ ఒకే అధికారి సంతకం, స్టాంప్ ఉండాలి. ఇక్కడ వేర్వేరు సబ్‌డివిజన్లకు చెందిన డీఈల సంతకాలు ఉన్నాయి. దీన్ని ఉన్నతాధికారులు ఎలా ఆమోదించారో అని మిగిలిన సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారు.

ఆ సంతకం నాది కాదు

విష్ణువర్ధన్ విద్యార్హతల వివాదం చాలాకాలంగా కొనసాగుతోంది. ఆయన తన సర్వీసులో ఏనాడూ నా వద్ద పనిచేయలేదు. కానీ.. అతని సర్వీసు రికార్డు బుక్‌లో నా సంతకం ఉండటం ఆశ్చర్యానికి గురిచేసింది. నూటికి నూరుపాళ్లు అది నా సంతకం కానే కాదు.

– రవి కుమార్, విశ్రాంత పీఆర్ ఇంజినీర్

ఉగాది మగువ పురస్కారం అందజేత



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన పల్లె స్వరూప మంగళవారం ఉగాది మగువ జాతీయ పురస్కారం అందుకున్నారు. హనుమకొండ జిల్లా పర్కాలలో క్రాంతి జ్యోతి మహిళా సాధికారత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ అవార్డును నిర్వాహకులు అందించారు.

ఆర్టీసీ ద్వారా భద్రాద్రి గోటి ముత్యాల తలంబ్రాలు

విద్యానగర్(కరీంనగర్): భద్రాచలంలో ఈ నెల 30న జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి సంబంధించి గోటి ముత్యాల తలంబ్రాలను ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ద్వారా భక్తులకు చేరవేయనున్నట్లు కరీంనగర్ జోన్ లాజిస్టిక్స్ విభాగం డిప్యూటీ సీటీఎం కేశరాజు భానుకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి, అందించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. స్వామివారి తలంబ్రాలు కావాల్సినవారు సమీప లాజిస్టిక్స్ కౌంటర్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వద్ద రూ.116 చెల్లించి, వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. బుక్ చేసుకున్న భక్తులకు ఏప్రిల్ 3వ తేదీ నుంచి తలంబ్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వరిలో మెడవిరుపు తెగులు

- ఫైరును నాశనం చేస్తున్న ఫైనం
- రెండు, మూడు రోజుల్లోనే తాలుగా మారుతున్న గింజలు
- వాతావరణ మార్పులే కారణమంటున్న అధికారులు
- దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతన్న ఆందోళన
- జిల్లాలో 1.91 లక్షల ఎకరాలలో వరి సాగు



తాలుగా మారిన వరి గింజలను చూపిస్తున్న రైతు

వీణవంక(హుజూరాబాద్): ఆరుగాలం శ్రమించి, పంట పండించిన రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. ఈసారైనా కాలం కలిసివస్తుందన్న ఆశతో యాసంగిలో వరి సాగు చేస్తే ఆదిలోనే కాండం తొలుచు పురుగు ఉధృతికి పైరు పూర్తిగా దెబ్బతింది. కొంతమంది అన్నదాతలు గత్యంతరం లేక చేనును చెడగొట్టి, మళ్లీ నాట్లు వేశారు. ఇటీవల కురిసిన వడగండ్ల వాన వారిని కోలుకోలేని దెబ్బతీసింది. నాలుగు రోజులుగా వాతావరణం చల్లబడుతుండటంతో మెడవిరుపు తెగులు ఆశించి, పైరును నాశనం చేస్తోంది. రెండు, మూడు రోజుల్లోనే చేను మొత్తం వ్యాప్తి చెందుతుందని రైతులు వాపోతున్నారు.

20 వేల ఎకరాల్లో ప్రభావం..

కరీంనగర్ జిల్లాలో ఈసారి 1.91 లక్షల ఎకరాలలో వరి సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెప్పుతున్నాయి. మెడవిరుపు తెగులు ప్రభావం జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల్లో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పైరు గింజ పట్టు దశలో ఉండగా కొన్నిచోట్ల పొట్ట దశలో ఉంది. ఈ తెగులు ఆశిస్తే వరి కంకి గొలుసు కింద నల్లటి మచ్చలు ఏర్పడతాయి. తర్వాత కంకి ఎండిపోయి, రెండు, మూడు రోజుల్లోనే గింజలు తాలుగా మారుతాయి. వాతావరణ మార్పులే ఈ తెగులుకు కారణమని అధికారులు అంటున్నారు. దీని లక్షణాలు కనిపిస్తే పొలం నిండా నీరు పెట్టాలని, ఎట్టి పరిస్థితుల్లో ఆరబెట్టొద్దని చెబుతున్నారు.



మెడవిరుపు తెగులు సోకిన వరి గొలుసులు

సగం దిగుబడి రావడమే గగనం..

జిల్లా వ్యాప్తంగా అగ్గి తెగులు, మెడవిరుపు తెగులు ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. వరి నాటు వేసిన వారం నుంచే కాండం తొలుచు పురుగు వ్యాప్తి చెందింది. రూ.10 వేలు ఖర్చు పెట్టి, ఆరు సార్లు రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం దక్కలేదు. ఇంకో 20 రోజులైతే పంట చేతికి వస్తుందనగా మెడవిరుపు తెగులు రైతన్నను ఆందోళనకు గురిచేస్తోంది. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందని ఆశిస్తే అందులో సగం రావడమే గగనంగా మారిందని అన్నదాతలు అంటున్నారు.

రైతులను అప్రమత్తం చేశాం

20 రోజుల క్రితమే మెడవిరుపు తెగులుపై రైతులను అప్రమత్తం చేశాం. ఇప్పటికైనా తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కాండం తొలుచు పురుగు, కాండం కుళ్లు తెగులు ఉధృతి కూడా అక్కడక్కడ కనిపిస్తోంది. రైతులు దిగులు పడకుండా అప్రమత్తంగా ఉండాలి.

– వెంకటేశ్వర్‌రావు, కేవీకే శాస్త్రవేత్త

నివారణ చర్యలు..

పూత దశ నుంచి గింజ పాలు పోసుకునే దశలో లక్షణాలు కనిపిస్తే ఎకరాకు ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ 500 గ్రాములు, లేదా ఐసోప్రొథయోలెన్ 320 మి.లీ. లేదా కాసుగమైసిన్ 500 మి.లీ. పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25 శాతం, టెబుకొనోజోల్ 50 శాతం 80 గ్రాములు లేదా, పికాక్సీస్ట్రోబిన్ 6.78 శాతం, ట్రైసైక్లోజోల్ 20.33 శాతం, ఎస్‌పీ 400 మి.లీ. పిచికారీ చేయాలి. కాండం కుళ్లు తెగులుకు మొక్క మొదళ్లు తడిచేలా హెక్సాకొనజోల్ 400 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ. ఎకరాకు పిచికారీ చేయాలి.





పరీక్షలు ముగిశాయోచ్..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం ముగియడంతో విద్యార్థులు సంబరాల్లో మునిగారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులను తమ తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. సంతోషంగా వస్తు సామగ్రితో చిందులు వేస్తూ ఇంటిదారి పట్టారు. మరోవైపు బస్టాండ్ కూడా ప్రయాణికులు, విద్యార్థులతో కిక్కిరిసింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్





సేంద్రియ ఎరువుల వాడకం పెంచండి

జమ్మికుంట(హుజూరాబాద్): రైతులు పంటలకు రసాయన ఎరువుల మోతాదు తగ్గించి, సేంద్రయ ఎరువుల వాడకం పెంచాలని, నేల సంరక్షణ దిశగా అడుగులు వేయాలని డైరెక్టర్ ఆఫ్ పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టర్ పద్మజ, రిటైర్డ్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టర్ చంద్రశేఖర్‌రావు, డీఏవో శ్రీధర్‌లు అన్నారు. మంగళవారం జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో భారత ఎరువుల సంఘం(ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఎరువుల వినియోగంపై రైతులు, డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాగులో సమగ్ర పోషణ, యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ఆధారంగా నేల స్వభావం తెలుసుకొని, ఎరువుల వినియోగించాలని చెప్పారు. ఫలితంగా నేల సంరక్షణతోపాటు పంటల ఖర్చు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు వాడే ఎరువుల్లో 30 నుంచి 35 శాతం మాత్రమే మొక్కలు తీసుకుంటాయని, మిగతావి వృథా అవుతాయని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీకె సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రావు, సుబ్బారెడ్డి, సేద్యపు విభాగ శాస్త్రవేత్త విజయ్, డిప్లామా(అగ్రికల్చర్) విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

స్లాటర్ హౌస్ ఓపెన్ టెండర్

కరీంనగర్ సిటీ: స్లాటర్ హౌస్ ఓపెన్ టెండర్ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో మేయర్ యాదగిరి సునీల్ అధ్యక్షతన నగరపాలక సంస్థ వధశాల ఓపెన్ టెండర్ మంగళవారం నిర్వహించారు. ఆరుగురు వ్యాపారులు పాల్గొనగా ఇబ్రహీం రూ.15.35 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం టెండర్ అగ్రిమెంట్ పత్రాలను మేయర్ ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఐలేందర్ యాదవ్, సరిల్ల ప్రసాద్, వాల రమణారావు, గందె మాధవి, కోల మాలతి, తుల రాజేశ్వరి, పిట్టల వినోద తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

15.5 కిలోల గంజాయి దహనం



గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌ క్రైం: కమిషనరేట్‌ వ్యాప్తంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని మంగళవారం కరీంనగర్‌ పోలీస్‌ కమిషనర్‌, జిల్లా మాదకపదార్థాల నియంత్రణ కమిటీ చైర్మన్‌ ఎల్‌.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు కమిషనరేట్‌ కేంద్రంలో దహనం చేశారు. వివిధ పోలీస్‌ స్టేషన్ల పరిధిలో పట్టుకున్న 15.5 కిలోల గంజాయిని కాల్చేశారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్‌, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్‌ రాజేశ్‌, సంబంధిత పోలీస్‌ స్టేషన్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

లాడ్జిలో వ్యాపారి ఆత్మహత్య

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌ ముకరంపురకు చెందిన సయ్యద్‌ ఫైజాజ్‌ అహ్మద్‌ (35) బస్టాండ్‌ సమీపంలోని ఓ లాడ్జిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వన్‌ టౌన్‌ పోలీసులు తెలిపారు. ఫైజాజ్‌ అహ్మద్‌ రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తూ ముకరంపురలో నివసిస్తున్నాడు. ఏడాది కిందట అతని భార్య అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతుండేవాడు. అతనికి ఇద్దరు పిల్లలు ఉండగా వారు అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. ఈ నెల 23న ఇంటి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నట్లు అతని సోదరుడికి చెప్పాడు. అప్పటి నుంచి కరీంనగర్‌లోని లాడ్జిలోనే ఉంటున్నాడు. ఈ రోజు సాయంత్రం లాడ్జి సిబ్బంది గదిలో చూసే సరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వార్డు సభ్యురాలు..

సుల్తానాబాద్‌రూరల్‌(పెద్దపల్లి): సుల్తానాబాద్‌ మండలంలోని కదంబాపూర్‌ గ్రామ వార్డు సభ్యురాలు బొంకూరి శైలజ(30) ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కూకట్ల కుమార్‌, అతని కుటుంబసభ్యులు విజయ్‌కుమార్‌, సంతోష్‌, రాకేశ్‌, స్వరూపలు శైలజను మానసికంగా ఇబ్బందులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం సాయంత్రం ఉరేసుకుంది. మృతురాలి తండ్రి బండ సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌ రాజీవ్‌ నగర్‌(ఒడ్డెర కాలనీ)కు చెందిన జటిపటి అనిత (32) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. బసంత్‌నగర్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిత మంగళవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడింది. తెల్లవారినా ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, స్థానికులు సమీప ప్రాంతంలో వెతకగా బావిలో కనిపించింది. ఒడ్డుకు చేర్చి, పరిశీలించగా అప్పటికే మృతిచెందినది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళలు రక్తహీనతను జయించాలి

- కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్‌ కర్ణన్‌

కరీంనగర్‌టౌన్‌: ఏకాగ్రతను దెబ్బతీస్తూ నీరసం, ఇతర అనారోగ్య సమస్యలకు కారణమయ్యే రక్తహీనతను ప్రతి మహిళా జయించాలని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ అన్నారు. కరీంనగర్‌లోని బుట్టి రాజారాం కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడికి వచ్చిన మహిళలతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి, కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే మహిళల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ప్రతీ మంగళవారం మహిళలకు 8 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతోపాటు మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాధి తీవ్రతను బట్టి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి పంపించి, మెరుగైన వైద్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. అందరూ రక్తహీనత పరీక్షలు నిర్వహించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ శ్రీలతారెడ్డి, పీడీ మెప్మా రవీందర్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ పరీక్షకు సిద్ధం కావాలి

కరీంనగర్‌ కల్చరల్‌: జిల్లా గ్రంథాలయంలో షెడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ఏప్రిల్‌ 14న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. వివిధ పోటీ పరీక్షల కోసం స్థానిక, ఇతర జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారధి మొబైల్‌ యాప్‌ను అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ఇందులో వివిధ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్‌ అందుబాటులో ఉందని తెలిపారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌ ద్వారా పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాన్ని కూడా వెనువెంటనే అందించేలా యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. ప్రైవేటు ఉద్యోగాలు సాధించేందుకూ ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. లైబ్రరీలో వైఫై సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తానని అన్నారు. అభ్యర్థులు ఏదో ఒక్క పరీక్షకు మాత్రమే కాకుండా ప్రతీ పరీక్షకు సిద్ధం కావాలని సూచించారు. వేసవి దృష్ట్యా లైబ్రరీలో మంచి నీరు, ఏసీ, కూలర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ పొన్నం అనిల్‌, సెక్రటరీ సరిత, సిబ్బంది తదితరులున్నారు.

ఆధార్‌ నవీకరణపై అవగాహన కల్పించండి

కరీంనగర్‌ అర్బన్‌: ఆధార్‌ నవీకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి మానిటరింగ్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ.. ఆధార్‌ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు డీపీవో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు కృషి చేయాలన్నారు. ఐదేళ్లు దాటిన పిల్లలకు బయోమెట్రిక్‌, ఇదివరకే ఆధార్‌ కార్డు పొందినవారు పదేళ్లకోసారి అప్‌డేట్‌ చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో జనాభా ప్రాతిపదికన 100 శాతం ఆధార్‌ నమోదు చేసేందుకు అవసరం మేర ఆధార్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ప్రజల నుంచి అధిక వసూళ్లకు పాల్పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌, ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ పోలీస్‌ చంద్రమోహన్‌, యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్‌ రాజ్‌కుమార్‌, ప్రాజెక్టు మేనేజర్‌ అపిల్‌, డిడబ్ల్యూవో బిత కుమారి, డీఈవో జనార్దన్‌రావు, ఎల్‌డీఎం ఆంజనేయులు, డీపీవో వీరబుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగని టీచకపర్వం!

- సిబ్బంది నుంచి లేఖల కోసం బలవంతం
- వీడియోలు విడుదలైనా.. కాపాడేందుకు నేతల ప్రయత్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌: జగిత్యాల జిల్లా రాయికల్‌ మండలం ఇటిక్యాల మోడల్‌ స్కూల్‌ మాజీ ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ సస్పెండ్‌ అయినా.. తాను ఉత్తముడిని అంటూ నిరూపించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌గా ఉన్న శ్రీనివాస్‌ మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోలు విడుదలయ్యాయి. తమను పదేపదే వేధిస్తున్న శ్రీనివాస్‌ బండారాన్ని లోకానికి తెలిపేందుకు తోటి ఉద్యోగులే రహస్యంగా వీడియోలు తీశారు. ఈ వీడియోలు 'సాక్షి'కి చేరడంతో వెంటనే కలెక్టర్‌ యాస్మిన్‌ బాషాకు చేరవేసింది. వీడియోలో శ్రీనివాస్‌ చర్యలు చూసి మండిపడ్డ కలెక్టర్‌ అతన్ని ఈనెల 16వ తేదీన సస్పెండ్‌ చేసిన విషయం విదితమే.

నేడు స్కూల్‌కు విచారణ కమిటీ..!

ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు బుధవారం విచారణ కమిటీ స్కూలుకు రానుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సస్పెండ్‌ అయిన శ్రీనివాస్‌ తాను ఉత్తముడని చెప్పుకునేందుకు ముందే ప్లాన్‌ వేశారు. మహిళా సిబ్బంది వద్దకు వెళ్లి.. శ్రీనివాస్‌ మంచోడు అంటూ స్వచ్ఛందంగా రాసి ఇచ్చినట్లుగా ముందే రాసిన లేఖలు వారికి ఇచ్చి వాటిపై సంతకాలు చేయించేందుకు యత్నించారు. ఈ ఘనకార్యానికి ఓ మహిళా ఉద్యోగి నేతృత్వం వహిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. పర్మినెంట్‌ ఉద్యోగులంతా ఆ లేఖలపై సంతకాలు చేయకుండా సున్నితంగా తిరస్కరించారు. అయినా.. పట్టువదలకుండా తాత్కాలిక సిబ్బందితో అవే లేఖలపై సంతకాలు చేయించుకున్నారని సమాచారం. ఈ లేఖలను బుధవారం స్కూల్‌కు విచారణకు వచ్చే కమిటీకి అందజేసేలా ప్లాన్‌ వేశారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. అదే సమయంలో విచారణ కమిటీతో నిందితుడు శ్రీనివాస్‌ కూడా రానున్నట్లు తెలిసి సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అతను ఎదురుగా ఉంటే విచారణ పారదర్శకంగా ఎలా జరుగుతుందన్న సందేహాలు లేవనెత్తుతున్నారు. మరో ఆసక్తికరమైన అంశమేంటంటే.. శ్రీనివాస్‌ ఉత్తముడు అంటూ లేఖలపై సంతకాలు పెట్టాల్సిందిగా ఓ సర్పంచ్‌, మాజీ ఎంపీటీసీ, మరో నలుగురైదుగురు చోటా లీడర్లు స్కూలు సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తుండటాన్ని వారంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో అత్తింటివారికి జైలు

కరీంనగర్‌ క్రైం: అదనపు వరకట్నం కోసం అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో ఆమె భర్త, అత్తామామ, ఆడబిడ్డ, ఆడబిడ్డ భర్తకు ఏడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి బి.ప్రతిమ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌ కథనం ప్రకారం.. తిమ్మాపూర్‌ మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన స్వరూప(33)కు కేశవపట్నం మండలంలోని కరీంపేటకు చెందిన బొజ్జ కుమార్‌తో 2015లో పెళ్లి జరిపించారు. వివాహం తర్వాత మూడేళ్లు కలహాలు లేకుండా కలిసున్నారు. ఈ దంపతులకు ఒక బాబు ఉన్నాడు. ఈ క్రమంలో భర్త కుమార్‌, అత్త ఐలమ్మ, మామ కొమురయ్య, ఆడబిడ్డ మెరుగు విజయ, ఆమె భర్త కుమారస్వామిలు స్వరూపను అదనపు వరకట్నం కోసం కొట్టి, తిట్టి, ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. దీంతో ఆమె నేదునూరులోని తన అన్న ఇంటి వద్ద బాబుతో కలిసి ఉంటోంది.

రూ.2 లక్షలిచ్చి, కాపురానికి పంపమన్నారు..

స్వరూప అన్న కవ్వంపల్లి రవి కుటుంబసభ్యులతో కరీంపేట వెళ్లి, చిన్న బాబును చూసైనా తన చెల్లెలితో కలిసి కాపురం చేయాలని, కుమార్‌తోపాటు అతని కుటుంబ సభ్యులను బతిమిలాడాడు. కానీ వారు అదనపు కట్నం రూ.2 లక్షలు ఇచ్చి, కాపురానికి పంపాలని తేల్చిచెప్పారు. అంత డబ్బు వారి వద్ద లేకపోవడంతో తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇదిలా ఉండగా కుమార్‌ తన భార్య సరూపకు ఫోన్‌ చేసి, కట్నం తీసుకొని రా లేకుంటే అక్కడే చచ్చిపో అని తరచూ వేధించేవాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె 2019 మార్చి 16న ఉదయం బాత్రూంలో ఒంటిపై కిరోసిన్‌ పోసుకొని, నిప్పంటించుకుంది. కాలిన గాయాలతో ఉన్న ఆమెను ఆసుపత్రికి తరలించగా మెజిస్ట్రేట్‌కు వాంగ్మూలం ఇచ్చి, చనిపోయింది. ఈ సంఘటనపై మృతురాలి అన్న రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌ఎండీ పోలీసులు కేసు నమోదు చేయగా అప్పటి ట్రైనీ ఏసీపీ ఉషారాణి దర్యాప్తు చేశారు. సీఎంఎస్‌ ఏఎస్‌ఐ తిరుపతి పర్యవేక్షణలో పీసీ శంకర్‌ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వి.వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి ప్రతిమ బొజ్జ కుమార్‌, ఐలమ్మ, కొమురయ్యలకు ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 17 వేల చొప్పున జరిమానా, మెరుగు విజయ, కుమారస్వామిలకు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

పత్తి మార్కెట్‌లో కొనుగోళ్లు భేష్‌

- జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఎంవో పద్మావతి
- జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌ సందర్శన



పత్తిని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో ప్రియాంక

జమ్మికుంట(హుజూరాబాద్‌): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు భేష్‌ అని, అధికారుల పనితీరు అభినందనీయమని జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఎంవో పద్మావతిలు అన్నారు. మంగళవారం పత్తి మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలను పరిశీలించారు. రైతులకు గిట్టుబాటు ధరలు, మార్కెట్‌కు వచ్చే ఆదాయం, వ్యయం, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జమ్మికుంట మండలంలో అయిల్‌పామ్‌ సాగు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై ఆరా తీశారు. జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయని, నూతనంగా సైదాపూర్‌లో మార్కెట్‌ యార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జమ్మికుంట మార్కెట్‌ పన్నుల ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరం అంచనా రూ.22.98 కోట్లు కాగా రూ.22.92 కోట్లకు చేరుకున్నామని చెప్పారు. అనంతరం ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన జెడ్పీ సీఈవోను మార్కెట్‌ కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్‌ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ లక్ష్మణ్‌, వ్యాపారులు, అడ్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్‌ పత్తి ధర రూ.7,350

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,350 పలికింది. రైతులు 104 వాహనాల్లో 1,651 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్‌ ధర రూ.7,300, కనిష్ఠ ధర రూ.6,800ను వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 19 మంది రైతులు 32 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,050, మోడల్‌ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.6,000 చెల్లించి, కొనుగోలు చేశారు. మార్కెట్‌ కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్‌ కొనుగోళ్లను పర్యవేక్షించారు.

నూతన పెన్షన్‌ విధానం రద్దు చేయాలి

- రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు
- జమ్మికుంటలో బహిరంగ సభ



మాట్లాడుతున్న శంకర్‌రావు

జమ్మికుంట(హుజూరాబాద్‌): రైల్వే కార్మికులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్‌ విధానం రద్దు చేసి, పాత పెన్షన్‌ విధానాన్ని కొనసాగించాలని సౌత్‌ సెంట్రల్‌ రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి సీహెచ్‌.శంకర్‌రావు డిమాండ్‌ చేశారు. మంగళవారం జమ్మికుంటలోని రైల్వే ప్రాంగణంలో సంఘం ఆధ్వర్యంలో సింహ గర్జన పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. సికింద్రాబాద్‌ డివిజన్‌ వ్యాప్తంగా ఆయా విభాగాలకు చెందిన కార్మికులు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేలో ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలన్నారు. ఖాళీలను వెంటనే భర్తీ చేసి, కార్మికులు, ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. యూనియన్‌ అధ్యక్షుడు కాలువ శ్రీనివాస్‌, సికింద్రాబాద్‌ డివిజన్‌ కార్యదర్శి పిల్లలమర్రి రవీందర్‌, జమ్మికుంట బ్రాంచి చైర్మన్‌ రాజయ్య, కారదర్శి శ్రీనివాస్‌, క్రాంతికుమార్‌, సాంబరాజు, మహేశ్‌, స్వప్న, జగన్‌, సౌత్‌ సెంట్రల్‌ జోన్‌ యూనియన్‌ నాయకులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల పనులు సకాలంలో పూర్తవ్వాలి

- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- కలెక్టర్‌ కర్ణన్‌కు అభినందన



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ కర్ణన్‌, అధికారులు

కరీంనగర్‌టౌన్‌: రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల నిర్మాణ పనులు సకాలంలో పూర్తవ్వాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రాష్ట్రంలో నిర్మిస్తున్న 9 వైద్య కళాశాలల పనుల పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, వైద్యారోగ్యశాఖ అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్‌ ఏజెన్సీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో టీఎస్‌ఎంఐడీసీ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మెడికల్‌ కాలేజీ ఏర్పాటుపై సీఎం కేసీఆర్‌ దృష్టి సారించారని చెప్పారు. ఈ సంవత్సరం కరీంనగర్‌, కామారెడ్డి, జనగామ, వికారాబాద్‌, ఖమ్మం, జయశంకర్‌ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల, కొమురంభీం ఆసిఫాబాద్‌, నిర్మల్‌ జిల్లాల్లో నూతన కళాశాల పనులు జరుగుతున్నాయని తెలిపారు. జూలై నుంచి మొదటి విడత అడ్మిషన్స్‌ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కాలేజీలను సిద్ధం చేసి, ఎన్‌ఎంసీ నుంచి అనుమతి పొందాలన్నారు. కరీంనగర్‌ జిల్లాలో ఆరోగ్య మహిళా కేంద్రాలకు అధిక సంఖ్యలో మహిళల రప్పిస్తూ మంచి ఫలితాలు సాధించిన కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ను మంత్రి అభినందించారు. కంటి వెలుగు కార్యక్రమంపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. వీసీలో కలెక్టర్‌ కర్ణన్‌, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్‌, జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్‌ జువేరియా, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రత్నమాల, టీఎస్‌ఎంఐడీసీ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం



రామస్వామి (ఫైల్‌)

ఇల్లందకుంట(హుజూరా బాద్‌): అనారోగ్యానికి గురైన ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది, ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసేడుకు చెందిన భోగం రామస్వామి(60)–రాజేశ్వరి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో ఇద్దరికి పెళ్లి వయసు వచ్చిన వివాహం కాకపోవడంతో రామస్వామి బెంగ పెట్టుకున్నాడు. దీనికితోడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగిన నయం కాలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

కరీంనగర్‌: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తీరని అన్యాయానికి గురవుతున్న బీసీలు రాజ్యాధికారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమితి జిల్లా కౌన్సిల్‌ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి, 75 ఏళ్లయినా సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీలు అన్ని రంగాల్లో వివక్షకు గురవడం సిగ్గుచేటన్నారు. దేశంలో బీసీ కులగణన జరగాలని డిమాండ్‌ చేశారు. బీసీ ఉద్యమాలు జరుగుతున్నా కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదించాలని కోరారు. బీసీ బంధు పథకం తీసుకువచ్చి, ప్రతీ బీసీ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. నాయకులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్‌, పైడిపల్లి రాజు, ఎస్‌.కొమురయ్య, జక్కుల ఆగయ్య, పున్నం శ్రీకాంత్‌, చిగుర్ల కొమురయ్య, ఎ.సాయికిరణ్‌, పల్లె యాదగిరి, జక్కుల రాములు, కె.వెంకటేశం, పి.సంపత్‌ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల హౌస్‌ అరెస్టుకు నిరసనగా ధర్నా



ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

చొప్పదండి: వైఎస్సార్‌ టీపీ అధినేత్రి వైఎస్‌ షర్మిల హౌస్‌ అరెస్టుకు నిరసనగా చొప్పదండి మండలంలోని ఆర్నకొండలో వైఎస్సార్‌ విగ్రహం ఎదుట ఆ పార్టీ జిల్లా నాయకుడు తడగొండ సత్యరాజ్‌వర్మ, పట్టణ శాఖ అధ్యక్షుడు గుర్రం మధుకర్‌ రెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యరాజ్‌వర్మ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించేందుకు వెళ్తున్న షర్మిలను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హౌస్‌ అరెస్టు చేయించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు పెట్టుకునే, ప్రజా సమస్యలపై పోరాడే హక్కు ఉందని బీఆర్‌ఎస్‌ నాయకులు గుర్తించడం లేదన్నారు. అక్రమ కేసులు బనాయించి, షర్మిలను నిలువరించాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. కార్యక్రమంలో రామడుగు మండల శాఖ అధ్యక్షుడు దాసరి రవిశాస్త్రి, నాయకులు పాల్గొన్నారు.

మంథనిలో రెండుచోట్ల చోరీ

మంథని: స్థానికంగా నెల రోజుల క్రితమే వరుస దొంగతనాలు జరిగి, భారీగా సొత్తు అపహరణకు గురైంది. ప్రజలు ఇప్పుడిప్పుడే ఆ ఘటనల నుంచి తేరుకుంటున్న క్రమంలో తాజాగా మంగళవారం తెల్లవారుజామున మంథని పట్టణంలోని వీధుల్లో రెండు చోట్ల దొంగతనం జరిగాయి. పూలే విగ్రహం ఏరియాలో చంద్రకాంత్‌ జువెల్లరీ షాపును ఇతర పనులు ఉండటంతో యాజమాని వెంకటస్వామి రెండు రోజులు తెరవలేదు. మంగళవారం తీసిచూడగా కౌంటర్‌ వద్ద సామగ్రి చిందరవందరగా పడి, వెనకవైపు తలుపు కట్‌ చేసి ఉంది. అనుమానం వచ్చి, దుకాణంలో పరిశీలించగా 36 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు కనిపించలేదు. సీసీ ఫుటేజీలో ముసుగు ధరించిన ఓ వ్యక్తి దొంగతనం చేస్తూ కనిపించాడు. అంతేకాకుండా నడివీధికి చెందిన గంగా జయప్రద 20 రోజుల క్రితం తన కూతురు ఇంటికి వెళ్లింది. మంగళవారం ఆమె ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు బాధితురాలికి సమాచారం ఇచ్చారు. ఆమె ఇంట్లోని 30 తులాల వెండి, మూడు తులాల బంగారు హారం చోరీకి గురయ్యాయని మంథని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘటన స్థలాలను ఆయనతోపాటు సీఐ సతీశ్‌ పరిశీలించారు. క్లూస్‌ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొగ్గు సకాలంలో రవాణా చేస్తేనే లాభాలు



గోదావరిఖని(రామగుండం): ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో రవాణా చేస్తేనే సింగరేణికి లాభాలు వస్తాయని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ అన్నారు. మంగళవారం జీడీకే–1, 3 గని వద్ద 45 టన్నుల బొగ్గు నిల్వ చేసే సామర్థ్యం గల కోల్‌ బంకర్‌ను ఆయన ప్రారంభించారు. గ్రేడ్‌ల ప్రకారం బొగ్గు నిల్వ చేసేందుకు ఈ బంకర్‌ను నిర్మించామన్నారు. ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, అధికారులు పొనగోటి శ్రీనివాస్‌, రామ్మోహన్‌, బానోతు సైదులు, రమేశ్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్‌ బోర్డుకు నాలుగేళ్ల వరకు అనుమతించండి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్‌ జనక్‌ప్రసాద్‌



సింగరేణి సీఎండీ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జనక్‌ప్రసాద్‌

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో అనారోగ్యంతో బాధపడుతూ మెడికల్‌ బోర్డుకు వెళ్లే కార్మికులకు ప్రస్తుతం ఉన్న రెండేళ్లను నాలుగేళ్ల సర్వీస్‌ వరకు అనుమతించాలని సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్‌.శ్రీధర్‌ను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్‌ జనక్‌ప్రసాద్‌ కోరారు. మంగళవారం సింగరేణి భవన్‌లో ఆయనను కలిసి, వినతి పత్రం అందజేశారు. నాలుగేళ్ల విధానం అమలైతే కార్మికులు మరోసారి మెడికల్‌ బోర్డుకు వెళ్లే అవకాశం లభిస్తుందన్నారు. బోర్డుకు వెళ్లే ప్రతి కార్మికున్ని మెడికల్‌ ఇన్‌వాలిడేషన్‌ చేయాలని కోరారు. ఫలితంగా దళారుల వ్యవస్థ రద్దవుతుందని పేర్కొన్నారు. కొన్ని రోజులుగా రామగుండం ప్రాంతంలో కలుషితమైన నీటి వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నాయని తెలిపారు. శాశ్వత ప్రతిపాదికన సురక్షితమైన మంచినీరు అందించాలని విన్నవించారు. సింగరేణిలోని డిపెండెంట్‌ ఉద్యోగుల వయో పరిమితి 35 నుంచి 40 ఏళ్లకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల మార్పు వెంటనే అమలు చేయాలన్నారు. గోదావరిఖనిలో బీగెస్ట్‌హౌస్‌ను ఐటీపార్కుకు కేటాయించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఉద్యోగుల సౌకర్యార్థం మరో గెస్ట్‌హౌస్‌ నిర్మించాలని పేర్కొన్నారు. సింగరేణి అనుబంధ సంస్థలు నెలకొల్పి, సంస్థ ప్రభావిత ప్రాంతాల వారి పిల్లలకు, ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. స్పందించిన సీఎండీ ఈ నెల 31న సింగరేణి బోర్డు మీటింగ్‌లో అనుమతి తీసుకొని, సమస్యలు పరిష్కరిస్తామన్నారని చెప్పారు.

ఉపాధిహామీ ఏపీవో, టీఏ సస్పెన్షన్‌

ఓదెల(పెద్దపల్లి): మండలంలో ఉపాధిహామీ పథకంలో పనిచేసే ఏపీవో కొమురయ్య, టెక్నికల్‌ అసిస్టెంట్‌ లీలలను సస్పెండ్‌ చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీవో, టెక్నికల్‌ అసిస్టెంట్‌లు అవినీతి అక్రమాలతోపాటు సామాజిక తనిఖీలో అవకతవకలకు పాల్పడటంతో విచారణ జరిపి, సస్పెన్షన్‌ వేటు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఉమారాణి

కరీంనగర్‌రూరల్: రక్తహీనత బారిన పడకుండా తల్లులు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో బి.ఉమారాణి అన్నారు. మంగళవారం కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో పోషణ్ పక్వాడాలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చిన్నారులకు అన్నప్రాసన, కిశోరబాలికలకు ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు ఆది మల్లమ్మ, మహేశ్వరీ, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్కిల్ ఎక్స్‌పో


ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థి

సప్తగిరికాలనీ(కరీంనగర్): భగత్‌నగర్‌లోని భగవతి ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కిల్ ఎక్స్‌పో–2023 పేరిట నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆహుతులను అలరించింది. విద్యార్థులు తమ నైపుణ్యాలను వెలికితీసి సైన్స్ ప్రాజెక్టులతో పాటు తెలుగు, హిందీ, గణితం, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని మేయర్ సునీల్‌రావు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని గొప్ప శాస్త్రజ్ఞులుగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ బి రమణారావు, కరస్పాండెంట్ విజయలక్ష్మీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ
ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



నగరంలోని జ్యోతిబాపూలే పార్క్ వద్ద ఏర్పాటు చేసిన బస్‌బే నుంచి బస్సులు బయటకు వెళ్లే మూలమలుపు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. బస్‌బే నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని బస్సు బయటకు వచ్చే క్రమంలో ఏ కొంచెం వైర్ బస్సుకు తగిలినా బస్సు మొత్తం షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ప్రమాదం జరుగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

చేతుల పరిశుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

కరీంనగర్‌రూరల్: పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చేతులు కడుక్కునే విధానంపై విద్యార్థులకు అంగన్‌వాడీ టీచర్ పద్మ ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వాహెద్, ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని గిద్దెపెరుమాండ్ల ఆలయం, కమాన్‌రోడ్డు రామేశ్వరాలయం, చైతన్యపురి మహాశక్తి ఆలయాల్లో గురువారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయా ఆలయ ఈవోలు, నిర్వాహకులు తెలిపారు. గిద్దెపెరుమాండ్ల ఆలయంలో ఉదయం 11.15 గంటలకు, రామేశ్వరాలయంలో ఉదయం 10గంటలకు, మహాశక్తి ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి శ్రీసీతారామ కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు సమయానికి విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మైనారిటీ కమిషన్ సభ్యుడికి సన్మానం


దర్శన్‌సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: కరీంనగర్‌కు వచ్చిన మైనారిటీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వారిలో వరంగల్ జిల్లా నుంచి దర్శన్‌సింగ్ ఉన్నారని అన్నారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

హుజూరాబాద్‌రూరల్: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు 30 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పి.అర్పిత ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట నుంచి ఆలయం వరకు రూ.20, హుజూరాబాద్ నుంచి ఆలయం వరకు రూ.50, పిల్లలకు రూ.30 చార్జీ ఉంటుందని, సమాచారం కోసం 73828 48449 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలు కార్గో ద్వారా రూ.116 చెల్లించి పొందవచ్చని వివరాలకు 95738 51108 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వ్యాసరచన పోటీలు

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ కేజీబీవీలో మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నీటి సంరక్షణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ.. భవిష్యత్తులో నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలందరూ వర్షపు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రతీ నీటిబొట్టును సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వలంటీర్ బూస రాజశేఖర్ పాల్గొన్నారు.

17 జీపీలు.. 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు

- ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెండు మూడు పంచాయతీల బాధ్యతలు
- కొత్త పంచాయతీల్లో మేట్లు దిక్కు
- కూలీలకు పనులు కల్పించడంలో తిప్పలు


కాలువలో పూడిక తీస్తున్న కూలీలు

కరీంనగర్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిర్వహణకు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు కరువయ్యారు. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ రెండు, మూడు గ్రామాలకు బాధ్యులుగా ఉండటంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. అంతేకాకుండా కొత్త గ్రామపంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో ప్రస్తుతం పాత పంచాయతీల్లోని వారే పనులు పర్యవేక్షిస్తున్నారు.

గాడితప్పుతున్న పనుల పర్యవేక్షణ

కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామపంచాయతీలుండగా ప్రస్తుతం 9 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లు మాత్రమే పనులు చేస్తున్నారు. బొమ్మకల్, బహదూర్‌ఖాన్‌పేట, దుర్శేడ్, నల్లగుంటపల్లి, ఫకీర్‌పేట గ్రామపంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. రెండేళ్లక్రితం ఆయా గ్రామాల్లోని కూలీలకు 10శాతం కంటే తక్కువ పనిదినాలను కల్పించారనే కారణంతో ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించింది. కొత్తగా ఏర్పాటైన దుబ్బపల్లి, మందులపల్లి, తాహెర్‌కొండాపూర్ గ్రామపంచాయతీలకు ఫీల్డ్‌అసిస్టెంట్లను నియమించలేదు. వాస్తవానికి ప్రతీ గ్రామపంచాయతీకి ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాల్సి ఉండగా నాలుగేళ్లు దాటినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుతం కొత్త గ్రామపంచాయతీలకు గతంలోని పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పనులను పర్యవేక్షణ చేయాల్సి రావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లపై పనిభారం పెరుగుతోంది. పనుల పర్యవేక్షణ గాడితప్పుతోంది. ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్లు లేని ఎనిమిది గ్రామపంచాయతీల్లో సీనియర్ మేట్లకు పనుల బాధ్యతలు అప్పగించారు. మేట్లు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో పనుల్లో పారదర్శకత లోపిస్తోంది.

ఉపాధిహామీ పథకం వివరాలు

గ్రామపంచాయతీలు	17
మొత్తం జాబ్‌కార్డులు	6,471
జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీలు	10,156
పనిచేసే కుటుంబాలు	3,222
పనిచేసే కూలీలు	3,830
కూలీలకు కల్పించిన పనిదినాలు	1,32,996
వందరోజులు పని పూర్తయిన కుటుంబాలు	67

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

కొత్త గ్రామపంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో ఆయా గ్రామపంచాయతీల్లో సీనియర్ మేట్ల ద్వారా పనుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ఫీల్డ్‌అసిస్టెంట్‌ను నియమించాలని ఆదేశిస్తే నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

ఉపాధి కల్పించడంలో విఫలం కావడంతో కూలీల సంఖ్య పెరగడం లేదు. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో మేట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీల మస్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, వేతనాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడుతుంది. అన్ని గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్‌అసిస్టెంట్లను నియమించి ఉపాధిహామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- మేయర్ సునీల్‌రావు


నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్‌సిటీ: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, ఆర్‌బీ, సోషల్‌వెల్ఫేర్, పంచాయతీరాజ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. డివిజన్ల వారీగా జరుగుతున్న సీఎం అస్యూరెన్స్, నగరపాలక సంస్థ నిధుల అభివృద్ధి పనుల పురోగతి వివరాలతోపాటు పెండింగ్, పూర్తయిన పనుల వివరాలను మూడు రోజుల్లో అందించాలని ఆదేశించారు. వివిధ గ్రాంట్ల కింద చేపట్టిన అభివృద్ధి పనులను కూడా వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈలు కిష్టయ్య, మహేందర్, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం పరిశీలన

నగరంలోని మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని మంగళవారం మేయర్ సునీల్‌రావు సందర్శించారు. ఎస్టీపీ ప్లాంట్‌లోని ఎంబీబీఆర్, మోటారుపంపులు, స్లడ్, సీవరేజ్ వాటర్ సంపులతో పాటు మురుగునీటి శుద్ధీకరణ ప్రక్రియను పరిశీలించారు. శుద్ధీకరణ ప్రక్రియలో తలెత్తే సమస్యలతో పాటు ఇతర సమస్యలను ఎస్టీపీ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 38 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధీకరణ కేంద్రంలో తలెత్తే సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని అన్నారు. ఎస్టీపీ ప్లాంట్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనిచేసేలా ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్టీపీ చుట్టూ రక్షణగా ప్రహరీ నిర్మాణం, ఆవరణలోకి డ్రయినేజీ నీరు చేరకుండా పలు అభివృద్ధి పనులు చేపట్టి వివిధ రకాల మొక్కలు, గ్రీనరీ ఏర్పాటు చేసి సుందరీకరిస్తామని అన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ కోల మాలతి సంపత్, ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ మహేందర్, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు, నల్లా, ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లించాలి

నగర ప్రజలు తమ ఆస్తి పన్నులతో పాటు నల్లా, ట్రేడ్ లైసెన్స్ పన్నులను సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని మేయర్ సునీల్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరం మార్చి 31కి ముగుస్తున్నందున కేవలం రెండు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందన్నారు. పన్నులు సకాలంలో చెల్లించకుంటే అపరాధ రుసుం పడుతుందని, తద్వారా మరింత వడ్డీ భారం పెరుగుతుందని తెలిపారు.

క్రీడల్లో రాణించేలా చొరవ తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్‌స్పోర్ట్స్: విద్యార్థులు క్రీడల్లో రాణించే విధంగా పీఈటీలు చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ కరీంనగర్, అరుణ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో జరుగుతున్న యోగా శిక్షణను మంగళవారం సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటలతో పాటు యోగా శిక్షణ ఇస్తే మానసికంగా, శారీరకంగా, ధృడంగా ఉంటారని అన్నారు. దీనివల్ల చదువులో సైతం మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. యోగా లాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు వచ్చే వారికి సహకారమందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్, రాపెల్లి శ్రీనివాస్, పెటా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ యూనిష్ పాష, ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, రామన్న, సమ్మయ్య, బిట్ర శ్రీనివాస్, హరికిషన్, రమేశ్, వీర్‌పాల్, చంద్రశేఖర్, యోగా శిక్షకులు యశ్వంత్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య

కొత్తపల్లి: చుక్క లక్ష్మీబాయి సైన్స్ అవార్డు కౌన్సిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సైన్స్ టాలెంట్ సర్చ్ పరీక్షలో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 2, 3, 7, 10 ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య తెలిపారు. గంప సహస్ర 2వ ర్యాంకు, మెహరీన్ 3వ ర్యాంకు, యాసిన్ 7వ ర్యాంకు, కె.శ్రీయాన్ష్ 10వ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చి విద్యార్థులను పాఠశాల చైర్మన్ ఇ.ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వినోద్ రావు, ప్రసాద్, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు లక్ష్మీదీప్తి, పాత్రో, హరిప్రియ, ఉపాధ్యాయులు సుష్మ, జలంధర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్


శుభ్రం చేస్తున్న వలంటీర్లు


చింతకుంటలో..

కరీంనగర్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో నిర్వహిస్తున్న శిబిరంలో భాగంగా మంగళవారం యువత, ఉపాధిపై సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం, స్త్రీ శక్తి భవనం పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్ర భారతి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీహరి, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్య పాల్గొన్నారు. మొగ్దుంపూర్‌లో నిర్వహిస్తున్న వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులతో కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.పలుచోట్ల ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో రమేశ్, అధ్యాపకులు సంపత్ కుమార్, సదానందం, సునీత పాల్గొన్నారు.

చింతకుంటలో..

కొత్తపల్లి: మండలంలోని చింతకుంటలో ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్–3 ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో భాగంగా మంగళవారం వలంటీర్లు స్వచ్ఛభారత్ చేపట్టారు. శ్రీరామనవమి పురస్కరించుకొని శాంతినగర్‌లోని ఆలయం వద్ద రోడ్లు శుభ్రపరిచి పిచ్చిమొక్కలు తొలగించి డంప్‌యార్డుకు తరలించారు. అనంతరం జాతీయ యువత ఉపాధి సర్వేను కొనసాగించారు. మధ్యాహ్నం జరిగిన మేధో మదన కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డీఈఓ, సామాజిక కార్యకర్త తాడూరి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి వి.వరప్రసాద్, హెచ్ఎం నారాయణస్వామి, వలంటీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీలత, ఏఎంసీ చైర్మన్ మధు

కొత్తపల్లి: పశువుల సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ అన్నారు. మంగళవారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం బావుపేటలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ మధు మాట్లాడుతూ వ్యవసాయం, వాటి అనుబంధ పరిశ్రమలు, రైతులు, పశువుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మార్కెట్ పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు పశువులకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మండల పశువైద్యాధికారి రామకృష్ణ, పశువైద్య సిబ్బంది పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, డైరెక్టర్లు బోనాల జనార్దన్, గంగాధర, లక్ష్మయ్య, లచ్చిరెడ్డి, ఎంపీటీసీలు కమలమనోహర్, తిరుపతినాయక్, మండల కోఆప్షన్ సభ్యులు షరీఫ్, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు పెరుక శ్రీనివాస్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

చిత్ర కథ
ప్రమాదకర గుంతలను పూడ్చండి



కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో టీఎస్ ఫైబర్ ఇంటర్నెట్ కోసం తవ్విన గుంతలను పూడ్చివేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఇరుకుల్ల నుంచి చెర్లభూత్కూర్ రహదారిలో ఇంటర్నెట్ పైపులైన్ కనెక్షన్ కోసం కొన్ని ప్రాంతాల్లో గుంతలు తవ్వి విడిచిపెట్టారు. గుంతలను పూడ్చివేసి ఛాంబర్లు వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ జాప్యం చేస్తుండటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వాహనదారుడు ఇరుకుల్ల శివారు రోడ్డు మూలమలుపులోని గుంతలో పడి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే గుంతలు పూడ్చివేసేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – కరీంనగర్‌రూరల్

మత్స్యపారిశ్రామిక సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గసభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బొజ్జ ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలిగా బొజ్జ ఎల్లమ్మ, కార్యదర్శిగా మ్యాకల ధర్మరాజు, డైరెక్టర్లుగా పోలు నర్సింగం, బొజ్జ రవీందర్, బొజ్జ కనకరాజు, హన్మమ్మ, మ్యాకల వెంకటేశం, ఆంజనేయులు ఎన్నికయ్యారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

హుజూరాబాద్‌రూరల్: పోషకాహారంతో రక్తహీనత దూరమవుతుందని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కన్యాకపరమేశ్వరి ఆలయ మండపంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషక లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం సామూహిక సీమంతంలో పాల్గొన్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోకంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. గ్రామంలో ధోబీ ఘాట్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. వెంట మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, ఆర్డీవో హరిసింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, తహసీల్దార్ కోమల్‌రెడ్డి, సీడీపీవో భాగ్యలక్ష్మి, కమిషనర్ సమ్మయ్య తదితరులు ఉన్నారు.

ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

విద్యానగర్(కరీంనగర్): ప్రతినెలా 30వ తేదీన పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిర్వహించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జీవోను పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ కమిటీ సభ్యులు ఎలుక ఆంజనేయులు, మేడి మహేశ్, మాలమహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకటేష్, జిల్లా కన్వీనర్ కాడే శంకర్, కో కన్వీనర్ దామెర సత్యం ఉన్నారు.

క్లుప్తంగా...

భైంసాలో శోభాయాత్రకు ఓకే

షరతులు పాటించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నిర్మల్ జిల్లా భైంసా పట్టణం, తానూర్‌లో ఈ నెల 30న నిర్వహించే శ్రీ రామ నవమి శోభాయాత్రకు రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు యాత్రకు అనుమతి ఇచ్చింది. మతపరంగా, రాజకీయంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని, రాజకీయ నాయకులు, నేర చరిత్ర ఉన్నవారు యాత్రలో పాల్గొనరాదని స్పష్టం చేసింది. మసీదులు ఉన్న చోట యాత్ర సాగేటప్పుడు 150 మీటర్లకు ముందే సౌండ్ సిస్టం ఆపేయాలని సూచించింది. భైంసాలో శ్రీరామనవమి శోభాయాత్రకు అనుమతి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ హిందూ వాహిని అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తానూర్‌లో శోభాయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన ఎ.నరేందర్, ఆర్.గంగాప్రసాద్ మరో పిటిషన్ వేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సూర్యకరణ్ రెడ్డి, ప్రభుత్వం తరఫున న్యాయవాది సామల రవీందర్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రాణం తీసిన పొగ

చెత్త తగలబెడుతుండగా ఊపిరాడక రైతు మృతి


మృతుడు బాబు (ఫైల్)

బూర్గంపాడు: జామాయిల్ తోటలో పోగైన చెత్తను తగలబెడుతుండగా పొగతో ఊపిరాడక ఒక రైతు మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలివి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన రైతు కలసాని బాబు (65) సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. అప్పటికే నరికిన జామాయిల్ తోటలోని చెత్త తగులబెడుతున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు, పొగ వ్యాపించాయి. దీంతో బాబు పొగ ధాటికి తట్టుకోలేక ఊపిరాడక కుప్పకూలాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు జామాయిల్ తోటకు వెళ్లగా బాబు మృతదేహం కనిపించింది. ఆయన ఒంటిపై ఎలాంటి కాలిన గాయాలు లేకపోవడంతో.. పొగ, మంటల తీవ్రతకు ఊపిరాడక అస్వస్థతకు గురై మృతి చెందాడని భావిస్తున్నారు. మృతునికి భార్య నాగమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రామోజీ, శైలజకు సీఐడీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసుల్లో పేర్కొంది. చిట్‌ఫండ్ చట్టం నిబంధనలను ఉల్లంఘించి నిధులు మళ్లించడంపై ఏ-1గా రామోజీరావు, ఏ-2గా శైలజతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లపై సీఐడీ అధికారులు ఇప్పటికే కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ అధికారులు విస్తృతంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలో పెట్టుబడులుగా పెట్టడం, ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరిస్తున్నట్లు ఆధారాలతో సహా వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఐపీసీ సెక్షన్లు 420, 409, 120 బి, 477 రెడ్‌విత్ 34, కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982, ఆర్థిక సంస్థల రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో సీఐడీ అధికారులు నలుగురు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లను అరెస్టు చేశారు.

● అదో ఆర్థిక నేర సామ్రాజ్యం...

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును చట్ట విరుద్ధంగా మళ్లించడం ద్వారా రామోజీరావు యథేచ్ఛగా ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. కేంద్ర ప్రభుత్వ చిట్‌ఫండ్స్ చట్టం-1982, రిజర్వ్‌బ్యాంకు చట్టం, ఏపీ ఆర్థిక సంస్థల డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టాలను ఉల్లంఘించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ బ్రాంచి కార్యాలయాల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో డిసెంబర్‌లో నిర్వహించిన సోదాలతో ఈ అక్రమాల బాగోతం బట్టబయలైంది. సొమ్ములు రాష్ట్రంలోని చందాదారులవి కాగా ఆర్థిక ప్రయోజనాలు మాత్రం పొరుగు రాష్ట్రంలో మకాం వేసిన రామోజీరావువని వెల్లడైంది. రాష్ట్ర చందాదారుల కష్టార్జితానికి రక్షణ లేదని గుర్తించిన స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ దీనిపై సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ నిర్వహించిన సోదాల్లో మరిన్ని అక్రమాలు బయటపడ్డాయి. మరోవైపు స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా ఓ చార్టెడ్ అకౌంటెంట్‌ను ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక నివేదికలను పరిశీలించగా పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఎంతోమంది చందాదారులు తాము మోసపోయినట్లు సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో ఈ అంశంపై దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు సీఐడీ నివేదించింది.

మార్గదర్శిలో గుర్తించిన అక్రమాలు ఇవీ..

అక్రమ డిపాజిట్లు..

రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ డిపాజిట్లను సేకరిస్తోంది. చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 శాతం నుంచి 5 శాతం వరకు చందాదారుడికి వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తున్నట్టే. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడాన్ని చట్టం నిషేధించింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరించింది. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రూ.15 వేల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించిన చరిత్ర రామోజీరావుది. అదే తరహాలో ప్రస్తుతం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో అక్రమ డిపాజిట్లు సేకరిస్తున్నారు.

నిధుల మళ్లింపు.. అక్రమ పెట్టుబడులు

చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా రామోజీరావు చందాదారుల సొమ్మును అక్రమ పెట్టుబడులకు మళ్లించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టింది. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్-బెంగళూరు, ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్- హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపిస్తూ నిధులను అక్రమంగా మళ్లించారు. ఆ మూడు అనుబంధ కంపెనీల్లో రూ.1,05,80,000 పెట్టుబడి పెట్టినట్టు బ్యాలెన్స్ షీట్‌లో చూపించారు. అయితే ఆ కంపెనీల షేర్ హోల్డర్స్ జాబితా పరిశీలించగా ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాతో రూ.2 కోట్లు పెయిడ్ అప్ క్యాపిటల్‌గా పెట్టుబడి పెట్టినట్లు నిర్ధారణ అయ్యింది. బ్యాలన్స్ షీట్‌లో నోట్ నంబర్ 7 కింద రూ.459.98 కోట్లు చూపించారు. అయితే ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్టు పరిశీలనలో వెల్లడైంది. అందుబాటులో ఉన్న కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడుసార్లు రూ.29 కోట్లు, రూ.10 కోట్లు, రూ.8 కోట్లు చొప్పున, ఎడెల్‌వైజ్ ఆర్బిట్రేడ్ ఫండ్స్‌లో రూ.10 కోట్లు చొప్పున నిబంధనలకు విరుద్ధంగా పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడైంది. పూర్తి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే ఇంకా ఎన్ని పెట్టుబడులు పెట్టారో తెలుస్తుంది.

పోంజీ తరహా మోసం..

రామోజీరావు పోంజీ (గొలుసుకట్టు) తరహా మోసాలకు పాల్పడుతున్నారు. మార్గదర్శి సంస్థ చిట్టీలలో 30 శాతం నుంచి 40 శాతం టికెట్లు (సభ్యత్వాలు) యజమాన్యం పేరిట ఉంచుతోంది. ఆ టికెట్లకు చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. ఇతర చందాదారులు చెల్లించిన చందాలను తాము చెల్లించినట్లు రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. చందాదారుల సొమ్మును వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటోంది.

చందాదారుల హక్కులకు విఘాతం

రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తాలను నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ మేనేజర్లకు (ఫోర్‌మెన్) చట్టప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలు లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజతోపాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. రాష్ట్రంలో చందాదారులు చెల్లించిన మొత్తానికి బాధ్యులెవరని ప్రశ్నిస్తే సమాధానమే లేదు.

ఏప్రిల్ 1 నుంచి దివ్యదర్శనం పునఃప్రారంభం

అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో రోజుకి 15,000 టోకెన్ల జారీ

తిరుమల: కరోనా కారణంగా మూడేళ్ల కిందట రద్దు చేసిన దివ్య దర్శనాన్ని ఏప్రిల్ 1 నుంచి ప్రయోగాత్మకంగా టీటీడీ పునరుద్ధరించనుంది. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో నిత్యం 15,000 టోకెన్లను భక్తులకు జారీ చేయనుంది. 15,000 మంది కంటే ఎక్కువ మంది నడకమార్గంలో తిరుమలకు వస్తే, పరిస్థితిని సమీక్షించి ఏప్రిల్ 15న జరిగే పాలకమండలి సమావేశంలో టోకెన్ల పెంపుపై నిర్ణయం తీసుకోనుంది. కరోనా పరిస్థితుల అనంతరం శ్రీవారి దర్శనంపై ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించిన నేపథ్యంలో కాలినడకన వచ్చే వారికి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని భక్తుల నుంచి టీటీడీకి విజ్ఞాపనలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్న టీటీడీ తిరిగి దివ్యదర్శనం టోకెన్లను జారీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే నిత్యం 20,000 నుంచి 30,000 సర్వదర్శనం టోకెన్లను భక్తులకు టీటీడీ జారీ చేస్తుండటంతో సర్వదర్శనం టోకెన్ల కోటాను కొంత మేర తగ్గించి నిత్యం అలిపిరి కాలిబాట మార్గంలో 10,000, శ్రీవారి మెట్టు మార్గంలో 5,000 దివ్యదర్శనం టోకెన్లను జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ప్రతిపక్షపాత్ర పోషిస్తున్న బీజేపీ
- పార్లమెంట్‌ను స్తంభింపచేయడం దారుణం
- తెలంగాణ, కేరళలో గవర్నర్లు చట్టాలను తమ కుర్చీలో వేసుకుని కూర్చున్నారు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


భువనగిరిలో అమరవీరుల జ్యోతిని బీవీ రాఘవులుకు అందజేస్తున్న సీపీఎం నాయకులు, చిత్రంలో పార్టీ నాయకులు వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి ఉన్నారు

సాక్షి,యాదాద్రి: పార్లమెంట్‌ను ప్రతిపక్ష పార్టీలు స్తంభింపజేస్తాయి కానీ, అధికారంలో ఉన్న బీజేపీ అదానీ కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తున్నదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. అదానీ స్టాక్ కుంభకోణంపై జేపీసీ వేయాలని ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ బీజేపీ పార్లమెంట్‌లో ఆందోళన చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీరు ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయాన్ని రాఘవులు ప్రారంభించారు. ఆ తర్వాత జనచైతన్య యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలో విపక్షాలు ఏకమై బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుందని లేకుంటే ప్రమాదంలో పడుతుందన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని సీపీఎం ఖండించడంలో ప్రజాస్వామ్యానికి జీవం పోయాలనే ఉద్దేశమే తప్ప కాంగ్రెస్ ప్రత్యేక ప్రేమ ఏమీలేదని స్పష్టం చేశారు. దేశ రక్షణ, ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తి, సామాజిక న్యాయం కోసం బీజేపీయేతర పార్టీలన్నీ కలిసి రావాలని రాఘవులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి అన్యాయం జరిగితే ప్రతిపక్షాలు ఐక్యం కావాలంటారని, ప్రతిపక్షాలకు అన్యాయం జరిగినప్పుడు మాత్రం కాంగ్రెస్‌కు ఐక్యత గుర్తుకురాదని చురకలంటించారు. తెలంగాణ, కేరళలో గవర్నర్‌లు రాష్ట్ర ప్రభుత్వ చట్టాలను తమ కుర్చీలో వేసుకుని కూర్చున్నారని ఆయన విమర్శించారు.

ముగ్గురిని బలిగొన్న రోడ్డు ప్రమాదం

- జేసీబీని తెస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. భీమ్‌గల్ వద్ద ఘటన
- కారుపై పడ్డ జేసీబీ.. ముగ్గురు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో భార్యాభర్తలు, సోదరి.. మరో నలుగురికి గాయాలు


108 వాహనంలో క్షతగాత్రుల తరలింపు

భీమ్‌గల్: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణ శివారులో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన వడ్ల రాజేశ్వర్, ఆయన చెల్లెలు గోవింద్ పేట్‌కు చెందిన రమ కుటుంబ సభ్యులు ఏడుగురు భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్గల్ ఎల్లమ్మ ఆలయానికి దైవ దర్శనం కోసం వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారులో వెళ్తుండగా భీమ్‌గల్ సబ్‌స్టేషన్ వద్ద జేసీబీని ట్రాలీపై తెస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్‌తో పాటు ట్రాలీపై ఉన్న జేసీబీ కారుపై పడింది. కారులో ఉన్న వడ్ల రాజేశ్వర్, ఆయన భార్య జ్యోతి, చెల్లి రమ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు గంట పాటు శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలతో పాటు క్షతగాత్రులను బయటకు తీసేందుకు మూడు జేసీబీలను తెప్పించారు. జేసీబీల సహాయంతో కారులో ఇరుక్కున్న ఇద్దరు చిన్నారులతో పాటు మరో ఇద్దరిని 108లో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు రమ భర్త రాజేశ్వర్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు

వాతావరణ మార్పు ప్రమాదకరం


సదస్సు ప్రారంభిస్తున్న వ్యవసాయ వర్సిటీ ఉన్నతాధికారి సుధారాణి


హాజరైన శాస్త్రవేత్తలు, రైతులు

- వ్యవసాయ శాస్త్రవేత్తల అభిప్రాయాలు
- ప్రారంభమైన ఉత్తర తెలంగాణ జోన్ సదస్సు

జగిత్యాలఅగ్రికల్చర్: అత్యధిక వర్షాలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, చలితీవ్రత వంటి వాతావరణ మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, దీంతో రైతులు సాగు చేసిన పంటల్లో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని ఉత్తర తెలంగాణ జోనల్‌స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తల సదస్సు అభిప్రాయపడింది. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండు రోజులపాటు నిర్వహించే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతుల సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ సుధారాణి అధ్యక్షత వహించారు. వ్యవసాయ వర్సిటీ ఉన్నతాధికారులతోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సాగులో సమస్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు..

- ఉత్తర తెలంగాణలోని పది జిల్లాల్లో ఈఏడాది సాధారణంకన్నా 64శాతం అధిక వర్షపాతం నమోదైంది.
- దీంతో వరి, సోయాబిన్, పత్తి, కంది వంటి పంటలకు విఘాతం ఏర్పడింది.
- వరిలో పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరిగి, పంటలపై ఉల్లికోడు, కాండం తొలిచే పురుగు, ఆకుచుట్టు పురుగు, తాటాకు తెగులు ఆశించాయి.
- మొక్కజొన్న నీట మునిగి ఎదుగల లోపించి దిగుబడి తగ్గింది.
- పత్తి తొలిదశలో మొక్క పెరుగుదల లోపించి, దిగుబడిపై ప్రభావం చూపింది.
- యాసంగి వరిలో పొడి వాతావరణం, రాత్రి తక్కువ ఉష్ణోగ్రతలతో కాండం తొలిచే పురుగు ఉధృతి పెరిగింది.
- జనవరిలో రాత్రి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదై, చలి పెరగడంతో వరి నారుమడులతోపాటు నువ్వులు, వేరుశెనగ, మినుము, నేరుగా విత్తిన వరిపై ప్రభావం చూపింది.
- అయినా విపత్కర పరిస్థితుల్లోనూ వివిధ వరి రకాలు మంచి దిగుబడులు ఇచ్చాయి.
- ఇందులో జేజీఎల్ -28545, జేజీఎల్-27356, జేజీఎల్-33124, జేజీఎల్-33124, జేజీఎల్ -28639, జేజీఎల్-35085, కేఎస్ఎం-7715, జేజీఎల్-33124, కేఎస్ఎం-6965, కేఎస్ఎం-7037, కేఎస్ఎం-7715, ఆర్‌డీఆర్-1200, ఆర్‌డీఆర్-1162 రకం వరి పంట తెగుళ్ల, పురుగులను తట్టుకుని నిలిచాయయి.
- అలాగే, నువ్వుల్లో జేసీఎస్ -3202, జేసీఎస్-1020, జేసీఎస్-3287 వంటి రకాలు ఆటుపోట్లను తట్టుకుని మంచి దిగుబడిని ఇచ్చాయి.

అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు ఏవీ?

ప్రైవేట్ ధీటుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు రావడం లేదని రైతులు ఆరోపించారు. ఏ పంటలోనైనా కార్పొరేట్ కంపెనీలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో కంపెనీ చెప్పిన ధర చెల్లించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. రసాయన మందులను స్ప్రేయర్‌తో పిచికారీ చేసే పరిస్థితి పోయిందని, సబ్సిడీపై డ్రోన్లను సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. నాబార్డు రుణాలు నేరుగా రైతులకు ఇవ్వాలని, వినూత్న ప్రాజెక్టులకు రుణ సదుపాయం అందించాలని కోరారు. భూసార పరీక్షలు చేయించడంలో నిర్లక్ష్యంతో రసాయన ఎరువుల కోసం రూ.వేలు వెచ్చించాల్సి వస్తోందని అన్నారు. శాస్త్రవేత్తలు ఫొటో ప్రజంటేషన్ ద్వారా సమస్యలకు పరిష్కారం చెప్పే బదులు, కరపత్రాలు ఇవ్వాలని రైతులు కోరారు.

డ్రోన్ టెక్నాలజీపై పరిశోధనలు



రసాయన మందులు పిచికారీ చేసే డ్రోన్ టెక్నాలజీపై ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం క్రిషి విజ్ఞాన కేంద్రాల్లో రెండేసి డ్రోన్‌లు ఇచ్చాం. పరిశోధన స్థానాలతోపాటు పొలాల్లోనూ రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు. భవిష్యత్‌లో రోబో టెక్నాలజీ అందుబాటులోకి వస్తుంది.

– వి.సుధారాణి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్

రాత్రి ఉష్ణోగ్రతలు ప్రమాదకరం



రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడం పంటలకు ప్రమాదకరం. రెండు, మూడేళ్లుగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం వస్తోంది. ఈఏడాది ఒక్క జూలైలోనే 38 శాతం వర్షం కురిసింది. పొలాల్లో నీరు నిలిచి, వేరు వ్యవస్థ దెబ్బతింది. వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో 30 శాతం దిగుబడి తగ్గింది.

– శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

పంటల సరళి మార్చాలి



పంటల సరళిని మార్చకపోతే నేల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఒకే పంటను ఒకేనేలలో పదేపదే వేయడంతో నేల గుల్లబారకుండా గట్టిగా, ముద్దగా తయారవుతుంది. తద్వారా పంటలకు అవసరమైన పోషకాలు, ఎరువులు, నీటిని నేల తీసుకోదు. మొక్క ఎదగదు. వరి తర్వాత వరి లేదంటే మొక్కజొన్న వేయడం కూడా మంచిది కాదు.

– ఎ.మాధవి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్

మూసధోరణి వీడాలి



శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనల్లో మూస ధోరణి వీడాలి. ప్రైవేట్‌కు ధీటుగా పరిశోధన స్థానాల నుంచి అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు రావాలి. పంట పొలాల కంటే శాస్త్రవేత్తలు సాగుచేసిన పొలాలు బాగున్నాయని, కొత్త పంటలు ఉన్నాయని రైతులు పరిశోధన స్థానం సందర్శనకు వచ్చేలా చేయాలి.

– వెల్మల రాంరెడ్డి, రైతు, పూడూరు

బలగం.. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే రమేష్ ఎలిగేటి

- మందమర్రి సింగరేణి బిడ్డ
- పలు సినిమాలకు కో డైరెక్టర్


తల్లి భూదేవితో రమేష్

మందమర్రిరూరల్: బలగం సినిమా మానవ సంబంధాలను వెండితెరపై ఆవిష్కరించింది. ప్రతీ గడపలోనూ వారి బలగాన్ని గుర్తుకు తెచ్చుకునేలా చేసింది. మాట పట్టింపులతో మనుషులు దూరమై.. మనిషి దూరమయ్యాక దగ్గరయ్యే సమయంలో గుండెను తడి చేసింది. విశేష ఆదరణ పొందిన సినిమాకు కథ, మాటలు, స్క్రీన్‌ప్లేలో మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన రమేష్ ఎలిగేటి కీలక భూమిక పోషించాడు. ఈశ్వరయ్య, భూదేవి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పట్టణంలోని దీపక్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సింగరేణిలో ఉద్యోగం చేసే ఈశ్వరయ్య చనిపోగా.. ఆయన స్థానంలో భూదేవి ఏరియాలోని సివిల్ డిపార్టుమెంటులో పని చేసి విరమణ పొందింది. రమేష్ పదో తరగతి వరకు స్థానిక మాంటిస్సోరీ హైస్కూల్‌లో 2000లో పూర్తి చేశాడు. బీఈ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి మూడేళ్లు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేశాడు.

సినిమా కథలపై మక్కువతో..

చిన్నతనం నుంచే రమేష్‌కు సినిమా కథలపై మక్కువ ఎక్కువగా ఉండేది. హృదయాలను హత్తుకునే కథలపై దృష్టి సారించేవాడు. సినిమా కథలు ఎందుకు రాయకూడదు, సినిమాలకు దర్శకత్వం ఎందుకు చేయకూడదనే ఆలోచనతో దర్శకులు ఇంద్రగంటి మోహనకృష్ణ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాడు. గోల్కొండ హైస్కూల్, ఉయ్యాల జంపాల, పిట్టగోడ, నరుడా ఓ నరుడా సినిమాలకు పని చేశాడు. సినిమాలు చేస్తూనే నాగరాజు మడూరితో కలిసి బలగం సినిమా కథ విస్తరణ, స్క్రీన్‌ప్లేలో పాలుపంచుకున్నాడు. వేణు యెల్దండి, నాగరాజు మడూరితో కలిసి మాటలూ రాశాడు.

దర్శకత్వం వహించాలని ఉంది..

బలగం సినిమా అనుకున్న దానికంటే ఎక్కువగా పాపులర్ అయ్యింది. సినిమా రిలీజైన రెండు మూడు రోజులు ప్రేక్షకుల్లో మామూలు టాక్ వచ్చింది. నాలుగైదు రోజుల తర్వాత నుంచి ఊహించని విధంగా టాక్ రావడంతో పట్టలేని సంతోషం కలిగింది. బలగం స్టోరీ సిద్ధమయ్యాక సినిమా తీయడానికి ఇద్దరు దర్శకుల వద్దకు వెళ్లగా వారికి నచ్చలేదు. చివరిగా నిర్మాత దిల్ రాజు వద్దకు వెళ్లి స్టోరీ చెప్పడంతో అంగీకరించి సినిమా తీశారు. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే విధంగా మరికొన్ని కథలు రెడీ చేసుకున్నాను. స్వీయ దర్శకత్వం చేయాలని అనుకుంటున్నాను.

– రమేష్

చాలీసా పారాయణం


పారాయణం నిర్వహిస్తున్న పండితులు

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం అఖండ హనుమాన్ చాలీసా పారాయణం కనుల పండువగా సాగింది. హనుమాన్ దీక్ష ఉపాసకులు బోగ శ్రీనివాస్, పండితులు చక్రపాణి వాసుదేవాచార్యులు, యజ్ఞాచార్యులు నరసింహమూర్తి, అర్చకులు కోటపల్లి అనీష్, నితీష్‌ల బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలతో పాటు భజన చేశారు. ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌తో పాటు పెంబి జెడ్పీటీసీ జానుబాయి, గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు బాదావత్ పూర్ణచందర్ నాయక్ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌నాయక్ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమ నిర్వహణకు రూ.20వేలు విరాళంగా అందజేశారు. అనంతరం త్రిదండి రామానుజ దేవనాథ జీయర్ స్వామి హాజరై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

అడెల్లి ఆలయ హుండీ ఆదాయం రూ.37.97 లక్షలు


అడెల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

సారంగపూర్: నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ అమ్మవారికి భక్తులు నగదు, కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. భక్తులు అమ్మవారికి నగదు రూపేణా సమర్పించిన ఆదాయం రూ.37,97,545, మిశ్రమ బంగారం 290 గ్రాములు, మిశ్రమ వెండి 6 కిలోలుగా సమకూరింది. నాలుగు నెలల క్రితం కంటే ఈసారి హుండీ ఆదాయం రూ.10 లక్షలు పెరుగగా మిశ్రమ బంగారం 75 గ్రాములు, వెండి రెండు కిలోలు అదనంగా సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రవికిషన్ వివరించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, బుచ్చన్న, ఆలయ ధర్మకర్తలు, స్థానిక ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, కౌట్ల(బి), ఆలూరు, అడెల్లి, ధని, గోపాల్‌పేట్ గ్రామాలకు చెందిన దాదాపు వందమంది మహిళలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాసర ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

భైంసా: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. ఆలయ ఈవో విజయరామారావు ఆధ్వర్యంలో సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. 28 రోజుల హుండీ ఆదాయం లెక్కించగా, రూ.29,44,395 నగదు, 102 గ్రాముల మిశ్రమ బంగారం, 1.06 కిలోల మిశ్రమ వెండి, 4 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని అధికారులు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు సిబ్బంది, బాసర ఎస్సై, వాగ్దేవి సొసైటీ సభ్యులు, శివరామకృష్ణ భజన మండలి సేవాసమితి సభ్యులు, బాసర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.


కొడుకు ఫోటోను చూపెడుతున్న తల్లి నాగమణి

● అమ్మ ప్రేమకు సజీవ సాక్ష్యం

బిడ్డల భవిష్యత్తు కోసం కలలు కంటూ
వాళ్ల కోసం ఎన్నో త్యాగాలు చేస్తుంది అమ్మ.
రెక్కలొచ్చి పిల్లలు ఎగిరెళ్లినా వారి జ్ఞాపకాలు మాత్రం
ఆమె మెడ చుట్టూ చిట్టి చేతుల్లా అల్లుకుపోతూనే ఉంటాయి.
తెలంగాణలోని కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన
కంది నాగమణి పాతికేళ్ల క్రితం దేశసేవలో కానరాని దూరాలకు
వెళ్లిన కొడుకును మళ్లీ కళ్లారా చూడాలనుకుంది.
కొడుకు గొప్పతనాన్ని ఆ ఊరి ప్రజల ముందుకు తేవాలనుకుంది
తనలాంటి కొడుకు వీధికొక్కరు పుట్టాలని నడివీధిలో విగ్రహాన్ని నిలబెట్టింది.

నిలువెత్తు జ్ఞాపకం

కంది నాగమణి, శంకరయ్య దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. సాగునీటి వసతులు లేక వర్షాధారంపై ఆధారపడి సేద్యం చేస్తుండే వాళ్లు. నాగమణి ఇల్లు, వ్యవసాయపనులే కాదు బీడీలు చుట్టే పని కూడా చేస్తుండేది. పెద్ద కొడుకు సిద్దరాములు ఏడో తరగతి వరకు చిట్యాలలో చదువుకున్నాడు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు తాడ్వాయి మండల కేంద్రానికి వెళ్లి చదువుకున్నాడు. 1990 లో సీఆర్‌పీఎఫ్ జవానుగా సెలెక్టయ్యాడు. అప్పట్లో వాళ్ల గ్రామంలో నక్సల్స్ ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. పోలీస్ డిపార్టుమెంటులో చేరుతానని ముందుకెళ్లాడు. వద్దని వారించినా వెనకడుగువేయలేదు. ఇంకో అడుగు ముందుకేసి దేశం కోసం సేవ చేస్తానంటూ వెళ్లాడు. అప్పటికే ఆయనకు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

గుండెలో పేలిన బాంబు

1997 డిసెంబర్ 14న అస్సాంలోని కొక్రా జిల్లాలో బోడో తీవ్రవాదులు పేల్చిన మందుపాతరలో పది మంది వరకు జవాన్లు చనిపోయారు. అందులో సిద్దరాములు ఒకరు. ఇంటికి కబురందింది. తల్లి గుండె చెరువయ్యింది. సీఆర్‌పీఎఫ్ అధికారులు శవాన్ని తీసుకుని తాడ్వాయికి వచ్చారు.

ఆ జ్ఞాపకాల్లోనే..

కొడుకు చనిపోయి పాతికేళ్లు దాటింది. అయినా, ఆ తల్లి మాత్రం కొడుకు జ్ఞాపకాల్లోనే కాలం గడుపుతోంది. చిన్నతనంలో చేసిన అల్లరి, పెద్దయ్యాక చూపిన గుండెధైర్యం ఆమెను రోజూ వెంటాడుతూనే ఉన్నాయి. ఆమె ఆలనా పాలనా చిన్న కొడుకు విఠల్ చూసుకుంటున్నాడు. బీపీ, షుగర్ సమస్యలకు మందులు వాడుతోంది. నిత్యం కొడుకు గురించిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వచ్చింది. బీడీ కార్మికురాలిగా రిటైర్ అయ్యాక పీఎఫ్‌లో జమ అయిన డబ్బులపై నెలనెలా పెన్షన్ వస్తోంది. ఆ డబ్బులతో కొడుకు విగ్రహం ఏర్పాటు చేయాలని పూనుకుంది. విగ్రహం తయారీకి, ఏర్పాటుకు ఎంతోమందిని కలిసి, తన కల గురించి చెబుతుండేది. దాదాపు రూ.లక్షా 60 వేలు ఖర్చు చేసి సిద్దరాములు నిలువెత్తు విగ్రహాన్ని తయారు చేయించింది.

జై జవాన్..

గ్రామంలో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఈ నెల 27న జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసింది నాగమణి. కొడుకు జ్ఞాపకాలతో విగ్రహం ఏర్పాటు చేసిన తల్లిని అందరూ అభినందించారు. నాగమణి మాత్రం నాడు తన కొడుకుతో పాటు మరో పది మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేసుకుంది. దేశసేవలో జవాన్ల త్యాగం గురించి ఈ సందర్భంగా అందరూ గుర్తుచేసుకున్నారు. పిల్లలు సైతం జై జవాన్ అంటూ దేశసేవలో జవాన్ గొప్పతనాన్ని తెలుసుకుంటున్నారు.

– ఎస్.వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

కండ్ల ముందే తిరుగుతున్నట్టుంది




సిద్దరాములు విగ్రహం

చిన్నప్పటి నుంచి నా కొడుకులు ఎంతో కష్టపడి చదువుకున్నరు. తాడ్వాయికి నడుచుకుంటూ వెళ్లేవాళ్లు. పెద్దోడు ఉద్యోగంలో చేరిన తరువాత మా కష్టాలు తీరినయి. ఆరేడేండ్లు ఉద్యోగం చేసిండో లేదో చనిపోయిండు. వాడు కనుమరుగై ఇరవై ఐదేండ్లవుతున్నా నా కండ్ల ముందర ఇంకా తిరుగున్నట్టే ఉంటది. యాది జేసుకోని రోజు ఉండది. ఊళ్లో అందరితో ఎంతో ప్రేమగా ఉండేటోడు. రోజూ వాని ఫోటో చూసుకుంటూ ఇన్నేళ్లు గడిపినా. నా కొడుకు లెక్కనే ఉండే విగ్రహం అందరికీ తెలిసేలా పెట్టించాలనుకున్నా. అది ఇన్నాళ్లకి తీరింది. సైనికుడైన నా కొడుకు నాకే కాదు మా ఊరికి కూడా గొప్ప పేరు తెచ్చిపెట్టిండు.

– కంది నాగమణి, అమర జవాన్ సిద్దరాములు తల్లి

'అంతఃసౌందర్యమే అసలైన అందం...
ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం లేదు'.
'కష్టాన్ని తలుచుకుంటూ కుంగిపోవద్దు...
ధైర్యంగా ఎదుర్కోవడమే జీవితం...'
అని... సమాజానికి చాటి చెప్తోంది వినీల.
యాసిడ్ దాడి బాధితుల పక్షాన నిలుస్తోంది.
చిత్రలేఖనంతో సున్నితత్వాన్ని నిద్రలేపుతోంది.


పెయింట్ వేస్తున్న వినీల

జీవిత చిత్రాలు

పాముల వినీల ఈతరంలో రంగులు తొడిగిన చిత్రకారిణి. చిత్రలేఖనంతో ఆమె సమాజాన్ని చైతన్యవంతం చేస్తోంది. చిత్రలేఖనంతోనే ఆమె బండబారిపోయిన మనసు పొరల్ని తట్టి లేపుతోంది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన వినీల తన చిత్రకళ గురించి 'సాక్షి'తో పంచుకున్న వివరాలివి.

"మా నాన్న (శేషగిరి) చిత్రకారుడు కావడంతో నా బాల్యంలో... రంగులున్నాయి, కుంచె ఉంది, కాన్వాసూ ఉంది. ఇంట్లో ఒక గదిలో నాన్న బొమ్మలేస్తుండేవారు. నేను సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు మా నాన్న జేఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్‌లో చేరారు. అప్పటివరకు ఆయన సొంతంగా సాధన చేస్తూ వచ్చిన చిత్రలేఖనాన్ని మరింత శాస్త్రబద్ధంగా నేర్చుకున్నారు. అలా నాకు నాన్నే తొలి గురువు, ఇల్లే యూనివర్సిటీ. ఇంటర్ తర్వాత నాన్న చదివిన జేఎన్‌టీయూలోనే ఫైన్ ఆర్ట్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసి ఆర్టిస్ట్‌గా ఆత్మవిశ్వాసంతో కుంచె పట్టుకున్నాను. ఆ తర్వాత పెళ్లి, ఆ తర్వాత పెయింటింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. ఫస్ట్ పీజీలో ఉన్నప్పుడు నాకు ఎదురైన ఓ సంఘటన నన్ను సామాజిక చిత్రకారిణిగా మార్చింది.


వినీల

పక్క సీటు మహిళ

యూనివర్సిటీకి వెళ్లడానికి సిటీ బస్ ఎక్కాను. నా పక్కన ఒకామె వచ్చి కూర్చుంది. ఆమెను నేను పెద్దగా గమనించలేదు, కానీ మరో కావిడ నా పక్కనున్నావిడను చూసి దూరం జరగడం నా దృష్టిలో పడింది. అప్పుడు నా పక్కనున్నామె వైపు చూశాను. ఆమె యాసిడ్ దాడి బాధితురాలు. చూడగానే నేను కంగారు పడ్డాను. కానీ దూరం జరగలేదు, ఆమె బాధపడుతుందేమోననే సంస్కారం నన్ను ఆపింది. నేను మాసాబ్ ట్యాంక్ బస్టాపులో దిగాను. ఆమె కూడా అదే బస్టాప్‌లో దిగింది. అప్పుడు మాటలు కలిపాను. ఆమె జీవితంలో ఎదురైన విషాదం నన్ను కలిచివేసింది. 'ఒకతడు ఆమె వెంటపడుతూ ఉండేవాడు. ఒకసారి గట్టిగా మాట్లాడింది. అతడి ప్రతిపాదనకు ఆమె అంగీకరించలేదు. గట్టిగా నో చెప్పింది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే ఆమె మీద యాసిడ్ దాడి జరిగింది'... ఇవీ ఆమె తన గురించి క్లుప్తంగా చెప్పిన వివరాలు. ఆ తర్వాత దాదాపు వారం– పది రోజులు నన్ను ఆమె జ్ఞాపకాలు వెంటాడాయి. ఏవేవో ప్రశ్నలు, సమాధానాల కోసం గూగుల్ సెర్చ్ చేస్తే ఆవేదన కలిగించే విషయాలు తెలిశాయి. యాసిడ్ బాధితుల గురించి దాదాపుగా అధ్యయనం చేశాను. కొంత మంది ధైర్యంగా జీవితాన్ని కొనసాగిస్తున్నారు. కొంతమంది ఆవేదనతో కుంగిపోతూ సమాజానికి ముఖం చూపించడానికి బిడియపడుతున్నారు. ఎవరో చేసిన నేరానికి వాళ్లు సమాజానికి భయపడడం ఎందుకు అనిపించేది. 'సౌందర్యం అనేది భౌతికం కాదు, అంతః సౌందర్యమే అసలైన అందం' అని ధైర్యం చెప్తాయి నా బొమ్మలు. విజయపథాన రాణించడానికి ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం మరొకటి ఉండదని మార్గదర్శనం చేస్తాయి. అంతకంటే ముందు... యాసిడ్ బాధితులను సమాజం స్వీకరించాలి. స్వీకరించాలంటే... సమాజంలో సున్నితత్వాన్ని మేల్కొలపాలి. మనిషిలో స్వతహాగా సున్నితత్వం ఉంటుంది. కానీ ఆ సున్నితత్వం సమాజం నిర్దేశించిన చట్రాల పొరలతో కప్పబడి పోయి ఉంది. ఆ పొరలను తొలగించగలిగే మాధ్యమంగా నా చేతిలో ఉన్న కళనే ఎంచుకున్నాను. అలా చిత్రలేఖనంలో ఇప్పటివరకు ఇరవైకి పైగా యాసిడ్ బాధితుల థీమ్‌తో చిత్రాలు వేశాను. ఒక్కొక్క చిత్రం ఒక్కో జీవితానికి ప్రతీకలు. వాటికి మంచి ప్రశంసలు వస్తున్నప్పుడు మన జీవితాలు ఎంత యాంత్రికంగా మారిపోయినప్పటికీ మనసుల్లో సున్నితత్వం నిలిచి ఉందని సంతోషం వేస్తుంటుంది. ఈ సెన్సిటివిటీని మరింతగా చైతన్యవంతం చేయగలిగితే యాసిడ్ బాధితులు సమాజంలో ఎటువంటి బెరుకు లేకుండా జీవించగలుగుతారు. సగటు మనుషులు యాసిడ్ బాధితులకు మద్దతుగా వారి పక్షాన చేరడానికి ధైర్యంగా ముందుకు వస్తారనేది నా ఆకాంక్ష.





చార్‌కోల్ బొమ్మ

యాసిడ్ బాధితుల చిత్రాలను చార్‌కోల్‌తో వేస్తున్నాను. ఎందుకంటే కాలిపోయినప్పటికీ తన ఉనికిని నిలబెట్టుకోగలిగిన వస్తువు చార్‌కోల్. ఎన్ని కష్టాలెదురైనా జీవితేచ్ఛను కోల్పోకూడదనే ధైర్యాన్ని నెలకొల్పాలనేది నా ఆలోచన. చిత్రలేఖనంలో నా వంతు సామాజిక బాధ్యత ఇది. ఇక నా కోసం నేను టీఎమ్ఆర్ఈఐఎస్ (తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ సొసైటీ)లో డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. నాలుగు వందల మంది పిల్లల నుంచి నాలుగు వందల ఐడియాలు వస్తుంటాయి. దాంతో నాకు ఉద్యోగం ప్రతి రోజూ కొత్తగా ఉంటుంది. మా వారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగి. ఇద్దరబ్బాయిలు. ఇదీ నా రంగుల ప్రపంచం" అని వివరించారు వినీల.

– వాకా మంజులారెడ్డి

యూత్ ప్లస్

ఆహా ఆర్థిక పాఠం!

యూత్ అంటే 'ఓన్లీ వినోదం'
అనేది ఒకప్పటి మాట.
అయితే కోవిడ్ సంక్షోభ కాలం
వారికి పైసా విలువను తెలియజేసింది.
'ఆర్ట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్' గురించి
ఆలోచించేలా చేసింది.
కలలు వెదుక్కునే యువతరానికి
'ఆర్థిక కళ' ఒంటపట్టింది. ఈ నేపథ్యం నుంచే
యువ ఫిన్‌ఫ్లూయెన్సర్‌ల ప్రయాణం మొదలైంది...


నేహా నగర్

దిల్లీకి చెందిన ప్రియాంక భాటియాకు ఇన్వెస్ట్‌మెంట్‌పై ఆసక్తి మొదలైంది. అయితే ఒక బ్రోకర్ ఇచ్చిన తెలివి తక్కువ సలహాతో ఆమె ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ తలకిందులైంది. నష్టం చవి చూడాల్సి వచ్చింది.

'ఇక సెలవు. ఎందుకొచ్చిన రిస్క్' అని ఆమె అనుకోలేదు.

సెకండ్ ఇన్నింగ్స్‌లో...

స్టాక్ ఇన్వెస్టర్, ప్రాపర్టీ ఇన్వెస్టర్, ఎంటర్‌ప్రెన్యూర్, బిజినెస్ కోచ్‌లతో మాట్లాడింది. బుక్స్ చదివింది. వర్క్‌షాప్‌లకు హాజరైంది. ఫలితంగా ప్రియాంకకు ఎన్నో విషయాలపై లోతైన అవగాహన వచ్చింది.

ఫస్ట్ ఇండిపెండెంట్ ఇన్వెస్ట్‌మెంట్‌తో లాభం సంపాదించింది.

స్టాక్‌మార్కెట్‌లో సక్సెస్ అయిన తరువాత చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి వావ్(ఉమెన్ ఆన్ వెల్త్) పేరుతో మహిళల కోసం ఫైనాల్సియల్ కోర్సు ప్రారంభించింది. ఈతరం అమ్మాయిలకు ఈ కోర్సు ఎంతో దగ్గరైంది.

27 సంవత్సరాల నేహా నగర్ (దిల్లీ) పాపులర్ ఫిన్‌ఫ్లూయెన్సర్. టాక్స్ కన్సల్టెన్సీ సంస్థ టాక్సెజేషన్.ఇన్ వ్యవస్థాపకురాలైన నేహాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 748,000 ఫాలోవర్స్, యూట్యూబ్‌లో రెండు లక్షలమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన నేహా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. చార్టెడ్ ఎకౌంటెన్సీని కెరీర్‌గా ఎంచుకోవాలనే ఆమె కల నెరవేరలేదు.

సీఏ ఫైనల్స్‌లో ఉత్తీర్ణత సాధించకపోయినా ఫైనాన్స్ విషయాలపై ఆసక్తి మాత్రం రెట్టింపు అయింది. ఆ ఉత్సాహంతోనే ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్‌లో వెల్త్ మేనేజర్‌గా పనిచేసింది. ఆ తరువాత సొంతంగా ట్యాక్స్ ఫర్మ్ మొదలుపెట్టి విజయం సాధించింది. లాక్‌డౌన్ టైమ్‌లో క్రిప్టో కరెన్సీ, స్టాక్స్, పర్సనల్ ఫైనాన్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ... మొదలైన వాటి గురించి నేహా క్రియేట్ చేసిన కంటెంట్ యువతను ఆకట్టుకుంది.

సంక్లిష్టమైన ఆర్థిక పరిభాషను సులభతరం చేసి యువతకు దగ్గర చేసిన ఫిన్‌ఫ్లూయెన్సర్‌గా పేరు తెచ్చుకుంది పుణె(మహారాష్ట్ర)కు చెందిన రచన రనడే. సీఏ చేసిన రచన చిన్న వయసులోనే టీచింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుంది. లైవ్, ఆన్‌లైన్‌లలో వేలాదిమందికి పాఠాలు చెప్పింది. నేహాకు 3.7 మిలియన్‌ల సబ్ స్క్రైబర్‌లు ఉన్నారు.

తన మాతృభాష మరాఠీలో సోషల్ మీడియా వేదికగా ఫైనాల్సియల్ లిటరసీ గురించి పనిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది నేహా.

సీఏలో ఉత్తీర్ణత సాధించిన తరువాత ఫైనాన్స్ ప్రొఫెషన్‌ను ఎంచుకుంది ట్వింకిల్ జైన్. యువతకు ఆర్థిక విషయాలపై అవగాహన కలిగించడానికి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు చేస్తుంటుంది. ఆమెకు మూడు లక్షల వరకు సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.


ట్వింకిల్ జైన్

26 సంవత్సరాల ట్వింకిల్ రకరకాల బ్రాండ్స్‌కు మోడలింగ్ చేస్తోంది. ఫిన్‌ఫ్లూయెన్సర్‌గా కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే వారు ట్వింకిల్ దగ్గరకు వచ్చి సలహాలు తీసుకుంటూ ఉంటారు.

'సీఏ పరీక్షలు క్లియర్ చేయడం అంత సులభం కాదు. నీవల్ల ఏమవుతుంది! ... ఇలాంటి మాటలు ఎన్నోసార్లు విన్నాను. ఈ మాటలు మనమీద మనకు సందేహం రేకెత్తించేలా, ఒత్తిడి పెంచేలా, చివరికి ఓటమికి దగ్గర చేసేలా చేస్తుంటాయి. ఎగ్జామ్స్ నుంచి కెరీర్ వరకు ఇలాంటి నెగటివ్ కామెంట్స్ వినిపిస్తూనే ఉంటాయి. అవి చెవి దాటి మనసు దారి పట్టకుండా, ఎత్తిన తల దించకుండా, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని చూస్తూ ముందుకు వెళ్లాలి'... ట్వింకిల్ జైన్ చెప్పే ఇలాంటి మాటలు యూత్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంటాయి.

బ్యూటిప్స్

పపాయా ఫేస్ ప్యాక్



బొప్పాయి మాస్క్‌తో కూడా చర్మానికి చాలా మేలు కలుగుతుంది. ఇది చర్మాన్ని అందంగా మారుస్తుంది. ఇందులో విటమిన్ సి ఉంటుంది. దీని వల్ల ముఖానికి మరింత బెనిఫిట్ కలుగుతుంది. మీరు బొప్పాయి మాస్క్ తయారు చేసుకోవాలంటే... బొప్పాయి తొక్కను తీసేసి ముక్కల కింద కోసి వాటిని మిక్సీలో వేసి పేస్ట్ లాగా చేయండి తర్వాత ఈ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే వదిలేసి ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని కడిగేసుకోండి. అప్పుడప్పుడు మీకు సమయం ఉన్నప్పుడు ఈ మాస్క్ ని వేస్తూ ఉండండి. చర్మం కాంతి బాగుంటుంది.

టీ పొడిని పడేయకండి..



టీ పెట్టిన తర్వాత వడపోసిన టీ పొడిని పారేయకుండా పక్కన పెట్టి దాంతో అద్దాలు, చెక్కతో చేసిన వస్తువులు శుభ్రం చేయడం వల్ల అవి శుభ్రపడి అందంగా మెరుస్తాయి.

ఆత్మసాక్షి

తయ్యబున్నీసా గొప్ప అథ్లెట్.
ఒకప్పుడు అస్సాం నుంచి ఆసియా క్రీడల్లో పాల్గొన్న
తొలి మహిళ. డిస్కస్ త్రోలో రికార్డ్ హోల్డర్.
రైల్వేలో పని చేసి రిటైరయ్యింది.
కాని ఆమె మనసులో ఒక వెలితి. అశాంతి.
ఒక స్నేహితురాలికి ఆమె బాకీ ఉంది.
అది కూడా బంగారం బాకీ.
55 ఏళ్ల తర్వాత ఆ స్నేహితురాలిని వెతికి ఆ బాకీ
చెల్లించింది. కాని ఇందులో ఉన్న అసలు ఫ్లాష్
బ్యాక్ తెలిస్తే మనిషిని ఆత్మ సాక్షి ఎలా వేధి
స్తుందో అర్థమవుతుంది.
స్నేహానికి ఉన్న విలువ కూడా.


తయ్యబున్నీసా, జులేఖా

బంగారం లాంటి స్నేహ గాథ

మిత్ర ధర్మం, మిత్ర ద్రోహం రెండూ కలగలిసిన కథ ఇది. నిజానికి ఎవరైనా రచయిత మంచి కథగా రాయదగ్గ అంశం. పశ్చాత్తాపం, అపరాధ భావం ఒక మనిషిని ఎలా వెంటాడుతాయో ఈ ఉదంతం చెబుతుంది.

ఇదీ జరిగింది

అనగనగా అస్సాంలోని శివ నగర్. 1967వ సంవత్సరం. అక్కడి ధాయ్ అలీ గర్ల్స్ హైస్కూల్‌లో 7వ క్లాసులో ఇద్దరు అమ్మాయిలు కలిసి చదువుకుంటున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు ఒకమ్మాయి పేరు తయ్యబున్నీసా. ఇంకొక అమ్మాయి పేరు జులేఖా. తయ్యబున్నీసా కడు పేదరాలు. జులేఖా స్థితిమంతురాలు. ఆ తేడా వారి స్నేహానికి అడ్డు కాలేదు. జులేఖా రోజూ వేళ్లకు ఉంగరాలు పెట్టుకుని బడికి వచ్చేది. బంగారు ఉంగరాలు అవి. ఒకరోజు ఒక ఉంగరం పోగొట్టుకుంది. ఇంట్లో చెప్తే తిట్టి, ఇక మీదట జాగ్రత్త అన్నారు. తయ్యబున్నీసాకు రోజూ అందరి కంటే ముందే స్కూల్‌కి రావడం అలవాటు. మరుసటి రోజు ఉదయాన్నే స్కూల్‌కు వచ్చి క్లాస్‌లో అడుగు పెడితే ఉంగరం దొరికింది. అది తన ఫ్రెండ్ జులేఖాది అని తెలుసు. తిరిగి ఇస్తే నువ్వే దొంగతనం చేశావా అంటారేమోనని భయపడి ఇంట్లో ఇచ్చింది. ఇంటికి వెళ్లిన ఉంగరం తిరిగి స్నేహితురాలికి చేరలేదు. ఉంగరం దొరికిన సంగతి తయ్యబున్నీసా జులేఖాకి చెప్పలేదు. అదే సంవత్సరం తయ్యబున్నీసా తండ్రి మరణించాడు. ఆ కష్టాల్లో ఇంట్లో వాళ్లు ఆ ఉంగరాన్ని అమ్మేశారు. రోజులు గడిచిపోయాయి.

ఆ తర్వాత?

తయ్యబున్నీసా అథ్లెట్ అయ్యింది. డిస్కస్ త్రో లో చాలా ప్రతిభ చూపించింది. 1974లో నేషనల్ రికార్డు స్థాపించి 1982లో జరిగిన ఆసియా క్రీడల్లో అస్సాం నుంచి పాల్గొన్న మొదటి మహిళా అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. ఆ క్రీడా ప్రతిభకు ఆమెకు రైల్వేలో ఉద్యోగం ఇచ్చారు. రైల్వేలో పని చేస్తూ, అథ్లెట్‌గా రాణిస్తూ రిటైర్ అయ్యింది. ఇంత జీవితం గడిచినా ఆమెకు ఏదో అశాంతి. అపరాధభావం. పశ్చాత్తాపం. చిన్నప్పుడు స్నేహితురాలి ఉంగరం దాదాపు దొంగిలించిన భావన. ఈలోపు తయ్యబున్నీసా 'హజ్'కు వెళ్లి వచ్చింది. అప్పటినుంచి ఆ చిన్నప్పటి 'స్నేహద్రోహం' ఇంకా బాధించసాగింది. దీనినుంచి బయటపడాలని నిశ్చయించుకుంది. జులేఖా ఎక్కడ ఉందో కనుక్కోమని సోదరికి చెప్తే జులేఖాను వెతకడం చాలా కష్టమైంది. కాని మొత్తం మీద ఆమె జీవించే ఉంది. శివ నగర్‌లోనే ఉంది.

> తప్పును అంగీకరించడం, క్షమించి ముందుకుపోవడం... వీటి వల్లే బంధాలు ముందుకు సాగుతాయి. స్నేహం కలకాలం నిలుస్తుంది అని ఈ ఇద్దరు స్నేహితురాళ్లు రుజువు చేశారు.

55 ఏళ్ల తర్వాత

ఇన్నాళ్ల తర్వాత తయ్యబున్నీసా తన స్నేహితురాలు జులేఖాను కలిసింది. అప్పటికి జులేఖా దాదాపు తయ్యబున్నీసాను మర్చిపోయింది. తయ్యబున్నీసా గుర్తు చేశాక ఆత్మీయంగా హత్తుకుంది. అప్పుడు మెల్లగా... ఉంగరం గురించి గుర్తు చేసింది. ఆ సంగతి కూడా జులేఖా మర్చిపోయింది. ఆ ఉంగరం తనను పెట్టిన బాధ స్నేహితురాలికి చెప్పుకుంది. ఆ ఉంగరాన్ని తిరిగి ఇవ్వలేకపోయినా పరిహారం చెల్లించడానికి వచ్చానని చెప్పింది. 12 వేల రూపాయల కవర్ స్నేహితురాలి చేతిలో పెట్టింది. జులేఖా ఆ డబ్బు వద్దంటే వద్దు అంది. కాని స్నేహితురాలిని తెరిపిన పడేయడానికి తీసుకుంది.

'ఇప్పుడు నాకు ప్రశాంతంగా ఉంది' అని కళ్ల తడి చేసుకుంది తయ్యబున్నీసా.

'ఈ డబ్బు సంగతి ఏమిటో గాని ఇన్నాళ్లకు మేమిద్దరం కలిశాం. అది బాగుంది' అని సంతోష పడింది జులేఖా.

తప్పును అంగీకరించడం, క్షమించి ముందుకుపోవడం... వీటి వల్లే బంధాలు ముందుకు సాగుతాయి. స్నేహం కలకాలం నిలుస్తుంది అని ఈ ఇద్దరు స్నేహితురాళ్లు రుజువు చేశారు.



క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మైసూర్ ఓపెన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ, ఆంధ్రప్రదేశ్ ఆటగాడు నిక్కీ పునాచా ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడ్ రిత్విక్–నిక్కీ జోడీ 6–7 (3/7), 7–6 (8/6), 10–7తో ప్రజ్వల్ దేవ్–గంటా సాయికార్తీక్ రెడ్డి (భారత్) జంటను ఓడించింది. గంటా 58 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్ జోడీ ఐదు ఏస్‌లు సంధించింది.



వైదొలగనున్న హైదరాబాద్ ఎఫ్‌సీ హెడ్ కోచ్

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫ్రాంచైజీ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) హెడ్ కోచ్ మనోలో మార్కెజ్ (స్పెయిన్) ఈ సీజన్ ముగిశాక జట్టును వీడనున్నారు. మనోలో మార్కెజ్ శిక్షణలో హైదరాబాద్ గత ఏడాది ఐఎస్‌ఎల్ చాంపియన్‌గా నిలిచి, ఈ ఏడాది సెమీఫైనల్ చేరింది. ఆగస్టులో జరిగే సూపర్ కప్ టోర్నీ తర్వాత మార్కెజ్ తప్పుకుంటారు. గత మూడు సీజన్‌లలో మార్కెజ్ శిక్షణలో హైదరాబాద్ ఎంతో ఎత్తుకు ఎదిగిందని ఫ్రాంచైజీ యజమాని వరుణ్ త్రిపురనేని తెలిపారు.

హంపి, హారిక గేమ్‌లు 'డ్రా'





న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసుకున్నారు. మంగళవారం జరిగిన మూడో రౌండ్‌లో కాటరీనా లాగ్నో (రష్యా)తో గేమ్‌ను హంపి 32 ఎత్తుల్లో... నానా జాగ్‌నిడ్జె (జార్జియా)తో గేమ్‌ను హారిక 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. మూడో రౌండ్ తర్వాత 1.5 పాయింట్లతో హారిక, హంపి మరో ముగ్గురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

సిక్కి రెడ్డి జోడీ గెలుపు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి–ఆరతి (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సిక్కి–ఆరతి ద్వయం 16–21, 21–18, 21–11తో ఆనీ జు–కెర్రీ జు (అమెరికా) జోడీపై విజయం సాధించింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మాత్రం సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్), సుమీత్ రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జోడీలు మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాయి. క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో సిక్కి–రోహన్ 12–21, 22–20, 19–21తో అమ్రి స్యానవి–వినీ ఒక్తావినా (ఇండోనేసియా) చేతిలో... సుమీత్–అశ్విని 17–21, 21–19, 13–21తో హీ జి టింగ్–డూ యె (చైనా) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్ క్వాలిఫయింగ్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు.

కివీస్, లంక రెండో వన్డే రద్దు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్, శ్రీలంక జట్ల మధ్య మంగళవారం జరగాల్సిన రెండో వన్డే భారీ వర్షం కారణంగా రద్దయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ తొలి వన్డేలో 198 పరుగులతో గెలిచి 1–0తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన మూడో వన్డే శుక్రవారం జరుగుతుంది.

సన్‌రైజర్స్ సరికొత్తగా...

పలు కీలక మార్పులతో ఐపీఎల్ సీజన్‌కు సిద్ధం

కొత్త కెప్టెన్, కొత్త కోచ్‌తో హైదరాబాద్ జట్టు

రెండేళ్ల క్రితం ఎనిమిది జట్లు పాల్గొన్న ఐపీఎల్‌లో ఎనిమిదో స్థానం... గత ఏడాది పది జట్లు పాల్గొన్న ఐపీఎల్‌లోనూ ఎనిమిదో స్థానం... ఆట మెరుగుపడలేదని అనుకోవాలా లేక తమకంటే రెండు జట్లు కింద ఉన్నాయి కాబట్టి బాగానే ఆడినట్లా! 2016లో చాంపియన్‌గా నిలిచాక తర్వాతి నాలుగు సీజన్లలో టాప్–4లో ఉంటూ నిలకడ ప్రదర్శించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట గత రెండేళ్లు పూర్తిగా గతి తప్పింది. సమష్టి వైఫల్యంతో పాటు వార్నర్ వివాదం టీమ్‌ను బాగా ఇబ్బంది పెట్టాయి. 2019 ఐపీఎల్ తర్వాత మళ్లీ ఇప్పుడే రైజర్స్ తమ సొంత మైదానం హైదరాబాద్‌లో మ్యాచ్‌లు ఆడబోతోంది. పలువురు ఆటగాళ్ల మార్పులతో పాటు సహాయక సిబ్బందిలోనూ స్వల్ప మార్పుచేర్పులతో కొత్త సీజన్‌కు సిద్ధమైంది. ఇలాంటి నేపథ్యంలో జట్టు ఎలాంటి ప్రదర్శన ఇస్తుందని అభిమానులంతా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. దక్షిణాఫ్రికా టి20 కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ కొత్త కెప్టెన్‌గా ముందు నిలబడగా, ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్లలో ఒకడైన బ్రియాన్ లారా ఈసారి పూర్తి స్థాయిలో జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం విశేషం.

-సాక్షి క్రీడా విభాగం

కొత్త సీజన్ వేలానికి ముందు హైదరాబాద్ 2022లో ఆడిన వారి నుంచి 12 మంది ఆటగాళ్లను వదిలేసుకుంది. వీరిలో 'కేన్ మామా' అంటూ అభిమానులు పిలుచుకున్న విలియమ్సన్‌తో పాటు నికోలస్ పూరన్ తదితరులు ఉన్నారు. మరో 12 మందిని కొనసాగించగా అందులోంచే దక్షిణాఫ్రికా క్రికెటర్ మార్క్‌రమ్‌ను కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇటీవలే దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో సన్‌రైజర్స్ యాజమాన్యానికే చెందిన ఈస్టర్న్ కేప్ టీమ్ మార్క్‌రమ్ సారథ్యంలోనే విజేతగా నిలిచింది. కాబట్టి నాయకత్వం విషయంలో ఫ్రాంచైజీ అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకుందని భావించవచ్చు. సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అందుబాటులో ఉన్నా... మార్క్‌రమ్‌పైనే యాజమాన్యం విశ్వాసం ఉంచింది. జట్టు తరఫున గత ఒక్క సీజన్ మాత్రమే ఆడిన అతను 12 ఇన్నింగ్స్‌లలో 139.05 స్ట్రయిక్‌రేట్‌తో 381 పరుగులు చేసి మెరుగైన ప్రదర్శనే కనబర్చాడు. ఈసారి అతడి బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్సీ బాధ్యతలు కూడా జట్టుకు కీలకం కానున్నాయి. ముఖ్యంగా 'హోం గ్రౌండ్' ఉప్పల్ స్టేడియంలో జరిగే 7 మ్యాచ్‌ల కోసం జట్టులో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోగలిగి విజయాలు సాధిస్తే 'ప్లే ఆఫ్స్' అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.

బ్రూక్ చెలరేగుతాడా...




హ్యారీ బ్రూక్



మయాంక్

సన్‌రైజర్స్ బ్యాటింగ్ లైనప్ లో ఈసారి అందరినీ ఆకర్షిస్తున్న ఆటగాడు ఇంగ్లండ్‌కు చెందిన 24 ఏళ్ల హ్యారీ బ్రూక్. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటికే 'ఆల్ ఫార్మాట్' ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న అతను 99 టి20ల్లో విధ్వంసకర స్ట్రయిక్‌రేట్ 148.32తో 2432 పరుగులు చేశాడు. మిడిలార్డర్‌లో బ్రూక్ బ్యాటింగ్ రైజర్స్‌కు 'బూస్ట్' ఇవ్వగలదు. అయితే భారత గడ్డపై తొలిసారి ఆడనున్న అతను పరిస్థితులను ఎలా వాడుకుంటాడనేది చూడాలి. మిడిలార్డర్‌లో అతనితో పాటు మార్క్‌రమ్, వికెట్ కీపర్లు ఫిలిప్స్, క్లాసెన్ (ఇద్దరిలో ఒకరు), ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్ జట్టుకు మంచి స్కోరు అందించగలరు. గత ఏడాది పంజాబ్ కింగ్స్ తరఫున పేలవ ప్రదర్శన కనబర్చిన మయాంక్ అగర్వాల్ ఇప్పుడు సన్‌రైజర్స్‌కు ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. గత సీజన్ టీమ్ టాప్ స్కోరర్ అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠిలు టాపార్డర్‌లో వేగంగా పరుగులు సాధించాల్సి ఉంటుంది. అయితే ఇతర జట్లతో పోలిస్తే తొలి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడే విధ్వంసక ఓపెనర్ హైదరాబాద్ వద్ద లేడనేది స్పష్టం.

పేసర్ల బృందం...



భువనేశ్వర్

బ్యాటింగ్‌తో పోలిస్తే మరోసారి హైదరాబాద్ బౌలింగ్ కాస్త పదునుగా కనిపిస్తోంది. గత సీజన్‌లో ఆడిన 14 మ్యాచ్‌ల్లోనూ 'ఫాస్టెస్ట్ బాల్' విసిరిన ఉమ్రాన్ మలిక్ ఇప్పుడు కూడా కీలక బాధ్యత పోషించాల్సి ఉంది. పైగా ఈ ఏడాది కాలంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో అతని ఆట మెరుగవడంతో పాటు బాధ్యత కూడా పెరిగింది. బౌలింగ్‌లో మునుపటి వాడి లోపించడంతో భారత జట్టు చోటుతో పాటు బోర్డు కాంట్రాక్ట్ కూడా కోల్పోయిన భువనేశ్వర్ ఈసారి ఏమాత్రం ప్రభావం చూపిస్తాడనేది చెప్పలేం. అయితే నటరాజన్, కార్తీక్ త్యాగి, జాన్సెన్, ఫజల్ హఖ్‌లతో పేస్ బృందం పెద్దదిగానే ఉంది. ఆల్‌రౌండర్ సుందర్ ఆఫ్ స్పిన్ జట్టుకు సానుకూలాంశం కాగా, రెగ్యులర్ స్పిన్నర్‌గా ఆదిల్ రషీద్ కనిపిస్తున్నాడు. ఇంగ్లండ్ తరఫున గత కొన్నేళ్లుగా వన్డేలు, టి20ల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న రషీద్ అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటే గతంలో రషీద్ ఖాన్ తరహాలో లెగ్ స్పిన్‌తో ప్రత్యర్థిపై పైచేయి సాధించవచ్చు. దేశవాళీ లెగ్‌స్పిన్నర్ మయాంక్ మర్కండే కూడా టీమ్‌లో ఉన్నాడు కానీ గత రెండు సీజన్లుగా అతను రాణించలేకపోయాడు. అయితే ఓవరాల్‌గా చూస్తే ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న క్రికెటర్లు మినహా కొత్తగా జట్టులోకి వచ్చిన యువ ఆటగాళ్లలో మరీ చెప్పుకోదగ్గ ప్లేయర్లు ఎవరూ లేరు. 20 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడినా ఇప్పటి వరకు కీలక దశలో సమద్‌పై పూర్తి నమ్మకం ఉంచలేని పరిస్థితి. కాబట్టి తుది జట్టులో వీరిలో ఎవరికి స్థానం దక్కుతుందనేది సందేహమే.



మార్క్‌రమ్

సన్‌రైజర్స్ జట్టు వివరాలు

మార్క్‌రమ్ (కెప్టెన్), గ్లెన్ ఫిలిప్స్, మార్కో జాన్సెన్, ఫజల్ హఖ్ ఫారుఖీ, హ్యారీ బ్రూక్, క్లాసెన్, ఆదిల్ రషీద్, అకీల్ హొసీన్ (విదేశీ ఆటగాళ్లు). అబ్దుల్ సమద్, రాహుల్ త్రిపాఠి, అభిషేక్ శర్మ, వాషింగ్టన్ సుందర్, భువనేశ్వర్, కార్తీక్ త్యాగి, నటరాజన్, ఉమ్రాన్ మలిక్, మయాంక్ అగర్వాల్, అన్‌మోల్ ప్రీత్ సింగ్, మయాంక్ మర్కండే, వివ్రాంత్ శర్మ, మయాంక్ డాగర్, సమర్థ్ వ్యాస్, సన్వీర్, ఉపేంద్ర సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి.

సహాయక సిబ్బంది

బ్రియాన్ లారా (హెడ్ కోచ్), డేల్ స్టెయిన్ (పేస్ బౌలింగ్ కోచ్), ముత్తయ్య మురళీధరన్ (స్పిన్ బౌలింగ్ కోచ్), ర్యాన్ కుక్ (ఫీల్డింగ్ కోచ్), సైమన్ హెల్మెట్ (అసిస్టెంట్ కోచ్).

టాప్–10 నుంచి సింధు అవుట్

ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు 2016 నవంబర్ తర్వాత తొలిసారి ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో టాప్–10లో చోటు కోల్పోయింది. గతవారం ముగిసిన స్విస్ ఓపెన్‌లో సింధు మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. ఈ ఫలితం ఆమె ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సింధు మహిళల సింగిల్స్ విభాగంలో రెండు స్థానాలు పడిపోయి 11వ ర్యాంక్‌కు చేరుకుంది. ఈ ఏడాది సింధు నాలుగు టోర్నీలలో పాల్గొని మూడింటిలో తొలి రౌండ్‌లో ఓడిపోయి, మరో టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. ప్రస్తుతం మాడ్రిడ్‌లో జరుగుతున్న స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో సింధు బరిలో ఉంది. భారత్‌కే చెందిన మరో స్టార్ ప్లేయర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ ఒక స్థానం ఎగబాకి 31వ ర్యాంక్‌లో నిలిచింది. జనవరిలో ఇండోనేసియా ఓపెన్ తర్వాత సైనా మరో టోర్నీలో ఆడలేదు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ తొమ్మిదో ర్యాంక్‌ను నిలబెట్టుకోగా... కిడాంబి శ్రీకాంత్ 21వ ర్యాంక్‌లో, లక్ష్య సేన్ 25వ ర్యాంక్‌లో నిలిచారు.

చాంపియన్ భారత్



ఇంఫాల్: ముక్కోణపు అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు విజేతగా నిలిచింది. మణిపూర్‌లో మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–0 గోల్స్ తేడాతో కిర్గిజ్ రిపబ్లిక్ జట్టుపై గెలిచింది. భారత్ తరఫున సందేశ్ జింగాన్ (34వ ని.లో), సునీల్ ఛెత్రి (84వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. సునీల్ ఛెత్రి కెరీర్‌లో ఇది 85వ గోల్ కావడం విశేషం. ఈ టోర్నీలో ఆడిన మరో జట్టు మయన్మార్‌పై తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1–0తో విజయం సాధించింది.

సినిమా



రవితేజ

నన్ను ఆపగలిగేది నేనే!

'అరే బాజ్జీ.. లైఫ్‌లో వైలెన్స్ ఎక్కువైపోయి బొత్తిగా రొమాన్స్ లేకుండా పోతోంది రా..' అంటూ రవితేజ చెప్పే డైలాగ్‌తో 'రావణాసుర' ట్రైలర్ విడుదలైంది. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేశారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు మేకర్స్. 'ఈ భూమ్మీద నన్ను ఆపగలిగేవాడు ఎవడైనా ఉన్నాడంటే అది నేనే..' అనే రవితేజ డైలాగ్‌తో ట్రైలర్ ముగుస్తుంది. రవితేజ క్రిమినల్ లాయర్ పాత్రలో కనిపించనున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్థన్ రామేశ్వర్, భీమ్స్, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్.

ఆ ఘనత చరిత్రలో నిలిచిపోతుంది

- చిరంజీవి



● సురేఖ, చిరంజీవి, రాజమౌళి, రమా రాజమౌళి, రామ్‌చరణ్

రామ్‌చరణ్ బర్త్ డే (మార్చి 27) వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. చిరంజీవి స్వగృహంలో ఈ వేడుక జరిగింది. ఇటీవల ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు..' పాటకు ఆస్కార్ వరించినందుకు 'ఆర్ఆర్ఆర్' టీమ్ సభ్యులు రాజమౌళి, కీరవాణి, డీవీవీ దానయ్య, సెంథిల్‌కుమార్, ఎస్.ఎస్. కార్తికేయ, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ తదితరులను ఈ వేడుకలో సత్కరించారు చిరంజీవి. ''రామ్‌చరణ్ బర్త్‌డే సందర్భంగా ఆత్మీయులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆస్కార్ విజేతలను సత్కరించడం నాకు నిజమైన వేడుకలాంటిది. తెలుగువారు సాధించిన ఆస్కార్ ఘనత భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది'' అని పేర్కొన్నారు చిరంజీవి. హీరోలు నాగార్జున, వెంకటేశ్, నాగచైతన్య, రానా, విజయ్ దేవరకొండ, అఖిల్, సాయిధరమ్, వైష్ణవ్ తేజ్, దర్శకులు సుకుమార్, కృష్ణవంశీ, ప్రశాంత్ నీల్, నార్తన్, నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌కి రెడీ



● అజయ్ దేవగన్

మైదానంలో ఫుట్‌బాల్ కోచ్‌గా కనిపించనున్నారు బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్. భారత జాతీయ ఫుట్‌బాల్ జట్టు కోచ్, మేనేజర్ (1950 –1963 సమయంలో...) సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'మైదాన్'. ఈ చిత్రంలో సయ్యద్ అబ్దుల్ పాత్రలో అజయ్ దేవగన్ నటించారు. అమిత్ రవీంద్రనాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియమణి కీలక పాత్ర పోషించారు. జీ స్టూడియోస్, బోనీ కపూర్, ఆకాష్ చావ్లా, అరుణవ జోయ్ గుప్తా నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా రెండేళ్ల క్రితమే విడుదల కావాల్సింది. అయితే పలుమార్లు రిలీజ్ వాయిదా పడింది. తాజాగా జూన్ 23న విడుదల చేయనున్నట్లు మంగళవారం చిత్ర యూనిట్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

టాలీవుడ్‌కి హాలీవుడ్ టెక్నీషియన్



● బ్రాడ్ మిన్నిచ్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభోత్సవం ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బెట్స్ వర్క్స్ చేస్తుండగా, తాజాగా ఈ సినిమాకు మరో హాలీవుడ్ సాంకేతిక నిపుణుడు బ్రాడ్ మిన్నిచ్ వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్‌గా వర్క్ చేస్తున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. హాలీవుడ్ చిత్రాలు '300', 'ఆక్వామేన్', 'ది బ్యాట్‌మేన్' వంటి వాటికి వర్క్ చేశారు బ్రాడ్ మిన్నిచ్.

శాకుంతలం నా మొదటి అడుగు!

- 'దిల్' రాజు



● చైతన్యప్రసాద్, 'దిల్' రాజు, గుణశేఖర్, నీలిమ గుణ, సాయిమాధవ్, ప్రవీణ్

''రాజమౌళి 'బాహుబలి'ని పాన్ ఇండియాకి, 'ఆర్ఆర్ఆర్'ని మొత్తం ప్రపంచానికి చూపించారు. మన తెలుగు సినిమాలు ప్రపంచానికి చూపిస్తూనే ఉండాలి.. దాని కోసం నా మొదటి అడుగు 'శాకుంతలం'. ఇది మన ఇండియన్ సినిమా అని తర్వాతి తరానికి తెలియాలి. ఈ మూవీ ప్రేక్షకులను నిరుత్సాహపరచదు'' అని 'దిల్' రాజు అన్నారు. సమంత లీడ్ రోల్‌లో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది. మంగళవారం ఈ చిత్రం త్రీడీ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''గుణశేఖర్‌గారికి సాయం చేయడానికి నేను ఈ మూవీలో భాగమయ్యాను' అని అందరూ అనుకుంటారు. కానీ, గుణశేఖర్‌గారు మోసపోయారు.. నేను స్వార్థంతో ఈ మూవీలో జాయిన్ అయ్యాను. ఎందుకంటే తెలుగు సినిమా గ్లోబల్ వరకూ వెళ్లింది. భవిష్యత్‌లో నేను కూడా ఇలాంటి విజువల్ ఎఫెక్ట్స్ ఉన్న గొప్ప సినిమాలు తీయాలంటే పని నేర్చుకోవాలి. అందుకే 'శాకుంతలం'లో చేరాను'' అన్నారు. గుణశేఖర్ మాట్లాడుతూ– ''ఇది సమంతగారి 'శాకుంతలం'. శకుంతల పాత్రకి ఆమె ప్రాణ ప్రతిష్ఠ చేశారు'' అన్నారు. ''మైథాలజీలో త్రీడీలో వస్తున్న తొలి చిత్రం 'శాకుంతలం'. ప్రేక్షకులందరూ ఈ మూవీని త్రీడీలో ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు నీలిమ గుణ. ఈ కార్యక్రమంలో మాటల రచయిత సాయిమాధవ్ బుర్రా, పాటల రచయిత చైతన్య ప్రసాద్, ఎడిటర్ ప్రవీణ్ పూడి మాట్లాడారు.



● ప్రియాంకా చోప్రా

సినిమా రాజకీయాలను తట్టుకోలేక పోయాను

హిందీ పరిశ్రమలో కొందరు చేసిన రాజకీయాలను తట్టుకోలేకపోయానని, అందుకే ఇటీవల హిందీ చిత్రాల సంఖ్య తగ్గించాననీ అంటున్నారు ప్రియాంకా చోప్రా. నటిగా ఇరవై సంత్సరాల సుదీర్ఘమైన కెరీర్ ఉన్న ప్రియాంకా చోప్రా ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాలీవుడ్‌లో ఓ హాట్ టాపిక్‌గా మారింది. బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు తాను షిఫ్ట్ కావడం గురించి ప్రియాంకా చోప్రా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. ''బాలీవుడ్ ఇండస్ట్రీలో కొందరు నన్ను ఒక మూలకు నెట్టివేయడానికి ప్రయత్నించారు. నాకు అవకాశాలు రాకుండా చేయడానికి ఓ గ్రూప్ ఏర్పాటైందని నాకు అర్థమైంది. ఈ క్రమంలో నాకు కొందరితో విభేదాలు తలెత్తాయి. ఈ పొలిటికల్ గేమ్స్ ఆడటం నావల్ల కాదనిపించింది. ఇక లాభం లేదని నేను బాలీవుడ్‌కు బిగ్ బ్రేక్ ఇవ్వాలనుకున్నాను. ఇప్పటి నా మేనేజర్ అంజులా ఆచార్య ఓ మ్యూజిక్‌లో నన్ను చూసి మ్యూజిక్ ప్రపంచంలో నీకు ఆసక్తి ఉందా? అని అడిగారు. ఓకే చెప్పి, యూఎస్ వెళ్లాను. అలా ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్లగలిగాను. కొత్త అవకాశాలు కూడా వచ్చాయి'' అని చెప్పుకొచ్చారు ప్రియాంకా చోప్రా. ఇక హాలీవుడ్‌లో 'క్వాంటికో', 'బేవాచ్' వంటి ప్రాజెక్ట్స్ చేశారు ప్రియాంక. ప్రస్తుతం ప్రియాంక నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్, ఇంగ్లిష్ చిత్రం 'లవ్ ఎగైన్' రిలీజ్‌కు రెడీగా ఉన్నాయి. అలాగే హిందీలో 'జీలే జరా' సినిమాలో ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్ చేయనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే ప్రియాంక చేసిన వ్యాఖ్యలకు కంగనా స్పందిస్తూ.. ''బాలీవుడ్ మాఫియా గ్యాంగ్ ప్రియాంకా చోప్రాను ఇండియా నుంచి అమెరికాకు పంపేసింది. ఇందుకు కారణం దర్శక–నిర్మాత కరణ్ జోహార్'' అని ఆరోపిస్తూ ట్వీట్స్ చేశారు.

ఇంత అభిమానం ఊహించలేదు


- అతుల్యా రవి



''మీటర్' పక్కా కమర్షియల్ మూవీ. పాటలు, డ్యాన్సులు, మాస్ ఫైట్స్, రొమాన్స్, లవ్.. ఇలా అన్ని అంశాలుంటాయి. తండ్రి సెంటిమెంట్ కీలకంగా ఉంటుంది'' అని హీరోయిన్ అతుల్యా రవి అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా రమేష్ కడూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీటర్'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా అతుల్యా రవి మాట్లాడుతూ– ''తమిళంలో చాలా సినిమాల్లో నటించాను. తెలుగు పరిశ్రమలోకి రావాలని కోరుకున్నాను. దేవుడి దయ వల్ల మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌లాంటి ప్రముఖ సంస్థలు నిర్మించిన 'మీటర్'లో అవకాశం వచ్చింది. ఈ సినిమాలో అబ్బాయిలంటే ఇష్టం లేని పాత్రలో కనిపిస్తాను. అయితే నా పాత్ర ఫస్ట్ హాఫ్‌లో కామెడీగా ఉంటుంది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఎక్కడికి వెళ్లినా ప్రేక్షకులు చూపిస్తున్న అభిమానానికి హ్యాపీగా ఉంది.. ఇంత అభిమానం ఊహించలేదు. ప్రస్తుతం తమిళ్‌లో 'డీజిల్' సినిమా చేస్తున్నాను'' అన్నారు.

సీరియస్ పాయింట్‌ని వినోదంగా చెప్పాం

- పాపారావు బియ్యాల



● పాపారావు, 'దిల్' రాజు

''చదువు వల్ల నేటి తరం పిల్లలపై ఎంత ఒత్తిడి పడుతోందో తెలియజేసే చిత్రమే 'మ్యూజిక్ స్కూల్'. ఇదొక సీరియస్ పాయింట్. కానీ వినోదాత్మకంగా, మ్యూజికల్ ఫిల్మ్‌గా చేశారు పాపారావుగారు. ఈ సినిమాని అందరూ ఆదరించాలి'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. శ్రియ మెయిన్ లీడ్‌లో నటించిన చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. పాపారావు బియ్యాల దర్శకత్వంలో యామినీ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన చిత్రమిది. తమిళంలో డబ్బింగ్ చేశారు. మే 12న ఈ సినిమాని హిందీలో పీవీఆర్, తెలుగులో 'దిల్' రాజు రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'మ్యూజిక్ స్కూల్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. దర్శకుడు పాపారావు బియ్యాల (ఐఏఎస్ ఆఫీసర్) మాట్లాడుతూ– ''ప్రస్తుతం తల్లిదండ్రులు, టీచర్స్, సమాజం.. పిల్లలపై చదువు పేరుతో ఒత్తిడిని పెంచేస్తున్నారు. ఇలాంటివి విద్యార్థుల ఎదుగుదలకు సమస్యగా మారుతున్నాయి. ఈ విషయాన్ని సంగీతం రూపంలో వినోదాత్మకంగా చెప్పాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, కెమెరా: కిరణ్ డియోహన్స్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	40	57,614
నిఫ్టీ ▽	34	16,952

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,650	▽	118
డోజోన్స్	32,348	▽	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,484	△	12
డాక్స్	15,142	△	14
షాంఘై	3,245	△	6
నికాయ్	27,518	△	41

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (24 క్యారట్)	58,956	▽	131
బంగారం (22 క్యారట్)	58,729	▽	72
వెండి (కేజీ)	69,500	▽	73

పాన్-ఆధార్ అనుసంధానానికి గడువు పెంపు

జూన్ 30 వరకూ అవకాశం



న్యూఢిల్లీ: పాన్, ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు నిర్దేశించిన గడువును ప్రభుత్వం మరో మూడు నెలల పాటు జూన్ 30 వరకూ పొడిగించింది. వాస్తవానికి ఇది మార్చి 31తో ముగియాల్సి ఉంది. అయితే, ఆధార్‌తో పాన్‌ను అనుసంధానం చేసుకునేందుకు ప్రజలకు మరింత సమయం ఇవ్వాలంటూ రాజకీయ పార్టీలు సహా పలు వర్గాల నుంచి డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్యాక్స్‌పేయర్లకు మరికాస్త సమయం ఇచ్చే క్రమంలో పాన్, ఆధార్‌ను లింక్ చేసుకునేందుకు గడువు తేదీని 2023 జూన్ 30 వరకు పెంచినట్లు ఆర్థిక శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిర్దేశిత గడువులోగా వీటిని లింకు చేసుకోని వారి పాన్ నంబర్లు జూలై 1 నుంచి పనిచేయవు. దీని వల్ల ట్యాక్స్‌పేయర్లు ట్యాక్స్ రీఫండ్‌లను గానీ వాటిపై వడ్డీలను గానీ క్లెయిమ్ చేసుకోవడానికి వీలుండదు. అలాగే వారికి టీడీఎస్, టీసీఎస్ భారం కూడా ఎక్కువగా ఉంటుంది. పాన్, ఆధార్ అనుసంధానానికి ప్రభుత్వం డెడ్‌లైన్‌ను పలు దఫాలు పొడిగిస్తూ వస్తోంది. వాస్తవానికి గతేడాది (2022) మార్చి ఆఖరు నాటికే పాన్‌ను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని తొలుత గడువు విధించారు. అది దాటాకా 2022 ఏప్రిల్ 1 నుంచి రూ. 500 జరిమానా ప్రతిపాదించారు. దాన్ని గతేడాది జూలై 1 నుంచి రూ. 1,000కి పెంచారు. ప్రస్తుతం ఇదే పెనాల్టీ అమలవుతోంది. ఇప్పటివరకు 51 కోట్ల పాన్‌లు (పర్మనెంట్ అకౌంటు నంబర్) ఆధార్‌తో అనుసంధానమయ్యాయి.

నామినీ అప్‌డేట్ గడువు పొడిగింపు: సెబీ



న్యూఢిల్లీ: ప్రస్తుత డీమ్యాట్ ఖాతాదారులు, మ్యూచువల్ ఫండ్(ఎంఎఫ్) ఇన్వెస్టర్లకు నామినీ వివరాలు అప్‌డేట్ చేయడం లేదా తొలగించేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గడువును ఆరు నెలలు పొడిగించింది. ప్రస్తుత గడువు మార్చి 31తో ముగియనుండగా.. ఈ ఏడాది సెప్టెంబర్ 30వరకూ అనుమతిస్తూ తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. 2021 జూలైలో తొలుత అర్హతగల ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాదారులంతా 2022 మార్చి31లోగా నామినీ వివరాలు దాఖలు చేయవలసిందిగా సెబీ ఆదేశించింది. ఇలా చేయని ఖాతాలను డెబిట్‌లు చేపట్టేందుకు వీలు లేకుండా నిలిపివేయనున్నట్లు తెలియజేసింది. తదుపరి 2023 మార్చి31లోగా డీమ్యాట్ ఖాతాలు, ఎంఎఫ్ ఫోలియోలకు నామినీ వివరాలు జత చేయడం తప్పనిసరి చేసింది. వెరసి నామినీ వివరాలు అందించడం లేదా నామినేషన్‌ను ఉపసంహరించేందుకు మరో ఆరు నెలల గడువు లభించింది. 2022 ఆగస్ట్1 లోగాఎంఎఫ్ సబ్‌స్క్రయిబర్లకు నామినీ వివరాలివ్వడం లేదా నామినేషన్ నుంచి తప్పుకునేందుకు 2022 జూన్‌లో సెబీ తప్పనిసరి చేసింది. ఆపై 2022 అక్టోబర్ 1వరకూ గడువు పెంచింది. తదుపరి 2023 మార్చి31వరకూ మరోసారి గడువు పొడిగించింది. 2021 అక్టోబర్ తదుపరి డీమ్యాట్ ఖాతాలు తెరిచే ఇన్వెస్టర్లకు డిక్లరేషన్ ఫామ్ ద్వారా నామినీ వివరాలిచ్చేందుకు వీలు కల్పించింది. ఇదేవిధంగా నామినేషన్‌ను తప్పించేందుకూ వీలుంది.

క్యూ1లో హైరింగ్ అప్

- 10 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా
- టీమ్‌లీజ్ నివేదిక



ముంబై: అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు నెలకొన్నప్పటికీ సర్వీసులు, తయారీ రంగాల కంపెనీలు మాత్రం నియామకాలపై ఆసక్తి చూపుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోలిస్తే 2023-24 క్యూ1లో ఇది 10 శాతం అధికంగా ఉండగలదని అంచనాలు నెలకొన్నాయి. అయితే, 2022-23 నాలుగో త్రైమాసికంతో పోలిస్తే మాత్రం 4 శాతం తక్కువగా ఉండనున్నట్లు తెలుస్తోంది. టీమ్‌లీజ్ సర్వీసెస్‌కి చెందిన ఉపాధి అంచనాల నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 14 రంగాలకు చెందిన 809 చిన్న, మధ్య తరహా, భారీ సంస్థలపై చేసిన సర్వే ఆధారంగా టీమ్‌లీజ్ దీన్ని రూపొందించింది. ఇందులో పాల్గొన్న 64 శాతం మంది యజమానులు తమ సిబ్బంది సంఖ్యను పెంచుకోవాలని ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. నివేదిక ప్రకారం సర్వీస్, తయారీ రంగాల్లో క్యూ1లో ప్రధానంగా ఎంట్రీ, జూనియర్ స్థాయి నియామకాలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సర్వీసుల్లో ఇవి వరుసగా 73 శాతం, 71 శాతంగా ఉండగా .. తయారీలో 49 శాతం, 55 శాతంగా ఉన్నాయి. మధ్య స్థాయి ఉద్యోగాలకు సంబంధించి సర్వీసుల్లో 54 శాతంగాను, తయారీలో 32 శాతంగాను ఉన్నాయి.

అత్యధికంగా సర్వీస్ రంగంలో..

తయారీ విభాగంతో పోలిస్తే సర్వీసుల రంగంలో హైరింగ్‌కు ఎక్కువగా ఆస్కారం ఉంది. సేవా రంగం విషయానికొస్తే ఇది టెలికమ్యూనికేషన్స్‌లో 96%, ఆర్థిక సర్వీసులు (93%), ఈ-కామర్స్.. అనుబంధ స్టార్టప్‌లు (89%), రిటైల్ (87%), విద్యా సర్వీసుల్లో 83%గా ఉంది. తయారీ రంగంలో హెల్త్‌కేర్ .. ఫార్మాలో 91 శాతంగా, ఎఫ్‌ఎంసీజీలో 89 శాతంగా, ఎలక్ట్రిక్ వాహనాలు.. మౌలిక సదుపాయాల కల్పనలో 73 శాతంగా ఉంది.

స్మార్ట్ కీతో యాక్టివా 125

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా తాజాగా ఆధునీకరించిన ఇంజన్‌తో యాక్టివా 125 స్కూటర్‌ను నాలుగు వర్షన్స్‌లో విడుదల చేసింది. డ్రమ్, డ్రమ్ అలాయ్, డిస్క్, హెచ్-స్మార్ట్ వీటిలో ఉన్నాయి. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.81,342 నుంచి రూ.90,515 వరకు ఉంది. అయిదు రంగుల్లో లభిస్తుంది. స్టార్ట్/స్టాప్ ఫీచర్, సైడ్ స్టాండ్ కట్ ఆఫ్ స్విచ్, ఎక్స్‌టర్నల్ ఫ్యూయల్ ఫిల్లర్ క్యాప్, ఓపెన్ గ్లోవ్ బాక్స్, ఎల్‌ఈడీ పొజిషన్ ల్యాంప్‌తో ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్ ఉంది.



రియల్ టైమ్ మైలేజ్, ట్యాంకులో ఉన్న ఇంధనంతో ప్రయాణించే దూరం, ఇంధనం ఎంత ఉంది, సగటు మైలేజ్, సమయం వంటి వివరాలను చూపే చిన్న డిజిటల్ స్క్రీన్ పొందుపరిచారు. ఇంధన సమర్థవంతమైన టైర్లను జోడించారు. స్మార్ట్ ఫైండ్, సేఫ్, అన్‌లాక్, స్టార్ట్ ఫీచర్లు గల స్మార్ట్ కీతో టాప్ ఎండ్ వేరియంట్ లభిస్తుంది. వాహనాల మధ్య ఈ స్కూటర్ ఎక్కడ ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు.

కమీషన్లపై బీమా కంపెనీలకు స్వేచ్ఛ

- కమీషన్లపై పరిమితి ఎత్తివేత
- పాలసీదారుల ప్రయోజనాలకు విఘాతం కలగొద్దు
- ఐఆర్‌డీఏఐ ఆదేశాలు

న్యూఢిల్లీ: కమీషన్ల పరంగా పరిమితులను బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) తొలగించింది. బీమా కంపెనీలు తమ పాలసీలను విక్రయించే మధ్యవర్తులకు కమీషన్లు చెల్లిస్తుంటాయి. ఈ భారం పరోక్షంగా పాలసీదారులపైనే పడుతుంది. అందుకే లోగడ ఈ విషయంలో ఐఆర్‌డీఏఐ పరిమితులు పెట్టింది. తాజాగా వీటిని ఎత్తివేస్తున్నట్టు తెలిపింది. మధ్యవర్తులకు ఎంత కమీషన్ చెల్లించాలన్నది బీమా కంపెనీలే నిర్ణయించుకోవచ్చని పేర్కొంది. కాకపోతే పాలసీదారుల ప్రయోజనాలకు భంగం కలగకుండా ఇది ఉండాలని స్పష్టం చేసింది. పాలసీదారులు, ఏజెంట్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కమీషన్ పాలసీని ఇన్సూరెన్స్ కంపెనీ బోర్డ్ రూపొందించుకోవాలంటూ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. కమీషన్లలో సౌలభ్యం ఉంటే అది దేశంలో బీమా కవరేజీ వ్యాప్తికి దోహదపడుతుందని, వ్యయాల పరంగా సామర్థ్యాలను పెంచుతుందని పేర్కొంది. బోర్డు స్థాయిలో నిర్ణయించే కమీషన్ అనేది తాజా నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిర్వహణ వ్యయ పరిమితుల పరిధిలోనే ఉండాలని స్పష్టంగా నిర్దేశించింది. నూతన నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. నోటిఫికేషన్ తేదీ నుంచి ప్రతి మూడేళ్లకోసారి నిబంధనలను సమీక్షిస్తామని ఐఆర్‌డీఏఐ ప్రకటించింది. ఇప్పటి వరకు బీమా కంపెనీలు చెల్లించే కమీషన్లను ఉత్పత్తుల వారీగా ఐఆర్‌డీఏఐ నిర్ణయిస్తోంది. తాజా సవరణలు ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయనే అభిప్రాయాన్ని ఐఆర్‌డీఏఐ వ్యక్తం చేసింది. నూతన వ్యాపార నమూనాలు, ఉత్పత్తులు, వ్యూహాల అభివృద్ధికి వీలు కల్పిస్తాయని పేర్కొంది. సవరించిన నిర్వహణ వ్యయ పరిమితులు, కమీషన్ పరిమితులు అనేవి సరైన మార్గంలో ఉన్నాయని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ తపన్ సింఘాల్ తెలిపారు.



ఎవలాన్ టెక్ @ 415-436

- ఏప్రిల్ 3-6 మధ్య ఐపీవో

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ తయారీ సర్వీసుల కంపెనీ ఎవలాన్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 415-436 ధరల శ్రేణి ప్రకటించింది. ఏప్రిల్ 3న ప్రారంభంకానున్న ఇష్యూ 6న ముగియనుంది. తద్వారా కంపెనీ రూ. 865 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఈ నెల 31న షేర్లను విక్రయించనుంది.



ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 545 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. షేర్ల జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 34 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఏప్రిల్ 18న షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టుకానున్నాయి. ఎండ్‌టుఎండ్ ఎలక్ట్రానిక్ మ్యాన్యుఫాక్చరింగ్ సరీ్వస్ సొల్యూషన్లు అందిస్తున్న ఎవలాన్ టెక్ 1999లో ఏర్పాటైంది. యూఎస్‌తోపాటు దేశీయంగా 12 తయారీ ప్లాంట్లను నిర్వహిస్తోంది. 2021-22లో రూ. 840 కోట్ల ఆదాయం సాధించింది.

పరిమిత శ్రేణిలో ట్రేడింగ్

- ఎఫ్అండ్‌ఓ ఎక్స్‌పైరీ ముందు అప్రమత్తత
- స్వల్పంగా నష్టపోయిన సూచీలు



ముంబై: ట్రేడింగ్‌లో లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. మార్చి నెలవారీ ఎఫ్అండ్‌ఓ ఎక్స్‌పైరీ(నేడు)కి ముందురోజు ట్రేడర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు దేశీయ ట్రేడింగ్ ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఉదయం సెన్సెక్స్ 98 పాయింట్ల లాభంతో 57,752 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 455 పాయింట్ల పరిధిలో 57,495 వద్ద కనిష్టాన్ని, 57,949 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 40 పాయింట్ల నష్టంతో 57,614 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44 పాయింట్లు పెరిగి 17,032 వద్ద మొదలైంది.ఇంట్రాడేలో 16,914 -17,062 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 34 పాయింట్లు పతనమై 16,952 వద్ద ముగిసింది. ప్రైవేట్ రంగ బ్యాంక్స్ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్ల భారీ నష్టాలను చవిచూశాయి. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.79%, 0.42 శాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1531 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.156 కోట్ల షేర్లను విక్రయించారు. కాగా, డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 82.16 స్థాయి వద్ద స్థిరపడింది.

వేదాంతా డివిడెండ్ రూ. 20.5

వేదాంతా లిమిటెడ్ వాటాదారులకు ఐదో మధ్యంతర డివిడెండు ప్రకటించింది. రూ. 1 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 20.5 చొప్పున చెల్లించనుంది. ఇందుకు ఏప్రిల్ 7 రికార్డ్ డేట్‌కాగా.. మొత్తం రూ. 7,621 కోట్లు వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

జాబ్ పాయింట్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబైలో 5000 అప్రెంటిస్‌లు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా సీబీ శాఖల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 5000 (తెలంగాణలో 106, ఆంధ్రప్రదేశ్‌లో 141).
» **కేటగిరీ వారీగా ఖాళీలు:** ఎస్సీ-763, ఎస్టీ-416, ఓబీసీ-1162,ఈడబ్ల్యూఎస్-500,జనరల్- 2159. » **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.
» **వయసు:** 31.03.2023 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. » **స్టైపెండ్:** నెలకు రూ.10,000(రూరల్ బ్రాంచ్), రూ.12,000(అర్బన్ బ్రాంచ్), రూ.15,000(మెట్రో బ్రాంచ్) తోపాటు ఇతర అలవెన్సులు అందుతాయి.
» **ఎంపిక విధానం:**ఆన్‌లైన్ రాతపరీక్ష,ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన,రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ఎంపికచేస్తారు.
» **రాతపరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్,కంప్యూటర్ నాలెడ్జ్,బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్,బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్,బేసిక్ ఇన్‌వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్,బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 03.04.2023.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** ఏప్రిల్ 2వ వారం, 2023.
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఈపీఎఫ్‌వో, న్యూఢిల్లీలో 185 స్టెనోగ్రాఫర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో).. రెగ్యులర్ ప్రాతిపదికన స్టెనోగ్రాఫర్(గ్రూప్ సి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 185
» **అర్హత:** పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు స్టెనోగ్రఫీ నైపుణ్యం కలిగి ఉండాలి.
» **వయసు:** దరఖాస్తు చివరితేది నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 నుంచి 15 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3 నుంచి 8 ఏళ్ల సడలింపు ఉంటుంది. » **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్టెనోగ్రఫీ స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. 200 ప్రశ్నలకు-800 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం 130 నిమిషాలు. జనరల్ ఆప్టిట్యూడ్(50 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్(కంప్యూటర్ అవేర్‌నెస్‌తో సహా 50 ప్రశ్నలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(100 ప్రశ్నలు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు 4 మార్కులు ఉంటాయి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 27.03.2023 నుంచి 26.04.2023 వరకు. » **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.04.2023 నుంచి 28.04.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.epfindia.gov.in

ఎన్‌ఆర్‌ఎస్సీ, హైదరాబాద్‌లో 34 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ).. తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 34
» **ఖాళీల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్)-20, ప్రాజెక్ట్ అసోసియేట్1 -07, ప్రాజెక్ట్ సైంటిస్ట్-03, రీసెర్చ్ సైంటిస్ట్-04.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, గేట్/నెట్ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 07.04.2023 నాటికి జేఆర్‌ఎఫ్‌కు 28 ఏళ్లు, ఆర్‌ఎస్‌కు 30 ఏళ్లు, పీఏ, పీఎస్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **పని ప్రదేశం:** ఎన్‌ఆర్‌ఎస్సీ-ఎర్త్ స్టేషన్, షాద్‌నగర్ క్యాంపస్, రంగారెడ్డి జిల్లా లేదా ఎన్‌ఆర్‌ఎస్సీ, బాలానగర్, హైదరాబాద్.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.04.2023.
» **వెబ్‌సైట్:** www.nrsc.gov.in

యూపీఎస్సీలో 40 ఉద్యోగాలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ సంస్థల్లో పనిచేసేందుకు పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **పోస్టుల వివరాలు:** జాయింట్ డైరెక్టర్, హార్టికల్చర్ స్పెషలిస్ట్, అసిస్టెంట్ హార్టికల్చర్ స్పెషలిస్ట్, మార్కెటింగ్ ఆఫీసర్, ఎకనమిక్ ఆఫసర్ తదితరాలు. » **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ/ఎంబీబీఎస్/ఇంజనీరింగ్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. » **పని అనుభవం:** కనీసం 2 నుంచి 10 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2023.
» **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

ఎంబీఏ, ఎంసీఏకు మార్గం.. ఐసెట్

» ఏపీ ఐసెట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» మే 24, 25 తేదీల్లో ఏపీ ఐసెట్ పరీక్ష
» ఈ ర్యాంకుతో ఎంబీఏ, ఎంసీఏల్లో ప్రవేశం
» మేనేజ్‌మెంట్, ఐటీ విభాగాల్లో కొలువులకు మార్గం

మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఎంబీఏ! మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్.. సంక్షిప్తంగా ఎంసీఏ! ఇవి డిగ్రీ చదువుతున్న విద్యార్థుల్లో.. ఎక్కువ మంది ఆసక్తి చూపే కోర్సులు! కారణం.. ఈ కోర్సులతో మేనేజ్‌మెంట్, ఐటీ రంగాల్లో కొలువు సొంతం చేసుకోవచ్చనే ధీమా! ఆంధ్రప్రదేశ్‌లో ఈ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే.. ఏపీ ఐసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఏపీ ఐసెట్-2023 వివరాలు, పరీక్ష విధానం, విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై విశ్లేషణ..



ఐసెట్‌గా సుపరిచితమైన ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్- 2023కు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు, సీట్లు; ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తున్న వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు అందరికీ సీట్లు లభించే అవకాశముంది. కాని టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు సొంతం చేసుకోవాలంటే మాత్రం వేయి లోపు ర్యాంకుతోనే సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అర్హతలు

- ఎంబీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- ఎంసీఏ: 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్మీడియెట్ లేదా డిగ్రీ స్థాయిలో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు 45 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

200 మార్కులు.. మూడు విభాగాలు

- మొత్తం 200 మార్కులకు మూడు విభాగాల్లో ఏపీ ఐసెట్ ఉంటుంది. అభ్యర్థుల్లోని లాంగ్వేజ్, మ్యాథమెటికల్ స్కిల్స్, కాంప్రహెన్షన్ స్కిల్స్‌ను పరీక్షించే విధంగా ఆయా విభాగాలు, ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్‌ఏలో అనలిటికల్ ఎబిలిటీ(డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్) 75ప్రశ్నలు-75 మార్కులకు; సెక్షన్ బీలో కమ్యూనికేషన్ ఎబిలిటీ(వొకాబ్యులరీ, ఫంక్షనల్ గ్రామర్, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ, రీడింగ్ కాంప్రహెన్షన్) 70 ప్రశ్నలు-70 మార్కులకు; సెక్షన్ సీలో మ్యాథమెటికల్ ఎబిలిటీ(అర్థమెటికల్ ఎబిలిటీ, అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ) 55 ప్రశ్నలు-55 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.
- పరీక్షను రెండు సెషన్లుగా నిర్వహిస్తారు. రెండు సెషన్లలో హాజరైన అభ్యర్థులు పొందిన మార్కులను నిర్దిష్ట విధానంలో నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా గణించి ర్యాంకులు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 19, 2023
- రూ.వేయి ఆలస్య రుసుముతో ఏప్రిల్ 26 వరకు; రూ.2000 ఆలస్య రుసుముతో: మే 3 వరకు; రూ.3000 ఆలస్య రుసుముతో మే 10 వరకు; రూ.5,000 ఆలస్య రుసుముతో మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** మే 16, 17 తేదీల్లో
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** మే 20 నుంచి
- **ఏపీ ఐసెట్ పరీక్ష తేదీ:** మే 24, 25, 2023
- **వెబ్‌సైట్:**https://cets.apsche.ap.gov.in

విజయానికి అడుగులు ఇలా

ఐసెట్ పరీక్షలో విజయం సాధించాలంటే..అభ్యర్థులు విశ్లేషణాత్మక దృక్పథం, అన్వయ నైపుణ్యాలను అలవర్చుకోవాలి. పరీక్ష తీరు, సిలబస్ స్థాయిపై అవగాహన పొందాక విభాగాల వారీగా ప్రిపరేషన్‌తోపాటు ప్రతి రోజూ ప్రాక్టీస్ కొనసాగించాలి.

డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్

ఈ విభాగంలో ఉండే డేటా సఫిషియెన్సీ; ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాల్లో రాణించాలంటే.. అభ్యర్థులు తమ విశ్లేషణ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి.

ప్రశ్నలు డేటా ఇచ్చి దాని ఆధారంగా సమస్య సాధించేవిగా, స్టేట్‌మెంట్ ఆధారితంగా ఉంటాయి. బేసిక్ అర్థమెటిక్ అంశాల్లో పట్టు సాధించడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. గణితంపై ప్రాథమిక అవగాహన అవసరం. ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు కోడింగ్, డీ-కోడింగ్, బ్లడ్ రిలేషన్, సిరీస్, సిలాజిజమ్, సీటింగ్ ఎరేంజ్‌మెంట్ వంటి అంశాల్లో పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- కొంత సులభమైన విభాగంగా సెక్షన్-బి(కమ్యూనికేషన్ ఎబిలిటీ)ని పేర్కొనొచ్చు. కాసింత ప్రాక్టీస్, అనలిటికల్ ఎబిలిటీ, కంపేరిటివ్ అప్రోచ్ ఉంటే మొత్తం 70 ప్రశ్నల్లో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించొచ్చు.
- వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. వొకాబ్యులరీ పెంచుకునేందుకు ప్రతి రోజు కనీసం 20 కొత్త పదాలు నేర్చుకోవడంతోపాటు వాటిని వినియోగించే విధానాన్ని ప్రాక్టీస్ చేయాలి.
- ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం సినానిమ్స్, యాంటానిమ్స్, కొశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌లను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ గ్రామర్ బుక్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.
- బిజినెస్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీలో వ్యాపార-వాణిజ్య అంశాలు, తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. వీటిలో రాణించాలంటే.. బిజినెస్ టెర్మినాలజీ, కొత్త వ్యాపార విధానాలు, ఆయా సంస్థలు-వాటి క్యాప్షన్లు వంటివి తెలుసుకోవాలి. ఇక కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన ముఖ్య భాగాలు, వాటి పనితీరుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం కలిసొస్తుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో.. ప్యాసేజ్‌ల ఆధారంగా అడిగే 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులు అందులోని కీలక పదాలను, కీలక సారాంశాన్ని గ్రహించే నేర్పు అవసరం. ఇందుకోసం దినపత్రికల వ్యాసాలు, ఇంగ్లిష్ స్టోరీ బుక్స్ చదవడం మేలు చేస్తుంది.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

సెక్షన్-సిగా పేర్కొన్న మ్యాథమెటికల్ ఎబిలిటీలో రాణించేందుకు అర్థమెటిక్, జామెట్రికల్, స్టాటిస్టికల్ అంశాలపై పట్టు సాధించాలి. తొలుత మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలపై అవగాహన పొందాలి. ఇందుకోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నల శైలి కొంత క్లిష్టంగా ఉండే స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను ప్రిపేరవ్వాలి. ముఖ్యంగా ప్రాబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాల కోసం ఇంటర్ పుస్తకాలను చదవాలి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు శాతాలు, లాభ నష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని-కాలం, పని-సమయం వంటి వాటిని అధ్యయనం చేయాలి. అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ కోసం ట్రిగ్నోమెట్రీ,సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్‌లో నైపుణ్యం సాధించాలి.

ప్రాక్టీస్.. సక్సెస్‌కు సాధనం

ఐసెట్‌లో మంచి ర్యాంకు సొంతం చేసుకోవడానికి ప్రధాన సాధనం..ప్రాక్టీస్. ఆయా అంశాల రీడింగ్‌కే పరిమితం కాకుండా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. నిరంతరం మాక్ టెస్ట్‌లకు హాజరవుతూ.. తమ సామర్థ్యాలను విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా క్యాట్, మ్యాట్, ఐసెట్ గత ప్రశ్న పత్రాలను సాధనం చేయాలి. ఫలితంగా పరీక్షలో ప్రశ్నల శైలిపై అవగాహన ఏర్పడుతుంది.

క్లుప్తంగా...

2న కానిస్టేబుల్ డ్రైవర్, మెకానిక్ పోస్టులకు పరీక్ష

సాక్షి, హైదరాబాద్ : కానిస్టేబుల్ డ్రైవర్, అగ్నిమాపకశాఖలో డ్రైవర్ ఆపరేటర్, కానిస్టేబుల్ మెకానిక్ పోస్టులకు ఏప్రిల్ 2న హైదరాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాల్లో రాత పరీక్ష (టెక్నికల్ పేపర్) నిర్వహించనున్నట్లు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అర్హులైన అభ్యర్థులు టీఎస్ఎల్పీఆర్బీ వెబ్‌సైట్‌లో తమ లాగిన్ ఐడీల ద్వారా మంగళవారం రాత్రినుంచి ఈనెల 31 అర్ధరాత్రి వరకు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. హాల్‌టికెట్‌పై పాస్‌పోర్టుసైజ్ ఫొటో (దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసినది మాత్రమే) విధిగా అతికించుకుని పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) పరిధిలో 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ప్రాథమిక మెరిట్ జాబితాను మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మంగళవారం విడుదల చేసింది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం 5.30 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలను దరఖాస్తుదారు లాగిన్‌లో మాత్రమే ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలని బోర్డు సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. మెరిట్ జాబితా, ఇతర వివరాల కోసం mhsrb. telangana. gov.in సందర్శించాలని సూచించారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం వీరికి పది రోజుల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అనంతరం వారి ఆప్షన్ల ప్రకారం పోస్టింగ్ ఇస్తామని తెలిపారు.

ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎంబీబీఎస్ చివరి సంవత్సరం (పార్ట్–2) ఫలితాలను కాళోజీ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయం మంగళవారం ప్రకటించింది. మొత్తం 92.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపింది. మొత్తం 3,046 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి మల్లేశ్వర్ తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www. knruhs. telangana. gov.inలో చూడొచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షలు | రెండు ప్రయత్నాల్లో పూర్తి చేయొచ్చు

ఉక్రెయిన్ విద్యార్థులకు 'సుప్రీం' శుభవార్త ● ఒక ప్రయత్నమన్న కేంద్రం సూచనకు సవరణ ● చైనా, ఫిలిప్పీన్స్ దేశాలకూ వర్తింపజేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఉక్రెయిన్ తదితర దేశాల నుంచి భీతావహ పరిస్థితుల్లో ప్రాణాలు అరచేత పట్టుకొని దేశానికి వచ్చిన ఫైనల్ ఇయర్ వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు సుప్రీంకోర్టు ఊపిరి పోసింది. దేశీయంగా ఏ కళాశాలలోనూ చేరకుండానే రెండు ప్రయత్నాల్లో ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షలు పూర్తి చేసేందుకు అవకాశం ఇచ్చింది. ఏడాది కాలంగా ఆందోళన చెందుతున్న విద్యార్థుల సమస్యకు సుప్రీంకోర్టు పరిష్కారం చూపింది.

చైనా, ఫిలిప్పీన్స్‌లో కరోనా ఆంక్షలు, ఉక్రెయిన్–రష్యా యుద్ధం కారణంగా విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేయలేకపోయిన వైద్య విద్యార్థుల పిటిషన్లను మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విద్యార్థుల అభ్యర్థన దృష్టిలో ఉంచుకొని నిపుణుల కమిటీ కొన్ని సూచనలు చేసిందని కేంద్రం తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ధర్మాసనానికి తెలిపారు. ''ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాల ప్రకారం, భారతీయ కళాశాలల్లో నమోదు చేసుకోకుండా ఎంబీబీఎస్ ఫైనల్ పార్ట్–1, పార్ట్–2 పరీక్షలు (థియరీ, ప్రాక్టికల్) ఒక ఏడాదిలో పూర్తి చేయడానికి అవకాశం ఇస్తాం. అంటే, పార్ట్–2 పరీక్ష రాయాలంటే పార్ట్–1 పూర్తి చేసి ఒక ఏడాది పూర్తి కావాలి. దేశీయంగా ఎంబీబీఎస్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారో అదేవిధంగా థియరీ పరీక్షలు, నిర్ణయించిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. పార్ట్–1, పార్ట్–2 పూర్తి చేసిన తర్వాత రెండు సంవత్సరాల నిర్బంధ రొటేషనల్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. జాతీయ వైద్య కమిషన్ నిర్ణయించిన విధంగా చెల్లింపులు ఉంటాయి. ఈ సిఫార్సులు అత్యవసర చర్యగా భావించాలి.'' అని ఐశ్వర్య భాటి వివరించారు.

''ఉత్తీర్ణత సాధించకపోతే భవిష్యత్తు ఉండదు.. అందుకే'' జాతీయ వైద్య కమిషన్, విదేశీ వైద్య విద్య సంస్థలు అనుసరించే సిలబస్ వేరుగా ఉంటాయని విద్యార్థుల తరఫు సీనియర్ న్యాయవాదులు గోపాల శంకర్‌నారాయణ్,నాగముత్తులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పరీక్ష పూర్తి చేయడానికి ఒక ప్రయత్నంలో సాధ్యం కాకపోవచ్చని పేర్కొన్నారు. ''ఇదేమీ అఖిల భారత బార్ ఎగ్జామినేషన్ కాదు. ఉత్తీర్ణత సాధించకపోతే కనీసం అప్పటికే పూర్తి చేసిన ఎల్ఎల్‌బీ డిగ్రీ ఉంటుంది. విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోతే భవిష్యత్తు ఉండదు'' అని గోపాల శంకర్ నారాయణ్ తెలిపారు. నిపుణుల కమిటీ నిర్ణయంలో జోక్యం చేసుకోమని, అయితే ఒకే ప్రయత్నంలో పరీక్ష పూర్తి చేయాలన్న సూచన ఆందోళన కలిగించే విషయమని ధర్మాసనం అభిప్రాయపడింది. రెండు ప్రయత్నాలు అవకాశం ఇవ్వాలన్న సవరణ చేయాలని కమిటీని ఆదేశించింది. ''కమిటీ నివేదికను చిన్న మార్పుతో పరిగణనలోకి తీసుకుంటాం. పార్ట్–1, పార్ట్–2 (థియరీ, ప్రాక్టికల్) పరీక్షలు పూర్తి చేయడానికి రెండు అవకాశాలు ఇవ్వాలి'' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొంది. మానవతా దృక్పథంతో భారతీయ వైద్య కళాశాలల్లో ప్రవేశం కల్పించాలని సుప్రీంకోర్టును విద్యార్థులు ఆశ్రయించారు. జాతీయ వైద్య కమిషన్‌తో సంప్రదింపులు చేసి దీనికి పరిష్కారం కనుక్కొనే దిశగా నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని గతంలో కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది.

దరఖాస్తు గడువు నేడు.. కాంట్రాక్టు ముగిసేది ఎల్లుండి!

- **ఐఎంఎస్ కొలువుల భర్తీ ప్రక్రియలో అనుమానాలెన్నో!**
- **దరఖాస్తులకు రసీదు ఇవ్వని అధికారులు.. గందరగోళంలో అభ్యర్థులు**



సాక్షి, హైదరాబాద్: ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) డైరెక్టరేట్ పరిధిలోని కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అభ్యర్థుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. ఉద్యోగ ప్రకటననుంచి దరఖాస్తు ప్రక్రియ వరకు అపోహలు తలెత్తుతుండటం..దీనిపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఐఎంఎస్ ఆ. ధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రుల్లో 231 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అత్యవసర కేటగిరీకి చెందిన ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయాలంటూ కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణికుముదిని ఉత్తర్వులు జారీచేశారు. దీని ప్రకారం ఐఎంఎస్.. జిల్లాల వారీగా ఖాళీలను ప్రకటిస్తూ నోటిఫికేషన్లు ఇచ్చింది. వీటిని జిల్లా స్థాయి కమిటీల ద్వారా భర్తీ చేస్తారు. కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఐఎంఎస్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు కన్వీనర్‌గా, డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌లు సభ్యులుగా ఉంటారు.

దరఖాస్తు ప్రక్రియలో లోపాలు

దరఖాస్తులను మాన్యువల్ పద్ధతిలోనే స్వీకరించనున్నట్లు ఐఎంఎస్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దరఖాస్తుల స్వీకరణకు ఐఎంఎస్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. సాధారణంగా మాన్యువల్ పద్ధతిలో దరఖాస్తు తీసుకున్నాక.. దరఖాస్తుకు జతచేసిన పత్రాలకు సంబంధించిన చెక్‌లిస్ట్‌ను అభ్యర్థికి రసీదు రూపంలో ఇవ్వాలి. అయితే, ఇక్కడ అలాంటిదేమీ జరగట్లేదు. దీంతో పోస్టుల భర్తీలో అవకతవకలకు ఆస్కారం ఉందంటూ అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు జిల్లాల వారీగా ఉద్యోగ ప్రకటనలో రోస్టర్, రిజర్వేషన్ అంశాలను ప్రస్తావించకపోవడాన్నీ తప్పుబడుతున్నారు.

కాంట్రాక్టు ఎప్పటివరకు?

కార్మికశాఖ జారీచేసిన జీఓ 25 ప్రకారం ఐఎంఎస్‌లో 231 కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీకి సంబంధించినఏడాది కాంట్రాక్టు గడువు ఈనెల 31తో ముగియనుంది. ఒకవైపు 31వ తేదీతో కాంట్రాక్టు గడువు ముగియనుండగా.. 29 వరకు దరఖాస్తులను స్వీకరిస్తుండటం గమనార్హం. ఈనెల 30కల్లా ఇంటర్వ్యూలు నిర్వహించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు వెనువెంటనే జారీచేసినా అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరే నాటికే కాంట్రాక్టు గడువు ముగుస్తుందని ఐఎంఎస్ అధికారులే చెబుతున్నారు. ఈ నిబంధన కూడా ఉద్యోగార్థుల్లో గందరగోళం రేకెత్తిస్తోంది.

యాదాద్రి, వర్గల్ ఆలయాలకు ఫుడ్ సేఫ్టీ గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీవిద్యా సరస్వతి దేవస్థానాలకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జాతీయ సర్టిఫికెట్ 'భోగ్'– బ్లిస్ ఫుల్ హైజీన్ ఆఫరింగ్ టు గాడ్ గుర్తింపు లభించింది. దేశంలో 70కి పైగా దేవాలయాలు ఈ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా రాష్ట్రంలోని రెండు దేవాలయాలకు ఈ గుర్తింపు లభించింది. కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక ఆడిట్ బృందం యాదాద్రి, వర్గల్ దేవాలయాలు సందర్శించి నైవేద్యం, అన్నప్రసాదాల నాణ్యత, కిచెన్ నిర్వహణ, ఆహారం తయారు చేసే విధానం, ఈ క్రమంలో పాటిస్తున్న శుచి, శుభ్రత అంశాలపై పరిశీలన చేసింది. ఫుడ్ సేఫ్టీ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించుకున్న కేంద్ర బృందం భోగ్ గుర్తింపునకు రిఫర్ చేసింది. కాగా, తెలంగాణలో తొలిసారిగా యాదాద్రి, వర్గల్ దేవాలయాలకు భోగ్ గుర్తింపు లభించడం సంతోషించదగ్గ విషయమని మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తంచేశారు.

● మరో పరీక్ష వాయిదా..

జూన్ 17న హార్టికల్చర్ ఆఫీసర్ అర్హత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీలో వివిధ అర్హత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో మరో పరీక్ష వాయిదా పడింది. రాష్ట్ర ఉద్యానవన శాఖ పరిధిలోని హార్టికల్చర్ ఆఫీసర్(హెచ్ఓ) పోస్టుల భర్తీకి సంబంధించి ఏప్రిల్ 4న నిర్వహించాల్సిన అర్హత పరీక్షల తేదీల్లో మార్పులు చేసింది. ఏప్రిల్ 4న ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. తాజాగా జూన్ 17న పరీక్షను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతి త్వరలో మరిన్ని పరీక్షల తేదీలపై కమిషన్ స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.





హైకోర్టు ఆవరణలో ఈ–గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్. చిత్రంలో జస్టిస్ నవీన్‌రావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రఘునాథ్, కార్యదర్శి మల్లారెడ్డి, స్పోర్ట్స్ కార్యదర్శి రాజు తదితరులు

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.